



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 298 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 15 జూలై 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాముఖ్యతను పౌరులు అర్థం చేసుకోవాలి



- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- పౌరులు తమ వాక్ స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ విలువలను అర్థం చేసుకొని స్వీయ నియంత్రణ, సంయమనం పాటించాలి
- 'తాము సెన్సార్‌షిప్ గురించి మాట్లాడటం లేదు.. ప్రజలు తమంతట తామే బాధ్యత వహించాలి
- సుప్రీంకోర్టు, రాష్ట్రం (ప్రభుత్వం) ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకోవాలని ఎవరూ కోరుకోరు



# ఇంచార్జి సీఎంగా పవన్ కల్యాణ్?

- ఆ నాలుగు రోజులే ఛాన్స్..?
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగు రోజులు పాటు సింగపూర్‌లో పర్యటించబోతున్నారు
- ఈ నేపథ్యంలో ఇంచార్జి సీఎంగా పవన్‌కు బాధ్యతలు అప్పగించనున్నారని ప్రచారం
- సీఎం చంద్రబాబుతో మంత్రులు నారా లోకేశ్, నారాయణ, టీజీ భరత్ సింగపూర్ వెళ్లనున్నారు.
- ముఖ్యమంత్రి టూర్‌కు వెళ్లినప్పుడు ఇంచార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదు
- కాకపోతే గతంలో ఆపరేషన్ కోసం ఎన్టీఆర్ అమెరికా వెళ్లినప్పుడు నాదెండ్ల భాస్కర్‌ను ఇంచార్జిగా నియమించారు
- అయితే ఆ తర్వాత వివాదంకావడంతో తెలుగుదేశం పార్టీకి ఆగస్టు నెల గండం ఉందనే ప్రచారం జరిగింది.

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్**

ఏపీలో ఓ ప్రచారం వైరల్ అవుతోంది. రాష్ట్ర ఇంచార్జి ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ ఉండబోతున్నారనే వార్త హల్ చల్ చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగు రోజులు పాటు సింగపూర్‌లో పర్యటించబోతున్నారు. ఈ నేపథ్యంలో ఇంచార్జి సీఎంగా పవన్‌కు బాధ్యతలు అప్పగించనున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ నెల 26 నుంచి 30 వరకూ చంద్రబాబు సింగపూర్ లో పర్యటించనున్నారు. సీఎం చంద్రబాబుతో మంత్రులు నారా లోకేశ్, నారాయణ, టీజీ భరత్ సింగపూర్ వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఇంచార్జి బాధ్యతలు అప్పగిస్తారని పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా చర్చ జరుగుతోంది. అయితే రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగలేదు. - మిగతా 2లో

# నాగబాబుకు నో ఛాన్స్

- అలా చెక్ పెట్టిన పవన్ కళ్యాణ్!
- ఇప్పుడు ఉన్న మంత్రులలో కొంతమందిని తొలగించి కొత్త వారికి అవకాశం ఇస్తారని ప్రచారం
- అయితే భారీ మార్పులు చేపట్టడానికి కొంత సమయం పట్టే అవకాశం
- మరో ఏడాది దాటితేనే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిపితే మేలన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లు ప్రచారం
- బిజెపికి మరో మంత్రి పదవి కేటాయించాలని కేంద్ర పెద్దలు కోరుతున్నట్లు తెలుస్తోంది.



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్**

ఏపీ క్యాబినెట్ విస్తరణ ఎప్పుడు జరుగుతుందా అన్న ఎదురుచూపులు అందరిలో కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఉన్న మంత్రులలో కొంతమందిని తొలగించి కొత్త వారికి అవకాశం ఇస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే భారీ మార్పులు చేపట్టడానికి - మిగతా 2లో




## విభేదాలు.. వివాదాలుగా మారకూడదు

- భారత విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ సూచన
- దూరదృష్టితో ఆలోచించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది
- బాధ్యతాయుతంగా మన రెండు దేశాలు దానిని కొనసాగించాలి



## నేరాల రాజధానిగా బిహార్

- నిరుద్యోగ యువత హత్యలు చేస్తూ గూండాలుగా మారుతుంటే.. సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం తన కుర్చీని కాపాడుకునేందుకే తాపత్రయపడుతున్నారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు

- లద్దఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవిందర్ గుప్తా
- హర్యానా గవర్నర్‌గా ప్రొఫెసర్ అషిమ్ కుమార్ ఘోష్,



## పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచండి

- కొనుగోలు కేంద్రాలను పెంచాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- ఒక 1 కేజీ నుంచి 20 క్వింటాల పొగాకు ఉన్న రైతుల వద్ద అర్జెంట్ గా కొనుగోలు చేయండి..పెద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని సూచన
- వీలైనన్ని గోడౌన్స్ ను పెంచండి...అవసరమైతే ప్రైవేట్ గోడౌన్స్ అద్దెకు తీసుకోండి
- రైతులకు నష్టం వాటిల్లకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించిన మంత్రి అచ్చెన్న

# హెచ్చరికలు ఫస్ట్... పెనాల్టీలు నెక్స్ట్

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ముందు హెచ్చరికలు...
- ఆ తర్వాతే పెనాల్టీలు
- ఆర్టీజీఎస్ పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష
- డేటా లేక్, డేటా అనుసంధానంపై చర్చ
- నేరాలు జరగకుండా చూడాలని సూచన



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్**

నేరాలు జరిగాక కట్టడి చేయడమే కాదు.. జరగకుండా చూసుకోవాలి.. ప్రమాదాలు జరిగాక స్పందించడం కాదు.. ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్ పనితీరుపై సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వాట్సాప్ గవర్నెన్స్, డేటా లేక్, డేటా అనుసంధానం వంటి అంశాలపై చర్చించారు. అనుమానితులను గుర్తించే ఫేషియల్ రికగ్నేషన్ వ్యవస్థ పని తీరు మీద అధికారులు డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. - మిగతా 2లో

## వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒకటి మిస్సయింది

- ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి
- గతంలో కార్యకర్తలకు తగినంత గౌరవం లభించలేదని వెల్లడి
- ఆ లోటుపాట్లను చక్కదిద్దుకుంటామని స్పష్టీకరణ
- ప్రతి కార్యకర్తకు వైసీపీ నాయకత్వం బీమా సౌకర్యం కల్పిస్తోందని వివరణ



## విశాఖపట్నం పోర్ట్ వరల్డ్ టాప్ 20

- కేంద్ర షిప్పింగ్ మంత్రి సోనోవాల్
- ఈ రోజు జరిగిన కాంక్లేవ్ మంచి ఫలితాలు ఇస్తుందని భావిస్తున్నాం
- మారిటైమ్.. ట్రేడ్స్ పై ఫలప్రదమైన చర్చ జరిగింది
- భవిష్యత్తులో క్రూయిజ్ రంగం కీలకంగా పనిచేస్తుంది
- విశాఖ పోర్టు ప్రపంచంలో టాప్ 20 లో ఉంది
- విశాఖపట్నం పోర్టు పరిధిలో 320 కోట్ల రూపాయల ప్రాజెక్టులకు ఈరోజు శంకుస్థాపన చేశాం.'

# మా ఓపికను చేతగానితనంగా తీసుకోవద్దు



- చంద్రబాబు పాలనపై సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి
- మా ప్రభుత్వం వచ్చాక తప్పుడు కేసులు అన్నింటినీ మళ్ళీ ఓపెన్ చేస్తాం
- వాటిపై న్యాయస్థానాల్లో పోరాటం చేస్తాం
- తప్పుడు కేసుల్లో ప్రమేయం ఉన్న అధికారుల్ని సైతం విచారిస్తామని స్పష్టం

**తాడేపల్లి**

మా ఓపికను మీరు చేతగానితనంగా తీసుకోవద్దని కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ప్రభుత్వం వచ్చాక తప్పుడు కేసులు అన్నింటినీ మళ్ళీ ఓపెన్ చేస్తాం. వాటిపై న్యాయస్థానాల్లో పోరాటం చేస్తాం.. తప్పుడు కేసుల్లో ప్రమేయం ఉన్న అధికారుల్ని సైతం విచారిస్తామని స్పష్టం చేశారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న రాక్షస పాలనపై సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. - మిగతా 3లో



## న్యూఢిల్లీలో తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ !

- నేడు న్యూఢిల్లీకి సీఎం చంద్రబాబు
- కేంద్ర మంత్రులతో సమావేశం కానున్న చంద్రబాబు నాయుడు
- తర్వాత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నర్సింహారావు జీవితంపై ప్రసంగించనున్న సీఎం చంద్రబాబు నాయుడు

# హెచ్చరికలు ఫస్ట్... పెనాల్టీలు నెక్స్ట్

-మొదటిపేజీ తరువాయి

"నేరగాళ్ల భరతం పట్టేందుకు టెక్నాలజీని వినియోగించుకోవడం మంచిదే. అయితే నేరం జరిగిన తర్వాత వారిని ట్రేస్ చేసి.. ఆ తర్వాత వారికి శిక్షలు పడేలా చేయడంతో పాటు.. అసలు నేరాలు జరగకుండానే చూడాలి. ముందుగానే అనుమానితులను గుర్తించాలి. వారి కదలికలను ట్రేస్ చేయాలి. వారు ఏ తరహా నేరాలకు పాల్పడ్డారనే అంశాన్ని కూడా డేటా బేస్ లో పెట్టుకోవాలి. వారి కదలికలను గుర్తించి అలెర్ట్ అయితే చాలా వరకు నేరాలను కట్టడి చేయవచ్చు. రౌడీ షీటర్లు, క్రిమినల్స్ కు వారి వారి నేరాలను బట్టి డేటాలో కలర్ కోడింగ్ ఇవ్వాలి. అలాగే కొన్ని ప్రమాదాలను ముందుగా గుర్తించగలిగితే.. వాటిని ముందుగానే నివారించవచ్చు. ఈ మేరకు ఆర్టీజీఎస్ పని తీరు మెరుగుపడాలి" అని చంద్రబాబు చెప్పారు.

**హెచ్చరికలు ఫస్ట్... పెనాల్టీలు నెక్స్ట్**

"రాష్ట్రంలోని అన్ని సీసీ కెమెరాలను అనుసంధానం చేయాలి. ట్రాఫిక్ మేనేజ్మెంట్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ రద్దీ వంటిది జరగ్గకుండా చూసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి వెంటనే చలానాలు విధించకుండా.. సిగ్నల్ జంప్ చేస్తున్న వాహనాల ఫొటోలను ముందుగా వారికి పంపాలి. అలా రెండు మూడుసార్లు చూసి.. వారిలో మార్పు రాకుంటే అప్పుడు చలానాలు విధించాలి. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెద్ద పెద్ద చదువులు చదివిన వారు కూడా సైబర్ నేరాలకు బలి అవుతున్నారు. దర్యాప్తు సంస్థల అధికారులం అంటూ ఫేక్ కాల్స్ వస్తే భయపడిపోతున్నారు. అప్పులు చేసి మరీ కోట్లాది రూపాయలు ఇచ్చేస్తున్నారు. అలాగే ఓటీపీల ద్వారా జరిగే సైబర్ మోసాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి విషయాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది." అని సీఎం వివరించారు.

**ఆర్టీజీఎస్ డేటానే అన్నింటికీ మూలం**

"వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే అందుబాటులో ఉన్న సేవలతో పాటు... మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి. అన్ని రకాల సర్టిఫికెట్లు ఆన్ లైన్ లో తీసుకోవడమే కాకుండా.. ఎప్పుడు కావాలంటే అప్పుడు వాటిని డౌన్ లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించబోతున్నాం. టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నాం. అయితే ఇక్కడితో ఆగిపోకూడదు. టెక్నాలజీని ప్రజలకు చేరువ చేయడం ఎంత ముఖ్యమో.. వారికి అర్థమయ్యేలా చెప్పడం కూడా అంతే ముఖ్యం. వాటిని ఎలా ఉపయోగించాలో విడమరిచి చెప్పాలి. అవసరమైతే.. వాట్సాప్ గవర్నెన్స్ సేవలతో పాటు.. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వం అందించే ఇతర సేవలను ఎలా వినియోగించుకోవాలనే అంశాన్ని వివరిస్తూ చిన్న చిన్న వీడియోలు చేయాలి. వాట్సాప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకుంటున్న వారికి ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయా..? ఎదురైతే.. వాటి వివరాలు.. వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల పైనా.. నిరంతరం పని చేస్తూనే ఉండాలి. వాట్సాప్ గవర్నెన్స్ యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలి. బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా అన్ని శాఖలకు చెందిన రికార్డులను డిజిటలైజ్ చేయాలి. ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా కాకుండా.. డిజిటలైజేషన్.. డేటా సేకరణ, డేటా అప్డేషన్ వంటి వాటి విషయాల్లో అన్ని శాఖలకు ఒకే రకమైన విధానం ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆర్టీజీఎస్ డేటానే అన్ని శాఖలకు ప్రామాణికంగా ఉండాలి. టెక్నాలజీ పరంగా జరుగుతున్న మార్పులను.. అమలు చేయాల్సిన అంశాలను ఆయా శాఖల్లో వివరించేందుకు ప్రత్యేకంగా ఓ అధికారిని నియమించే విధంగా ఆలోచన చేయాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**డ్రోన్ సిటీ అభివృద్ధిపై దృష్టి**

"ఓర్వకల్లులో డ్రోన్ సిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. డ్రోన్ సిటీకి ప్రముఖ కంపెనీలు.. బహుళ జాతి సంస్థలు వచ్చేలా ప్రణాళికలు సిద్దం చేసుకోండి. డ్రోన్ సిటీలో ప్రభుత్వం ఇచ్చే వసతులను.. డ్రోన్ సిటీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించండి. డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా డిఫెన్స్ కంపెనీలను ఒప్పించగలిగితే.. ఎక్కువ పెట్టుబడులు వస్తాయి. అధికారులు ఆ దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది" అని సీఎం వివరించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ !

అమరావతి, జులై 14: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబు నాయుడు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.00 గంటలకు ఆయన న్యూఢిల్లీకి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి అమిత్ షా, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవి, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేర్వేరుగా సమావేశం కానున్నారు.

అలాగే నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వికే సారస్వత్, ఢిల్లీ మెట్రో ఎండీతో సైతం సీఎం చంద్రబాబు భేటీ అవనున్నారు. ఇక ప్రధాని సంగ్రహాలయలో మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నర్సింహారావు జీవితంపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగించనున్నారు. అలాగే భారత పరిశ్రమ సమాఖ్య–సీఐఐ స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు.

**న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు షెడ్యూల్ ఇలా..**

జులై 15వ తేదీ మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్య కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాతో ఆయన నివాసంలో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు.

మధ్యాహ్నం 2. 30 గంటలకు సీఎం చంద్రబాబుతో ఆయన అధికారిక నివాసంలో నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ సమావేశం కానున్నారు.

మధ్యాహ్నం 3.00 గంటలకు సీఎం చంద్రబాబును ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ఢిల్లీ మెట్రో ఎండీ కలవనున్నారు.

సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ప్రధాని సంగ్రహాలయను సీఎం చంద్రబాబు సందర్శించనున్నారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సంస్మరణ సభలో 'పీవీ జీవితం, వారసత్వం'పై ఆయన కీలక ప్రసంగం చేయనున్నారు.

సాయంత్రం 7.00 గంటలకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు.

బుధవారం అంటే.. జులై 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన సమావేశం కానున్నారు.

రాత్రి 7 గంటలకు సీఐఐ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంపై టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో చేపట్టాల్సిన ప్రాజక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల ఆదాయ పెంపుదల తదితర అంశాలతో పాటు.. దేశంలో అధిక వృద్ధి రేటు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ టాస్క్ ఫోర్స్ అధ్యయనం చేసిన విషయం విదితమే. సీఐఐ నిర్వహిస్తున్న కార్యక్రమంలో సీఎం చంద్రబాబుకు ఈ టాస్క్‌ఫోర్స్ నివేదికను అందజేయనుంది.

అనంతరం... రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సీఐఐ పోషించాల్సిన కీలక పాత్రపై సీఎం చంద్రబాబు ప్రసంగించనున్నారు.

గురువారం అంటే.. జులై 17వ తేదీ ఉదయం 9 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడు విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారు.

తెలుగు రాష్ట్రాల సీఎంలు సమావేశం..!

మరోవైపు.. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు న్యూఢిల్లీలో భేటీ అయ్యే అవకాశమున్నట్లు తెలుస్తుంది. కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో వీరిద్దరు భేటీ అయ్యే అవకాశమున్నట్లు సమాచారం. పోలవరం – బనకచర్ల ప్రాజెక్ట్‌పై తెలంగాణలో పలు రాజకీయ పార్టీల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రం నుంచి వచ్చిన అభ్యంతరాలపై ఏపీ ఇప్పటికే సమాధానం ఇచ్చింది. అయితే దీనిపై చర్చలే ముఖ్యమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు సైతం ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దీంతో ఈ అంశంపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో వీరిద్దరు సమావేశమయ్యే అవకాశముందని తెలుస్తుంది. ఇక సీఎం చంద్రబాబు రెండు రోజుల న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నారు. అలాగే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా బుధవారం న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఆయన సైతం అదే రోజు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌లో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టులు, నీటి కేటాయింపులతోపాటు పోలవరం – బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో ఈ సీఎంలు ప్రాథమిక చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది. అయితే పోలవరం – బనకచర్లపై కేంద్రం లేవనెత్తిన అంశాలపై సీఎం చంద్రబాబు ఇప్పటికే సమగ్ర నోట్స్ తయారు చేసినట్లు సమాచారం. అలాగే ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ తెరపైకి తీసుకు వచ్చిన అంశాలను కూడా ఈ సందర్భంగా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్.. తెలుగు రాష్ట్రాల సీఎంలకు ఒకే సారి అపాయింట్‌మెంట్ ఇచ్చారా? లేకుంటే వేర్వేరుగా ఇచ్చారా ? అనే అంశంపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో వీరి భేటీపై కొంత సందిగ్ధత నెలకొంది.

# పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచండి

**గుంటూరు** : మార్క్ ఫెడ్ ద్వారా చేపట్టిన పొగాకు కొనుగోళ్ల వేగాన్ని మరింత పెంచే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. సోమవారం గుంటూరు రూరల్ ప్రాంతంలోని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పొగాకు సాగుచేసే ప్రాంతాలైన ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్ లు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పర్చూరు ఎమ్మెల్యే ఎలూరి సాంబశివరావు, వ్యవసాయ, మార్క్ ఫెడ్ ఉన్నతాధికారులతో పొగాకు కొనుగోళ్లపై మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ రాష్ట్రంలో 2024-25 సంవత్సరంలో నల్లబర్లీ పొగాకు 80 మిలియన్ కిలోల ఉత్పత్తి జరిగిందన్నారు. 22 పొగాకు కంపెనీలు 36.00 మిలియన్ కిలోల పంటను కొనుగోలు చేసాయని అన్నారు. ఈ నెల 21 నుండి సన్న, చిన్నరైతులను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు యాప్ లో నమోదు కాబడని పొగాకు రైతులందరికి లబ్ధి చేకూరేలా మార్క్ ఫెడ్ అధికారులు, సిబ్బంది కొనుగోళ్ల ప్రక్రియను కొనసాగించాలని తెలిపారు. ప్రతి రైతు దగ్గర కేజీ పొగాకు కూడా మిగలడానికి వీల్లేదని, జూలై నెలలో కనిష్టంగా 1 కేజీ నుంచి గరిష్ఠంగా 20 క్వింటాల పొగాకు వరకు ఉన్న రైతుల వద్ద అర్జెంట్ గా పొగాకును కొనుగోళు చేయాలని అధికారులను సూచించారు. చిన్న రైతులకు తోడ్పాటును ఇవ్వటంతో పాటు పెద్ద రైతుల వద్ద కూడా త్వరితగతిన పొగాకు కొనుగోళ్లు పూర్తిచేయాలని ఆదేశించారు. అవసరమైన మేర కొనుగోళ్ల కేంద్రాలను పెంచాలని, గోడౌన్స్ సరిపోకపోతే ప్రైవేట్ గోడౌన్స్ ను అద్దెకు తీసుకోవాలని అన్నారు. కోనుగోలు కేంద్రాల వద్ద నుండి గోడౌన్స్ కు పొగాకును తరలించేందుకు రవాణా ఖర్చుల వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని కలెక్టర్లు మంత్రి దృష్టికి తీసుకురాగ వెంటనే మంత్రి స్పందిస్తూ కేంద్రాల



నుండి గోడౌన్స్ వరకు అయ్యే రవాణా ఖర్చు వలన రైతులు ఇబ్బందులకు గురి అవ్వకూడదని, ఆ ఖర్చును కూడా మార్క్ ఫెడ్ భరిస్తుందని కలెక్టర్లకు హామీ ఇచ్చారు. కొనుగోలు యాప్ లో నమోదైన రైతుల వద్దనే కాకుండా నమోదు కానీ రైతుల వద్ద కూడా పొగాకును కొనాలని అధికారులకు తెలిపారు. రేపటి నుండి రైతులకు సమాచారం చేరవేసే పనిలో అధికారులు ఉండాలని, ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళు జరగాలని, వచ్చే సోమవారం నుండి నూతన ప్రణాళిక ప్రకారం కొనుగోళ్లు యధావిధిగా జరగాలని మంత్రి అచ్చెన్న తెలిపారు. రానున్న సీజన్ లో రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయంగా వేరే పంటలను వేయాలని అందుకు వ్యవసాయ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రైతులకు అందుబాటులోకి ఎరువులు**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 1276 ఆర్ ఎస్ కే , (రైతు సేవా కేంద్రం) పీఏసీఎస్ లలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంటాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఎరువులు వాడకం ఎక్కువ ఉన్న ప్రాంతాలను గుర్తించి మరిన్ని ఆర్ ఎస్ కే ల ద్వారా ఎరువులను రైతులకు అందచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేప్డట్టాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ ఛీప్ సెక్రటరీ బీ. రాజశేఖర్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ డీల్లీరావు, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, మార్కెటింగ్ డైరెక్టర్ సునీత, వ్యవసాయ, మార్క్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

## నాగబాబుకు నో ఛాన్స్..

-మొదటిపేజీ తరువాయి

కొంత సమయం పట్టే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటుతోంది. మరో ఏడాది దాటితేనే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిపితే మేలన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. మరోవైపు ఇటీవల క్యాబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు కొంతమంది మంత్రుల తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచారం నడుస్తోంది. మీరు మారండి.. లేకుంటే కొత్తవారు మంత్రులుగా వస్తారంటూ నేరుగా చంద్రబాబు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో మరోసారి మంత్రివర్గ విస్తరణ పై తెగ చర్చ జరుగుతోంది.

**ఎడతెగని జాప్యం..**

ప్రస్తుతం ఏపీ క్యాబినెట్ లో ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. అది మెగా బ్రదర్ నాగబాబుకు ఖాయమని ప్రచారం జరిగింది. కానీ ఏపీ క్యాబినెట్లో నాగబాబును తీసుకోవడం చాలా జాప్యం జరుగుతోంది. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికై నెలలు దాటుతోంది. కానీ ఇంతవరకు ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు. అయితే నాగబాబు విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అడ్డు తగులుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అన్నదమ్ములిద్దరూ ఏపీ క్యాబినెట్లో ఉంటే అనవసర విమర్శలు వస్తాయని పవన్ భయపడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు నాగబాబు ఒక్కరి కోసమే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపడితే అనవసరంగా ఇబ్బందులు వస్తాయని సీఎం చంద్రబాబు సైతం భయపడుతున్నట్లు సమాచారం. అయితే ఈ విషయంలో ఎటు తేల్చుకోలేక సీఎం పెండింగ్ లో పెట్టారని తెలుస్తోంది.

**ఏపీ క్యాబినెట్లో బిజెపికి పదవి**

మరోవైపు ఏపీ క్యాబినెట్లో బిజెపికి మరో మంత్రి పదవి కేటాయించాలని కేంద్ర పెద్దలు కోరుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం క్యాబినెట్లో బిజెపి నుంచి సత్య కుమార్ యాదవ్ మంత్రిగా ఉన్నారు. ఆయనతో పాటు మరొకరికి అవకాశం ఇవ్వాలని బిజెపి పెద్దలు కోరుకుంటున్నట్లు సమాచారం. అందుకు బదులుగా ఏపీకి కేంద్రంలో ఒక మంత్రి పదవి ఇస్తామని ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ బంపర్ ఆఫర్ ఏపీలో కూటమిలోని ఏ పార్టీకి దక్కుతుందా అని చర్చ ప్రారంభం అయింది. అయితే జనసేనకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం లేకపోవడంతో.. ఆ పార్టీకి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**జనసేన నుంచి ఆయనకే..**

అయితే జనసేన నుంచి మంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. అయితే వారిద్దరినీ కాదని నాగబాబును కేంద్ర మంత్రివర్గంలోకి పంపిస్తారని ప్రచారం సాగుతోంది. పార్టీలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా.. కేంద్రంతో సమన్వయం చేసుకునేందుకు నాగబాబు మంత్రిగా ఉంటే బాగుంటుందని పవన్ అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రి పదవి చేపట్టాలంటే రాజ్యసభ పదవి తప్పనిసరి. ఈ లెక్కన నాగబాబు మరో ఏడాది వెయిట్ చేయక తప్పదు. వచ్చే ఏడాది ఏపీ నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతాయి. అప్పటివరకు నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోకపోతే మాత్రం.. ఆయన కేంద్ర క్యాబినెట్ లో చేరడం ఖాయమని తెలుస్తోంది.

## ఇంచార్జి సీఎంగా పవన్ కల్యాణ్

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి టూర్‌కు వెళ్లినప్పుడు ఇంచార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదు. కాకపోతే గతంలో ఆపరేషన్ కోసం ఎన్టీఆర్ అమెరికా వెళ్లినప్పుడు నాదెండ్ల భాస్కర్‌ను ఇంచార్జిగా నియమించారు. అయితే ఆ తర్వాత వివాదంకావడంతో తెలుగుదేశం పార్టీకి ఆగస్టు నెల గండం ఉందనే ప్రచారం జరిగింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్‌కు ఇంచార్జి సీఎం బాధ్యతలు అప్పగిస్తారనేది ప్రచారం మాత్రమే. అధికారిక ప్రకటన వస్తే తప్ప నిజమని నమ్మలేమని పలువురు విశ్లేషకులు అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒకటి మిస్సయింది

అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ కార్యకర్తలకు గౌరవం మరియు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. గతంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలను గౌరవించడంలో కొన్ని లోటుపాట్లు జరిగాయని, అయితే ఈసారి వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి కార్యకర్తను గౌరవించేందుకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, "అదేదో సినిమాలో క్యారెక్టర్ చెప్పినట్టు, గతంలో మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఒకటి మిస్సయింది. అదేంటంటే... కార్యకర్తలను గౌరవించడం! అది మిస్సయింది. ఈసారి జగన్ గారిని మళ్లీ అధికారంలోకి తెచ్చిన తర్వాత, ప్రతి కార్యకర్తకు తగిన గౌరవం ఇవ్వడమే కాకుండా, వారందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది" అని వెల్లడించారు. ఈ నిర్ణయం కార్యకర్తల బాగోగులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జగన్ కూడా దీనిపై ఆలోచన చేశారని, గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటు పూర్తయిన వెంటనే ఈ బీమా సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని వెల్లడించారు. ఈ చర్య ద్వారా పార్టీ కార్యకర్తలకు ఆర్థిక భద్రతను అందించడంతో పాటు, వారి సేవలను గుర్తించి గౌరవించే లక్ష్యంతో వైసీపీ ముందుకు సాగుతోందని చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు.

## మా ఓపికను చేతగానితనంగా తీసుకోవద్దు

-మొదటిపేజీ తరువాయి

'రాజ్యాంగాన్ని, చట్టాలను చంద్రబాబు ప్రభుత్వం చాలా దారుణంగా దుర్వినియోగం చేస్తోంది. దీన్ని నియంతృత్వం అనాలా..? ఏమనాలి.?. అన్ని వ్యవస్థలను చంద్రబాబు దారుణంగా వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బ తీశారు. టీడీపీ చెప్పినట్టు వినకపోతే వేధిస్తున్నారు. పోలీస్ వ్యవస్థను పూర్తిగా తప్పుడు కేసులు కోసం వాడుతున్నారు. వైఎస్సార్‌సీపీ సమావేశానికి వెళ్తున్నందుకు జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై దాడి చేశారు. టీడీపీ వాళ్ళు గుడివాడలో దారి కాసి గొడవలు చేశారు. పోలీసులు ఉండగానే గంటన్నర సేపు గుండాలు మహిళ జెడ్పీ చైర్మన్‌పై దాడికి దిగారు. పోలీసులు రక్షణలో వాళ్ళు దాడులు చేశారు.కారుని పోలీసులు తాళ్ళు కట్టి తీసుకెళ్లాలని యత్నించారు. పోలీసులు దాడి చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టీడీపీ నాయకులు జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై దాడి చేస్తుంటే ఆపే ప్రయత్నం చేయలేదు. దాడులు జరపకుండా నిలువరించలేదు. తాము అధికారంలో ఉన్నామని,మా గురించి ఎవరు గొంతెత్తి మాట్లాడకూడదనిదాడులు చేస్తున్నారు.

పోలీసులు ఎందుకు ఇంత దారుణంగా వ్యవహరిస్తున్నారు. ఈరోజు తప్పించుకోవచ్చు కానీ అందరూ చట్టం ముందు నిలబడాల్సి ఉంటుంది. దాడి చేసి తిరిగి ఉప్పాల రాముపై అక్రమ కేసు పెట్టారు. మాదాల సునీత అనే మహిళతో ఫిర్యాదు చేయించారు. ఆమె ఫ్లెక్సీలు చించారు. గాయం అయితే కారుతో గుద్దినట్టు కేసు పెట్టారు. ఉప్పాల రాము వెనకాల సీట్లు కూర్చొని ఉంటే ఆయన గుద్దించినట్టు కేసు పెట్టారు.

ఎలాగైనా కేసులు పెడతాం అన్నట్టు ఇష్టానుసారం కేసులు పెట్టేస్తున్నారు. హైకోర్టు అన్ని కోర్టులకు మెకానికల్‌గా రిమాండుకు పంపొద్దు అని ఆదేశాలు ఇచ్చింది. న్యాయస్థానాలపై భయం లేకుండా ఇలాంటి కేసులు పెడుతున్నారు. వైఎస్ జగన్ బంగారు పాళ్యం పర్యటనకు వేలాది మంది రైతులు వచ్చారు. దానికి ఎల్లో మీడియా ఫోటోగ్రాఫర్ వస్తే దాడి చేశారని కేసు పెట్టారు. ఎఫ్ఐఆర్‌ని మార్చి మరి తప్పుడు కేసు పెట్టారు.నెల్లూరులో ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై టీడీపీ వాళ్ళు దాడి చేశారు. పోలీసులు ఉండగానే ప్రసన్న కుమార్ ఇంటిపై దాడి చేశారు.వాళ్ళ ముందే వస్తువులను కాల్చారు. వారం రోజులైనా ఎవరిపైనా కేసు పెట్టలేదు.

## విశాఖపట్నం పోర్ట్ వరల్డ్ టాప్ 20

విశాఖపట్నం : విశాఖపట్నం పోర్ట్ ప్రపంచంలోని 20 అద్భుత నౌకాశ్రయాలలో ఒకటని కేంద్ర షిప్పింగ్ మంత్రి సోనోవాల్ చెప్పారు. ఇవాళ విశాఖ వచ్చిన ఆయన 320 కోట్ల రూపాయలతో చేసిన పోర్ట్ ఆధునీకరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కేంద్ర మంత్రి బిమ్స్ టెక్ పేరుతో మ్యారి టైం కాంక్లేవ్ నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన నిపుణులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సదస్సులో అంతర్జాతీయ వాటర్ వేస్, మారిటైమ్ ట్రేడ్ కి సంబంధించి అర్థవంతమైన చర్చ జరిగింది. ఈ సందర్భంలో మారి టైం ట్రాన్స్ పోర్ట్ అగ్రిమెంట్ జరిగింది. ఈ కాంక్లేవ్ కు ఆరు దేశాల నుండి 26 మంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం 15 జూలై 2025




www.viswam voice.com



# ఆ కిచక ఉద్యోగులను తొలగింపుపై రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తాం

## .... పారామెడికల్ విద్యార్థులతో పర్సనల్గా మీట్ అయినా చైర్ పర్సన్ శైలజ....

**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్**

కాకినాడ రంగరాయ వైద్య కళాశాల పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు లాబ్ సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగింపుకు ప్రభుత్వానికి సూచిస్తున్నామని రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ రంగరాయ కళాశాలను సందర్శించి కళాశాలలో లాబ్ అసిస్టెంట్, టెక్నీషియన్లు తమను లైంగికంగా వేధిస్తున్నారని ఇటీవల ఫిర్యాదు చేసిన పారామెడికల్ విద్యార్థినులను కలుసుకుని వారి పట్ల జరిగిన అకృత్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు నిర్భయం గా వివరాలను తెలిజేసేందుకు , కళాశాల ఆడిటోరియం ఉప మందిరంలో ఇతరులు ఏవరినీ అనుమతించకుండా బాధిత విద్యార్థినిలతో చైర్ పర్సన్ ఏకాంత సమావేశం నిర్వహించారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ సభ్యులతో కూడా సమావేశమై విద్యార్థినుల పట్ల అనుచిత వ్యవహారాల నిరోధానికి చేపట్టవలసిన చర్యలను సూచించారు. అనంతరం ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆర్ఎంసి పారామెడికల్ విద్యార్థినులపై జరిగిన దురాగతాల పట్ల ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేసారు. చదువుకునేందుకు దూర ప్రాంతాల నుండి



వచ్చిన పేద కుటుంబాల బాలికలు లైంగికంగా వేధింపులకు లోనై, మానసికంగా క్షోభకు గురికావడం బాధాకరమన్నారు. న్యాయం జరుగుతుందో లేదోనన్న సంశయం, ఫెయిల్ చేస్తారేమో, ఉద్యోగంలో ఇబ్బందులు కలిస్తారామో నన్న భయాలతో ఇటువంటి వేధింపులకు గురైన విద్యార్థినులు, ఉద్యోగినులు ఫిర్యాదు చేయకుండా మౌనంగా కుమిలిపోతు న్నారన్నారు. కళాశాలలో పనిచేస్తున్న లాబ్ అసిస్టెంట్, ముగ్గురు లాట్ టెక్నిషియన్లు అభ్యంతరకరమైన రీతిలో తమ ఫొటోలు తీసి వన్ టైమ్ యూజ్ మోడ్లో మెస్సెజ్ లుగా పంపి లైంగిక వేధింపులకు గురిచేసారని, ఇలాగే జిజిహెచ్ కు వచ్చే మహిళా రోగుల పట్ల కూడా ఈ నలుగురు వ్యవహించేవారని విద్యార్థినులు తనకు వివరించారన్నారు. దీనిపై 60 మంది విద్యార్థినులు ఈ నెల 8న తమ హెచ్ఓడి కి కంప్లయింట్ చేసి, 9వ తేదీన ప్రిన్సిపాల్కు మెయిల్ ద్వారా తెలియజేశారన్నారు. ఈ ఫిర్యాదులపై కళాశాల ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ విచారించి సమర్పించిన నివేదిక ఆధారంగా దోషులు నలుగురిని ప్రిన్సిపాల్ సస్పెండ్ చేసారని, వీరిపై పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రిమాండ్లో ఉంచామన్నారు. బాధిత విద్యార్థినులలో మైనర్లు కూడా ఉన్నందున దోషులపై ఫోక్స్ చట్టం క్రింద కేసులు నమోదు చేసారన్నారు. దోషులు నలుగురిని ఉద్యోగాల నుండి తొలిగించాలని మహిళా కమీషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుందని తెలిపారు. అనంతరం మహిళా కమీషన్ చైర్ పర్సన్ శైలజ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని సఖీ వన్ స్టాప్ సెంటర్ను సందర్శించి సమస్యలు, నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలను ఆదుకుని, రక్షణ, ఆశ్రయం, సాధికారత కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ పర్యటనలలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ దేవరాజ్ పాటిల్, ఆర్ఎంసి ప్రిన్సిపాల్ ఎ విష్ణువర్ధన్, పిడి-ఐసిడిఎస్ సిహెచ్ఎస్కె దుర్గాదేవి,జిజిహెచ్ సూపరింటెండెంట్ ఎస్ లావణ్యకుమారి, ఏఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





# "ఎస్ఎస్ఐ మంత్ర రోబో" లాంఛనంగా ఆవిష్కరిస్తూ మంత్రి దుర్గేష్ కితాబు

## పేద ప్రజలకు అందుబాటులో అధునాతన ఎస్ఎస్ఐ మంత్ర రోబో

## వైద్య సేవలు

## సాయి హాస్పిటల్స్ ఖ్యాతి మరింత పెరగాలి

## ప్రపంచస్థాయి ప్రమాణాలే లక్ష్యంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఎప్పటికప్పుడు వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, అనుభవజ్ఞులైన వైద్యులతో అధునాతన వైద్య సేవలు అందిస్తున్న ఘనత సాయి హాస్పిటల్స్ కి దక్కుతుందని రాష్ట్ర పర్యాటకశాఖ, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.స్థానిక ఆర్యాపురం లోని సాయి హాస్పిటల్ లో నెలకొల్పిన సరికొత్త నవతరం 'ఎస్ఎస్ఐ మంత్ర రోబో'ను మంత్రి దుర్గేష్ సోమవారం ఉదయం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాన్ని హాస్పిటల్ లోని ఏ బ్లాక్ లో గల సినాప్స్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసారు. ఈసందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలో సాయి హాస్పిటల్ గోదావరి జిల్లాల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుందని అన్నారు. దేశీయ పరిజ్ఞానంతో తయారైన 'ఎస్ఎస్ఐ మంత్ర రోబో' ను కూడా తీసుకురావడం అభినందనీయమన్నారు. పేదప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు హాస్పిటల్ చైర్మన్ అండ్ ఎండి డా కె విజయకుమార్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కోవిడ్ సమయంలో కావచ్చు ఎమెర్జెన్సీ కేసుల విషయంలో కావచ్చు ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించి తగిన వైద్యసేవలు ప్రజలకు అందిస్తున్నారని మంత్రి దుర్గేష్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని,



ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా వైద్యరంగంలో మార్పులు తెచ్చి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రయత్నం చేస్తున్నారని కృత్రిమ మేథ ప్రక్రియను కూడా అందిపుచ్చుకుని వైద్య సేవలు అందించే విధానం వేగంగా రాబోతోందని ఆయన చెప్పారు.గోదావరి జిల్లాలకు మణిహారంగా ఈ ఆసుపత్రి రాణిస్తోందన్నారు. సమగ్ర శిక్షణ పొందిన వైద్యులను అందుబాటులో ఉంచుకుని రోబోటిక్ వైద్యసేవలు అందించడం పట్ల మంత్రి దుర్గేష్ ప్రశంసలు కురిపించారు. మరింత తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యసేవలు అందిస్తూ సాయి హాస్పిటల్స్ ఖ్యాతి మరింత పెరగాలని ఆయన ఆకాంక్షించారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి సాయి హాస్పిటల్ మణిహారం లాంటిదని కొనియాడారు. కోవిడ్ సమయం నుంచి కూడా ఎంతోమందికి ప్రజాభిక్ష పెట్టిన ఆసుపత్రిగా కీర్తిగాంచిందని ఆయన పేర్కొన్నారు. ఎస్ఎస్ఐ మంత్ర రోబో ఆవిష్కరణతో రోబోటిక్ సర్జరీ అన్ని విభాగాల్లో ప్రవేశ పెట్టడం అభినందనీయమన్నారు. ప్రపంచంలో



చాలా దేశాల్లో వైద్యం ఖర్చుతో ఇబ్బందులతో కూడుకుని ఉందని గోరంట్ల చెబుతూ తక్కువ ఖర్చుతో మనం ఇక్కడ వైద్యం అందించడం వలన విదేశాల నుంచి ఇక్కడకు వచ్చి వైద్యం చేయించుకునే పరిస్థితి కన్పిస్తోందని విశ్లేషించారు. వైద్య రంగంలో వస్తున్న అధునాతన వైద్య సేవలను ఎప్పటికపుడు సాయి హాస్పిటల్ అందుబాటులోకి తీసుకువస్తోందని ఆయన ప్రశంసించారు. పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ కె విజయకుమార్ మాట్లాడుతూ రెండేళ్ళ క్రితం మోకాలు మార్పిడి కి జాన్సన్ అండ్ జాన్సన్ రోబోను సాయి హాస్పిటల్ సమకూర్చుకుని గోదావరి జిల్లాలకు అధునాతన వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చామని గుర్తుచేసారు. ఇప్పుడు ఈ రోబో విప్లవంలో మరో అడుగు ముందుకేసి తన అమ్ముల పొదిలో ఎస్ఎస్ఐ మంత్ర రోబోను సమకూర్చుకున్నట్లు ఆయన చెప్పారు. యూరాలజి, జనరల్ సర్జరీ, గాస్ట్రోఎంటరాలజి, బేరియాట్రిక్, క్యాన్సర్ వంటి సర్జరీలకు కూడా ఇపుడు అధునాతన రోబో సర్జరీలు సాయి హాస్పిటల్ లో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ ఆవిష్కరణతో కేవలం చిన్న కోతతో సర్జరీ చేయటానికి అవకాశం కలుగుతుందన్నారు. అత్యంత ఖచ్చితత్వంతో, సమర్ధవంతంగా, విభిన్న విభాగాల్లో రోగులకు ఈ నవతరం ఎస్ఎస్ఐ మంత్ర రోబో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందనటంలో ఏమాత్రం సంశయం లేదన్నారు. అత్యుత్తమ భద్రత, శ్రద్ధతో సేవలందించేందుకు మా వైద్య నిపుణులు కొత్త వైద్య విధానాల్లో ప్రావీణ్యం పొందేందుకు ఎన్నో గంటలు కృషిచేశారని డా విజయకుమార్ చెబుతూ ఆధునిక వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావటమే తమ లక్ష్యం అని స్పష్టంచేసారు. గత తరాల రోబోటిక్ సిస్టంతో పోలిస్తే సర్జరీల ఖర్చును గణనీయంగా తగ్గించేలా రూపకల్పన చేసారని, ఇది అధునాతన వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చే లా వేసిన బలమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. తమ హాస్పటిల్ వైద్య నిపుణుల కృషి, ప్రజల విశ్వాసం తో రాజమహేంద్రవరాన్ని ఆంధ్రప్రదేశ్ లోనే కాకుండా జాతీయ స్థాయిలో వైద్యరంగంలో మెరుగైన వైద్య ప్రమాణాలతో నిలబెడతామన్న పూర్తి విశ్వాసంతో ఉన్నామని ఆయన చెప్పారు. హెల్త్ టూరిజంగా కూడా ఈ నగరాన్ని అభివృద్ధి చేయడంలో తమ వంతు పాత్ర వహిస్తామన్నారు. ఐ ఎం ఏ నగర అధ్యక్షుడు డా పిడుగు విజయభాస్కర్, డా సజ్జా పద్మ హాజరయ్యారు. రోబోటిక్ సర్జరీతో శిక్షణ పొందిన డా రమ్య రోబోటిక్ సర్జరీ ఏవిధంగా చేస్తారో స్క్రీన్ ద్వారా ప్రదర్శించి చూపించారు. హెచ్ ఆర్ మేనేజర్ జి శ్రీనివాస్ స్వాగతం పలుకుగా, సూపరింటెండెంట్ డా మంజూష వందన సమర్పణ చేసారు. జనరల్ సర్జన్ డా పవన్, యూరాలజీ విభాగం వైద్యులు డా హరికృష్ణ,డా శివ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కృత్రిమ మేధతో భవితకు ధీమా

కృత్రిమ మేధ (ఎఐ) అనేది యంత్రాలు మానవులవలే ఆలోచించి, మానవ సామర్థ్యాలను అనుకరించే పనులను చేయగల సాంకేతికత. ఈ సాంకేతికత భారీ డేటాను సేకరించి, గణిత నమూనాలు లేదా అల్గారిథమ్‌ల ద్వారా నమూనాలను గుర్తించి, ఊహలు చేసేందుకు శిక్షణ పొందుతుంది. శిక్షణ తర్వాత, ఈ అల్గారిథమ్‌లు వివిధ అనువర్తనాల్లో ఉపయోగించబడతాయి. కొత్త డేటా నుండి నేర్చుకుంటూ, చిత్రాన్ని గుర్తించటం, భాషా ప్రాసెసింగ్, డేటా విశ్లేషణ వంటి సంక్లిష్ట పనులను మరింత ఖచ్చితత్వంతో నిర్వహిస్తాయి. ఎఐలో ప్రధాన రకాలు ఉన్నాయి. మెషిన్ లెర్నింగ్ డేటా నుండి నేర్చుకుని నిర్దిష్ట పనులను చేస్తుంది. దాని ఖచ్చితత్వం అనుభవంతోపాటు పెరుగుతుంది. డీప్‌లెర్నింగ్ మానవ మెదడును పోలి ఉంటుంది. అది న్యూరల్ నెట్‌వర్క్‌ల ద్వారా సంక్లిష్ట నమూనాలను గుర్తిస్తుంది. వైద్య చిత్రాల విశ్లేషణ, ఉపగ్రహ చిత్రాల్లో కదలికలు, ప్రకంపనలను గుర్తించడం వంటి పనులకు ఉపయోగపడుతుంది. న్యాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్‌ఎల్‌పి) మానవ భాషను అర్థం చేసుకుని, సంభాషించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. జనరేటివ్ ఎఐ టెక్ట్స్, చిత్రాలు, వీడియోల వంటి కొత్త కంటెంట్‌ను సృష్టిస్తుంది. (%జతీమ్ఖ్వం ఎశీత్‌వత్%) కళ, వినోదం, మార్కెటింగ్, సాఫ్ట్‌వేర్ మొదలైన అనేక రంగాల్లో, వాటి అభివృద్ధిలో అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ఎఐ ఏజెంట్లు స్వయంచాలకంగా (తమకు తామే స్వయంగా) నిర్ణయాలు తీసుకుంటాయి. ఏజెంటిక్ ఎఐ బహుళ ఏజెంట్ల సమన్వయంతో సంక్లిష్ట పనులను నిర్వహిస్తుంది. ఉదాహరణకు, పరిశోధన లేదా సాఫ్ట్‌వేర్ సమస్యల వంటివి పరిష్కరిస్తుంది. ఎఐ నాలుగు వర్గాలుగా విభజించబడింది: రియాక్టివ్ ఎఐ సమాచారం ఆధారంగా ఫలితాలను ఉత్పత్తి చేస్తుంది. లిమిటెడ్ మెమరీ ఎఐ గత డేటాను ఉపయోగించి ఊహలు చేస్తుంది. థియరీ ఆఫ్ మైండ్ ఎఐ మానవ భావోద్వేగాలను అర్థం చేసుకునే సైద్ధాంతిక సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. సెల్ఫ్– అవేర్ ఎఐ యంత్రాలకు మానవ స్థాయి స్పృహను ఇవ్వగల సైద్ధాంతిక దశను కలిగి ఉంటుంది. ప్రస్తుతం, ఎఐ సమస్యలను పరిష్కరించడం, పరిష్కారాలను అభివృద్ధి చేయడం, ప్రశ్నలకు సమాధానమివ్వడం, సూచనలను అందించడం వంటివి చేస్తోంది. 'డ్రాప్‌బాక్స్', 'చాట్‌జిపిటి', 'సౌండ్‌రా' వంటి సాధనాలు మన సమయాన్ని ఎంతగానో ఆదా చేస్తాయి. ఉత్పాదకతను పెంచుతాయి. స్మార్ట్ ఫోన్ అసిస్టెంట్లు, ఇ–కామర్స్ సిఫారసు వ్యవస్థలు, స్వయంచాలక వాహనాలు, మోసం గుర్తింపు, ఆరోగ్య సంరక్షణ, వాతావరణ పరిశోధనలో ఎఐ ఉపయోగించబడుతోంది. ఎఐ కొత్త విద్యుత్ అని ఆండ్రూ ఎన్జీ పేర్కొన్నారు. గూగుల్ మ్యాప్స్, టెక్ట్స్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్ వంటి రోజువారీ సాధనాల్లో ఎఐ ఇప్పటికే ఉంది. ఎఐ నైపుణ్యాల డిమాండ్ గత దశాబ్దంలో నాలుగు రెట్లు పెరిగింది. ప్రస్తుతం ఎఐ సంబంధిత ఉద్యోగులకు 11 శాతం ఎక్కువ వేతనం లభిస్తున్నాయి. సమాచారం, ఆర్థిక శాఖ, పరిపాలన రంగాలలో ప్రత్యేకంగా ఎఐని ఉపయోగిస్తున్నారు. అనేక ఇతర రంగాలలో ఎఐ వాడకం నానాటికీ అనూహ్యంగా పెరుగుతోంది. ఎఐ డేటా ఎంట్రీ వంటి పునరావృత (రొటీన్) పనులను ఆటోమేట్‌గా వేగంగా పని చేస్తుంది. భారీ డేటాను సైతం విశ్లేషించి, తార్కిక నిర్ణయాలకు సహాయపడుతుంది. చాట్ బాట్‌లు కస్టమర్ డిమాండ్ మేరకు స్ట్రీమ్‌లైన్ చేస్తాయి. జెపి మోర్గాన్ ఒమ్ని ఎఐ ప్లాట్‌ఫారమ్ ఆర్థిక అంతర్ దృష్టులను అందించి, ఖర్చులను తగ్గిస్తుంది. 2028 నాటికి 90 శాతం యజమానులు ఎఐని అమలు చేయాలని ప్లాన్ చేస్తున్నారు.ఎఐ ఆటోమేషన్ 25 శాతం ఉద్యోగాలను భర్తీ చేయవచ్చు. కానీ సైబర్ సెక్యూరిటీ, డేటా విశ్లేషణ వంటి కొత్త రంగాల్లో అవకాశాలను మరింత ఎక్కువగా సృష్టించే అవకాశం ఉంది. ఆర్థికం, ఇ– కామర్స్, ఆరోగ్య సంరక్షణ, విద్య, బీమా, న్యాయ సేవలు ఇలా అనేక రంగాల్లో ఎఐ వాడకం విస్తరించుకుంటూ పోతుంది. గ్రంథాలయలలో ఎఐ వాడకం ఇంకా ప్రారంభ దశలో ఉన్నప్పటికీ, జ్ఞాన ప్రాప్యతను విస్తరిస్తుంది. చాట్‌బాట్‌లు కస్టమర్‌ను గుర్తించటం, నిర్ధారణ చేసుకోవటం, డేటా పర్యవేక్షణ, ఖర్చు ఆదాలో సహాయపడుతునతున్నాయి. కానీ ప్రస్తుతం అసమర్థమైన స్పందనల కారణంగా మానవ లైబ్రరీయన్‌లను పూర్తిగా రీప్లేస్ చేయలేవు. మనిషికి బహు విధాలుగా ఉపయోగపడే సాధనంగా చెప్పచ్చు. ఎఐ సర్క్యులేషన్, కాటలాగింగ్ వంటి పనులను ఆటోమేట్‌గా చేస్తుంది, 'టెక్ట్ టు –స్పీచ్' ద్వారా సౌలభ్యతను మెరుగుపరుస్తుంది, డేటా విశ్లేషణ, విషయ సేకరణ, విషయ నిర్వహణ, మెటా డేటా ఖచ్చితత్వాన్ని పెంచుతుంది. లైబ్రరీయన్‌లు ఎఐని గురించిన అవగాహను పెంచుకోవాలి. దానికి సంబంధించిన జ్ఞానాన్ని లోతుగా పొందాలి. అందుకు వర్క్‌షాప్‌లు, శిక్షణా తరగతులు ఎక్కువగా నిర్వహించాలి. ఎఐ పై ప్రపంచ వ్యాప్తంగా అనేక విధాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. వాటిలో అప్ డేట్ వర్షన్లు గురించి లైబ్రేరియన్స్ ఎప్పటికపుడు తెలుసుకుంటూ ఉండాలి. ఎఐని బాధ్యతాయుతగా ఉపయోగించాలి. గమనించాల్సిన విషయాలు: ఎఐ ఎల్లప్పుడూ ఖచ్చితమైనది కాదు. ఎఐ పై మానవ తనిఖీ, పర్యవేక్షణ అవసరం. న్యాయ శాస్త్రంలో, పరిశోధనా రంగాలలో దీనిని జాగ్రత్తగా ఉపయోగించాలి. ఎందుకంటే ఇది కొన్ని తప్పుడు సమాచారాన్ని ఉత్పత్తి చేయవచ్చు. దీనికి వేగంగా సమాచారాన్ని తీసుకుని విశేషణ చేస్తుంది. అయితే అది విషయాన్ని నేర్చుకునే సమయంలో తప్పు సమాచారం ఇస్తే దానినే యథాతథంగా నేర్చుకొని తప్పు సమాధానమే మనకు ఇస్తుంది. రఫ్ డ్రాఫ్ట్‌లు, రాయడంలో లోపాల తగ్గిస్తుంది. పదేపదే చేయవలసిన రొటీన్ పునరావృత పనులకు ఎఐ ఉపయోగపడుతుంది. కానీ, అది ప్రస్తుత పరిస్థితుల్లో భావోద్వేగాలను వ్యక్తీకరించలేదు. భవిష్యత్తులో చెప్పలేం. అందుకే దీనికి మానవ స్పర్శ అవసరం. ఎఐ సాక్షరత పాఠశాల పాఠ్యాంశాల్లో భాగం కావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇది భవిష్యత్తు కెరీర్‌లకు ఉపయోగపడుతుంది. సామాజిక అభివృద్ధికి అది కీలకం కానుంది. ఎఐని గురించి ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. దీనిని సమర్థవంతంగా ఉపయోగించడానికి నిరంతర శిక్షణ, వృత్తిపరమైన అభివృద్ధి అవసరం ఉంటుంది. లైబ్రరీలు, విద్యా సంస్థలు ఎఐని సమీకరించడం ద్వారా డిజిటల్ సామర్థ్యాన్ని,ఆవిష్కరణలను పెంపొందించగలవు. ఎఐ మన జీవితాలను, పని వాతావరణాన్ని, విద్యను వేగంగా మార్చివేస్తోంది. అలాగే దీనిని బాధ్యతాయుతంగా ఉపయోగించడం ద్వారా మనం భవిష్యత్తును మరింత సమర్థవంతంగా, సమగ్రంగా రూపొందించగలం.

## సామాజిక సేవలకు ప్రతిరూపం

# దుర్గాబాయ్ దేశ్‌ముఖ్



ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి. దేశభక్తు రాలిగా, సామాజిక సేవా తత్పరు రాలుగా ... మరెవరూ చూపని ధైర్య సాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచి పోయారు. తెలుగు ప్రజలు గర్వించ దగిన ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి. వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ. మేధావిగా, న్యాయ కోవిదు రాలుగా, మానవతా వాదిగా, ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహామనిషిగా నిలిచిన ఆ ఉక్కు మహిళ దుర్గాబాయ్ దేశ్ ముఖ్. ఒక బాలికగా జాతీయోద్యమానికి ప్రేరేపితురాలై, జాతిపిత, చాచా నెహ్రూ లాంటి జాతీయోద్యమ నేతల మన్ననలను అందు కున్నారు. గాంధీజీ ఆంధ్ర రాష్ట్ర పర్యటనకు విరాళాల సేకరణ కోసం కాకినాడ వచ్చినపుడు ఆయన ప్రసంగాన్ని తెలుగులో చేసిన అనువాదానికి గాంధీజీ అభినందనలకు పాత్రు లైనారు. ఆ సందర్భంలో విరాళాలు సేకరించడమే కాక, మహాత్ముడు అడిగితే తన చేతి బంగారు గాజులు కూడా సమర్పించిన త్యాగమయి. కాకినాడలో 1923లో జరిగిన కాంగ్రెసు మహాసభలకు టికెట్టు లేకుండా వచ్చిన జవాహర్లాల్ నెహ్రూను అనుమతి లేదని వెనక్కి పంపిన ధీశాలి. దుర్గాబాయ్ చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచు కున్నారు. తన 12 యేండ్ల వయసులో ఆంగ్ల విద్యపై పోరాటం చేశారు. ఆమె రాజమండ్రిలో బాలికలకు హిందీలో విద్యను అందించడానికి బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించారు.దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మద్రాసు ప్రెసిడెన్సి (ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్) లోని రాజమండ్రిలో, 1909 జూలై 15 న సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసుల వారికీ విద్యాబోధన అందించారు. బెనారస్ విశ్వ విద్యాలయం నుండి మెట్రి క్యులేషన్, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్. ఎల్.బి పూర్తిచేసింది. న్యాయశాస్త్ర చదువు పూర్తయ్యాక మద్రాసులో హైకోర్టులో సాధన ప్రారంభించారు. న్యాయ కోవిదురాలిగా, ప్రఖ్యాత క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష కూడా అనుభవించారు. భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళికా సంఘ సభ్యురాలు. ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ కు మొదటి చైర్ పర్సన్ గా వ్యవహరించారు.1953 ఆగస్టులో భారత ప్రభుత్వంచే నెలకొల్పబడిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా, ఢిల్లీలో బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా పని చేశారు. ఆమెను భారతదేశంలో సోషల్ సర్వీస్ మదర్ గా పిలిచేవారు. అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషిచేశారు. ఆమె ఆధ్వర్యంలో 1937లో చెన్నపట్నంలో (ప్రస్తుత చెన్నై లో) ఆంధ్ర మహిళా సభ స్థాపించ బడింది. హైదరాబాద్ లో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఇప్పటికీ పనిచేసే ఆసంస్థ పేరుతోనే ఆవీధిని పిలుస్తారు. అక్కడ వితంతువులకు,అనాథ స్త్రీలకు చదువు చెప్పించడం, రకరకాల పనులలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ళమీద వారు నిలబడేటట్లుగా తయారు చేసేవారు. రాష్ట్ర మంతటా ఎన్నో కళాశాలలు, వసతిగృహాలు, నర్సింగ్ హోమ్‌లు, వృత్తి విద్యాకేంద్రాలు నెలకొల్పారు. లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే బాల సంఘాన్నికూడా స్థాపించారు. నర్సింగ్ కాలేజీ లను స్థాపించారు. ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయ్ తో జరిగింది. అది ద్వితీయ, అంతర్రాష్ట్ర, ఆదర్శ వివాహం అయినందున దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లి పత్రంపై నెహ్రూ, ఆచార్య కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు. దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం బహు అరుదు. 1971లో సాక్షారతా భవన్ ని ప్రారంభించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం దుర్గాబాయికి 1971లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, 1971 – నెహ్రూ లిటరసీ అవార్డు (వయోజన విద్యాసేవలకు గుర్తింపుగా), యునెస్కో నుండి పాల్ జి. హాఫ్‌మన్ అవార్డు పొందారు. అసమాన ప్రజ్ఞా పాటవాతో చిర కాలం గుర్తుండే కార్యక్రమాలకు పురుడు పోసిన దుర్గాబాయ్ 1981 మే 9వ తేదీన హైదరాబాదులో మరణించారు.

# మాటల మాంత్రికుడు డి.వి.నరసరాజు



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తన రచనతో ఎన్నో మరపురాని చిత్రాలను అందించిన ప్రసిద్ధ రచయిత డి.వి. నరసరాజు. సినీ కథ, సంభాషణల రచయితగా సుప్రసిద్ధులు. ఆయన రచించిన సినిమాలలో హాస్యరసం తొణికిస లాడుతూ ప్రేక్షకుల్ని నవ్వించింది. జన సామాన్య వాడుక లోని పదాలతోనే వాడి హాస్యం వ్యంగ్యం పండించిన కృషీవలుడు డి.వి.నరసరాజు. ఆయన మౌలికంగా నాటక రంగం తెలుగు పలుకు బడిని ఉపయోగించడంలో అందెవేసిన చేయి. డి.వి. నరసరాజుగా ప్రసిద్ధుడైన దాట్ల వెంకట నరసరాజు (జూలై 15, 1920 – ఆగష్టు 28, 2006) రంగస్థల, సినిమా నటుడు, రచయిత, దర్శకుడు.1920 జూలై 15న గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలంలోని తాళ్లూరులో జన్మించాడు. ఆయన హేతువాది. నరసరాజు గుంటూరులోని హిందూ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, హిందూ కళాశాలలో ఇంటర్ తర్వాత మద్రాసు లయోలా కళాశాల నుండి బి.ఏ పూర్తి చేశాడు. ఇప్పుడు విజయవాడలో కలసి పోయిన ముత్యాలంపాడు గ్రామంలో తొలి గ్రాడ్యుయేట్ దాట్ల వెంకట నరసరాజు. నాటక రచయితగా జీవితాన్ని ప్రారంభించాడు. సినిమాల లోకి రాకముందు నాటక రచయితగా పేరు తెచ్చు కున్నాడు. అంతర్వాణి, ఈ ఇల్లు అమ్మ బడును, వాపసు లాంటి సూపర్ హిట్ నాటకాలు రాశాడు. ఈనాడు పత్రికలో కొంతకాలం పనిచేశాడు. మొదటి నుంచి సృజనాత్మక కళల మీదే నరసరాజు దృష్టి. 1951లో పాతాళభైరవి సినిమా వందరోజుల ఉత్సవం సందర్భంగా ప్రదర్శించ బడిన నరసరాజు నాటకం "నాటకం" చూసాడు దర్శకుడు కె.వి.రెడ్డి. ఆయన ప్రతిభ చూసిన దిగ్దర్శకులు కేవీ రెడ్డి తన 'పెద్ద మనుషులు' చిత్రం ద్వారా నరసరాజును చిత్రసీమకు పరిచయం చేశారు. అలా నరసరాజు 1954లో పెద్ద మనుషులు సినిమాతో రచయితగా సినీరంగ ప్రవేశం చేశాడు. ఆ సినిమా విజయవంతం కావడంతో సినీ రచయితగా స్థిరపడ్డాడు. దొంగ రాముడు మూవీకి రచయితగా డి.వి.నరసరాజునే తీసుకున్నారు. గుండమ్మ కథకు మాటలు రాశాడు. రాముడు భీముడును సూపర్ డూపర్ హిట్ కొట్టించాడు. నరసరాజుతో ఎన్టీఆర్‌కు ఎక్కువ సాన్నిహిత్యం ఉండేది. తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన సాంఘిక చిత్రాలకు ఎక్కువగా నరసరాజుకే స్క్రిప్ట్ బాధ్యతలు అప్పగించేవారు ఎన్టీఆర్. అలా రూపుదిద్దుకున్న చిత్రాల్లో కోడలు దిద్దిన కాపురం ఒకటి. బడి పంతులు డైలాగ్స్ కోసం డబ్బులు తీసుకున్న ఆత్రేయ రాయని స్థితిలో చివరకు నరసరాజు పూర్తి చేయాల్సి వచ్చింది. యన్టీఆర్ హీరోగా రూపొందిన "నాదీ ఆడజన్మే, సి.ఐ.డి., తిక్క శంకరయ్య, బడి పంతులు, వాడే–వీడు, మగాడు, యమగోల, కేడీ నంబర్ వన్, యుగంధర్ లాంటి చిత్రాలలో ఆయన చిరకాలం గుర్తుండేలా రచనలు చేశారు. అక్కినేని హీరోగా రూపొందిన మూగనోము, గృహలక్ష్మి, జై జవాన్, ఇద్దరు అమ్మాయిలు, శ్రీరంగనీతులు, రావుగారిల్లు చిత్రాలకు నరసరాజు రచన చేశాడు. చిత్రపు నారాయణ మూర్తి తీవ్రమైన కష్టాల్లో ఉన్న పరిస్థితి చూసి సాధారణంగా పౌరాణికాలు పెద్దగా అంగీకరించని నరసరాజు భక్త ప్రహ్లాదకు పని చేశారు. రంగుల రాట్నం, రాజ మకుటం లాంటి సినిమాలు ఆయన ఖాతాలోకే వస్తాయి. యమగోల చిత్రంలో చాలా పొలిటికల్ డైలాగులు పేల్చి నరసరాజు జనంతో ఈలలు కొట్టించు కున్నారు. ఎమర్జన్సీ మీద కాంగ్రెస్ పార్టీ మీద చాలా సెటైర్లు రాయగా, తెర మీద చెప్పేది ఎన్టీఆర్ కావడంతో ఆ డైలాగ్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నాటకం' అనే నాటకంతో రంగస్థలం మీద సంచలనం సృష్టించిన డి.వి.నరసరాజు తెర మీద కూడా రెండు సినిమాల్లో నటించారు. ఒక సినిమాకు దర్శకత్వం వహించాడు. అలా నరసరాజు 92కు పైగా సినిమాలకు కథను, మాటలను సమకూర్చాడు. ఆయన దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలలో కారు దిద్దిన కాపురం ఒకటి. వి.వి. సత్య నారాయణ తొలి చిత్రం చెవిలో పువ్వులో నరసరాజు హీరోయిన్ సీత తాతగా నటించారు. మనసు–మమత చిత్రంలోనూ ఓ కీలక పాత్ర పోషించారు నరసరాజు. ఈయన చివరి సినిమా 2006 లో విడుదలైన మాయా బజార్. ఆయన 2006 ఆగష్టు 28న హైదరాబాదులో మరణించాడు.

## నైపుణ్య యువతే ప్రపంచ భవిత

ప్రపంచంలోని 8.2 బిలియన్ల జనాభాలో 15 నుంచి 24 ఏండ్ల వయస్సు కలిగిన యువత జనాభా 1.22 బిలియన్లు (దాదాపు 15.4 శాతం) ఉన్నారు. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 78 శాతం అనగా 6.4 బిలియన్లు ఉన్నారు. నేడు భారత జనాభా 1.46 బిలియన్లు ఉన్నది. ఇందులో 15 నుంచి 29 ఏండ్ల యువత జనాభా 40 శాతం వరకు ఉన్నది. మన దేశంలో 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 96.1 కోట్లు (లేదా 0.961 బిలియన్లు), అనగా 68 శాతం వరకు ఉన్నది. ఇండియాలో 15 ఏండ్ల లోపు జనాభా 24 శాతం, 64 ఏండ్లు దాటిన వారి జనాభా 7 శాతం వరకు ఉన్నది. ఇతర దేశాలతో పోల్చితే భారత జనాభా సగటు వయస్సు చాలా తక్కువగా 28.8 ఏండ్లు మాత్రమే ఉన్నది. జపాన్ ప్రజల సగటు వయస్సు 49.9 ఏండ్లు ఉన్నది. అందువల్లనే ఇండియాను "యువ భారత్" అని, జపాన్‌ను "ఓల్డ్ జపాన్" అని పిలుస్తున్నాం. యువత జనాభా అధికంగా ఉండడం వల్ల రాబోయే రోజుల్లో విశ్వ దేశాల్లో భారత్ ముందుండా తన సత్తాను గట్టిగా చాటుకోనున్నది. యువత అధికంగా ఉండడంతో పాటు ఆ యువత నైపుణ్య విద్యను పొందింతే భారత భవిత ఉజ్వలంగా ఉండనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అధిక యువ జనాభా కలిగిన యువ భారతాన్ని పలు సవాళ్లు కూడా వెంటాడుతున్నాయి. నేడు పరిశ్రమ ఆశిస్తున్న నైపుణ్యాలకు, నేటి మన యువత కలిగి ఉన్న నైపుణ్యాలకు మధ్య వ్యత్యాసం లేదా గ్యాప్ అధికంగా ఉండడంతో మన యువ శక్తి దేశాభివృద్ధికి అంతగా వినియోగపడడం లేదు. యువతలో అవసర నైపుణ్యాలు కొరవడితే నిరుద్యోగం పెరగడం, తక్కువ స్థాయి ఉద్యోగాలు చేయడం లాంటి ప్రతికూల ఫలితాలు వెక్కిరిస్తున్నాయి. తగిన నైపుణ్యాలు లేని యువతతో నిరుద్యోగ సమస్యలు పెరిగి సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి, సమానత్వ భావనలు పలుచబడతాయి. పౌర సమాజ సుస్థిరాభివృద్ధికి, ఆరోగ్యకర సమాజ స్థాపనకు నైపుణ్య యువత మాత్రమే పునాది అవుతారు. బహుళ జాతి కంపెనీలు (ఎంఎన్‌సిలు) లేదా పరిశ్రమలు కోరుతున్న నైపుణ్యాలను నేటి విద్యాలయాలు బోధిస్తూ, తగు శిక్షణలు ఇవ్వాలి. 2014లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 15 జూలై రోజున "ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం (వరల్డ్ యూత్ స్కిల్స్ డే)" పాటించడం కొనసాగుతున్నది. నేడు మనం 10వ ప్రపంచ యువత నైపుణ్యాల దినం జరుపుకుంటున్న వేళ 2025 ఇతివృత్తంగా "కృత్రిమ మేధ, డిజిటల్ నైపుణ్యాల్లో యువత సాధికారత" అనబడే అంశాన్ని తీసుకున్నారు. నేడు ప్రపంచం 4వ పారిశ్రామిక విప్లవం సాకారం కావడానికి "ఏఐ, సాంకేతిక, వృత్తి విద్య మరియు శిక్షణ" రంగాలు నడుం బిగిస్తే నేటి

## కూటమి ప్రభుత్వ పాలనపై సంతృప్తి భయానక వాతావరణం నుంచి భరోసా వైపు



**కొత్తపేట జులై 14. విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ హయాంలో గ్రామాల్లో సైతం అశాంతి నెలకొని ఉండేదని, రాష్ట్రమంతా ఒక భయానక వాతావరణం వ్యాపించి ఉండేదని కూటమి అధికారంలోకి వచ్చాక ప్రశాంతత నెలకొందని, రాష్ట్ర అభివృద్ధికి భరోసా లభించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. కొత్తపేట మండలం పలివెల గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలివెల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే బండారు వద్ద కూటమి ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ అందించిన సేవలు నిరుపమానమానం స్ఫూర్తి శిఖరం బాబా సాహెబ్ అంబేద్కర్

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట జులై 14. విశ్వం వాయిస్ న్యూస్.** ప్రజాస్వామ్య,గణతంత్ర, లౌకిక దేశంగా భారతదేశం ప్రపంచ పటంలో ఉన్నత స్థానంలో నిలబడడానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన సేవలు నిరుపమానమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. కొత్తపేటలోని రెడ్డప్ప వారి పేటలో ఏర్పాటుచేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ తో కలిసి ఎమ్మెల్యే బండారు ఆవిష్కరించారు. పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ నిరంతరం పోరాడారని వ్యాఖ్యానించారు. నాటి, నేటి,భావితరాలకు ఆయన ఒక స్ఫూర్తి శిఖరమని కొనియాడారు. అంబేద్కర్ బాటలో పయనించడం ద్వారా మనమంతా ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు.

## కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, ఆర్డీవో పి శ్రీకర్‌లకు స్వాగతం పలికిన బండారు సంజీవ్




**కొత్తపేట జులై 14. విశ్వం వాయిస్ న్యూస్.** కొత్తపేట నియోజక వర్గం పర్యటనలో భాగంగా వాడపాలెం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వగృహం నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్,ఆర్డీవో పి శ్రీకర్ లకు స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిసిన యువ నాయకులు బండారు సంజీవ్.

## మూడు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు జిల్లా కలెక్టర్,ఆర్డీవో,ఎమ్మెల్యే పరిశీలన



కొత్తపేట జులై 14. విశ్వం వాయిస్ న్యూస్.స్థానికంగా రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, మరియు డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి కార్యాలయాల ఏర్పాటుకు భూసేకరణకై చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉన్న భూములను ఆయన స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావు వారితో కలిసి ఆర్ డి ఓ డి ఎల్ డి ఓ కార్యాలయాలు ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ రెవిన్యూ అధికారి పి శ్రీకర్ తాసిల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చిర్ల జగ్గిరెడ్డి



**కొత్తపేట జులై 14 విశ్వం వాయిస్ న్యూస్.** విశ్వభూషణ, బోధిసత్వ, భారతరత్న,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం కొత్తపేట గ్రామంలోని రెడ్డప్పవారి పేటలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోధించు,సమీకరించు,పోరాడు అనేటువంటి మూడు మాటలు ఆయన చెప్పారో అవే ఈరోజు కూడా మన జీవనశైలిని సక్రమంగా నడిపిస్తున్నాయని , మనమందరం సమానమే ఎవరూ గొప్పవారు కాదు ఎవరు చిన్న వాళ్ళు కాదు మనుషుల్లో సమానత్వం ఉండాలని తెలియజేసిన నాయకుడు ఒక్క డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మాత్రమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధర్ రావు,కొత్తపేట మండల కన్వీనర్ ముత్యాల వీరభద్ర రావు,ముసునూరి వెంకటేశ్వరరావు,కొత్తపేట మండల యూత్ ప్రెసిడెంట్ గొల్లపల్లి స్వరూప రాజ్ తదితర ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కార మార్గాలు ఉండాలి





**కొత్తపేట జూలై 14. విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సంతృప్తి కొలమానంగా ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి నూటికి నూరు శాతం అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కార మా ర్గాలు ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం ముందు డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆర్ మహే ష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుండి సుమారుగా 4 అర్జీలను జిల్లా కలెక్టర్ ఆర్డిఓ పి శ్రీకర్ లు స్వీకరించారు. వీటిలో ఒకటి బొబ్బర్లంక ఏటిగట్టు ఆక్ర మణలను తొలగించాలని మరొకటి కొత్తపేట గ్రామంలో కౌశిక్ డ్రైన్ శుభ్రపరచాలని కొత్తపేట మండలానికి సంబంధించి రెండు భూ సమస్యలపై దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సంతృప్తి స్థాయి లను మెరుగుపరిచి ప్రజలకు సుపరిపాలనను చేరువ చేసే దిశగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. అధికారులు తమకు అందిన అర్జీని క్షేత్రస్థాయిలో పూర్తిగా అర్జీదారుని సమక్షంలో విచారించి అర్జీదారుడు పూర్తిగా సంతృప్తి చెందిన పిదప ఆన్లైన్లో ఎండార్స్మెం ట్ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐ వి ఆర్ యస్ ద్వారా అర్జీదా రుల సంతృప్తి స్థాయి ప్రజాభిప్రాయ నివేదికను సేకరిస్తుందని అర్జీని పూర్తి స్థాయిలో పరిష్కరిం చని పక్షంలో అర్జీదారుడు సంతృప్తి చెందలేదని ఐవిఆర్ఎస్ ద్వారా తెలియజేసినట్లయితే మరల అదే అర్జీ పునరావృతం అయ్యేందుకు అవకాశం ఉందన్నారు కావున ప్రజా సంతృప్తి కొలమానంగా ప్రతి అర్జీకి నూటికి నూరు శాతం పరిష్కార మార్గాలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా అర్జీలు పరిష్కారంలో ఎటువంటి జాప్యాలకుతావు అర్జీలు దాఖలు కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సుపరిపాలనను ప్రజలకు చేరువు చేసే దిశగా ప్రభుత్వం ప్రతి స్థాయిలో ప్రజా భిప్రాయాలను సేకరించి పరిశీలన చేస్తుందని కావున అధికారులు అంకితభావం జవాబు దారితనం చిత్తశుద్ధితో పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటిం చారు తాసిల్దార్ రాంబాబు, డివిజన్ స్థాయి అధికా రులు తదితరులు పాల్గొ న్నారు.

## నది వరదల సందర్భంగా నది దాటడానికి రేవుల వద్ద అన్ని జాగ్రత్తలు చర్యలు పాటించాలి





**కొత్తపేట డివిజన్ కొత్తపేట పి.గన్నవరం జూలై 14 విశ్వం వాయిస్ న్యూస్.** గోదావరి నది వరదల సందర్భంగా గోదావరి నది దాటడానికి రేవుల వద్ద అన్ని జాగ్రత్తలు చర్యలు పాటించాలని మరి తీవ్ర ఉధృతంగా ప్రవహించిన సందర్భంలో భద్రతా చర్యల దృష్ట్యా రాకపోక లను పూర్తిగా నిషేధించా లని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదే శించారు. మండల పరిధిలోని గంటి, గంటి పెదపూడి రేవు ప్రాంతాన్ని ఆయన అధికారుల బృం దంతో కలిసి గోదావరి వరద స్థితిగతులను స్వ యంగా పరిశీలించారు. పంటి పడవల మీద ప్రయాణించేటప్పుడు గజ ఈతగాళ్ల తో పాటుగా లైఫ్ జాకెట్లు ఇతర జాగ్రత్త చర్యలను తప్పనిసరిగా పాటించాలని, 24/7 ప్రతి కాజ్వే వద్ద అధికారులను నియమించి వరద సహాయక చర్యలు హెచ్చరిక అనుగుణంగా చేపట్టేందుకు ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. వరదలు నేప థ్యంలో అధికారులు సూచనల తో మాత్రమే కాజ్వేల వద్ద ప్రయాణాలు నిర్వహించాల్సి ఉంటుంద న్నారు. వరద ప్రమాద హెచ్చరికలకు సంబంధించి ధవలేశ్వరం దిగువకు వదు లుతున్న వరదనీటి స్థాయిలపై గంట గంటకు సమాచారం అందుతుం దని ఆ దిశగా సహాయక చర్యలను చేపట్టేందుకు అధికారులను నియమిం చడం జరిగిందన్నారు. ముంపు బాధితుల సహాయార్థం నిత్యవస రాలు పునరావాస కేంద్రాలు కూడా సిద్ధం చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్ డిఆర్డిఏ పిడి సాయి నాథ్ జై చంద్ర గాంధీ స్థానిక రెవె న్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి కృష్ణారావు చేతుల మీదుగా జీవన్ తల్లికి ఆర్థిక సహాయం



**కొత్తపేట ఆలమూరు జూలై 14.విశ్వం వాయిస్ న్యూస్.** గత నెల కోదాడ వద్ద జరిగిన కారు ప్రమాదంలో మరణించినటువంటి మన తోటి కానిస్టేబుల్ సహోదరుడు అయిన సుంకర బ్లస్సన్ జీవన్ కుటుంబం కొరకు ఆర్థికంగా సహాయం చేయడానికి సహకరించిన మీ అందరికీ కూడా హృదయపూర్వక ధన్యవాదములు దాని నిమిత్తం సేకరించిన నగదు 2,73,700/- రూపాయలు అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి కృష్ణారావు చేతుల మీదుగా జీవన్ తల్లి కి అందజేయడం జరిగింది తల్లి మరియు తమ్ముడు మనందరికీ హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేశారు అదేవిధంగా ఎస్పీ మీరందరూ ఒక మంచి కార్యక్రమం చేశారు దీన్ని ఇక ముందు కూడా కొనసాగించండి అని జిల్లా సిబ్బందిని మరియు ఇతర జిల్లాల నుండి సహకరించిన ప్రతి ఒక్కరిని మెచ్చుకునీ అభినందించారు కావున ఇకపై మనలో ఎవరికీ ఇటువంటి రోజు రాకూడదని ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో వచ్చిన ఎడల ప్రతి ఒక్కరూ మనమందరం ఒక కుటుంబం అనుకుని ఒకరికి ఒకరు సహాయం చేయడానికి ముందుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరొక్కసారి 2018 బ్యాచ్ కానిస్టేబుల్స్ మరియు మాకు ఆర్థికంగా సహకరించిన ఏ యాస్ ఐ, హెచ్ సి ఎస్ తదితరులు అందరికీ కూడా హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రయాణికుల భద్రతకు రైల్వేశాఖ పెద్దపీట పాలూరి



**కొత్తపేట జులై 14.విశ్వం వాయిస్ న్యూస్** రైల్వే బోగీలకు సీసీ కెమెరాల ఏర్పాటుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం తెలిపారు. ప్రయాణికుల భద్రతకు రైల్వేశాఖ పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పాలూరి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బోగీలలో సీసీ కెమెరాలను దేశవ్యాప్తంగా అమలకు నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటికే అమలైన పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కాగా 74 వేల బోగీలకు 15 వేల లోకోమోటివ్ లలో కెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించిందని వివరించారు. బోగీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై రైల్వే శాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్, సహాయకమంత్రి రవ్ నీత్సింగ్ బిట్టు శనివారం ఉన్నతాదికారులతో సమీక్షించి ఆదివారం రైల్వేశాఖ విడుదల చేసిందన్నారు. రైల్వే బోగీల్లో దోపిడీలకు పాల్పడే దొంగలు ప్రయాణికుల వస్తువులు దొంగిలించడం, రైల్వే సామాన్లు దొంగలించడం వంటివి జరగకుండా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 100 కిలోమీటర్ల వేగంలో స్పష్టమైన చిత్రాలు వచ్చేలాగ నాణ్యతా ప్రమాణాలతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దోపిడీలు, దాడులు అరికట్టవచ్చని అంచనా వేసి రైల్వే శాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుందని పాలూరి తెలిపారు.

## అన్నదాన భవన నిర్మాణ పనులు పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు




**కొత్తపేట ఆత్రేయపురం జూలై 14. విశ్వం వాయిస్ న్యూస్.** శరవేగంగా వకుళా మాత అన్నదాన భవన నిర్మాణ పనులు పరిశీలించిన ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి తరలివచ్చే భక్తులకు నిత్యాన్నదాన నిమిత్తం శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళా మాత అన్నదాన భవనం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. త్వరలోనే వకుళమాత అన్నదాన భవనం పనులు పూర్తవుతాయని, ఒకేసారి 3,500 మంది భక్తులు భోజనం చేసే విధంగా ఈ భవన నిర్మాణం జరుగుతున్నట్లు కార్యనిర్వహణధికారి నల్లం సూర్య చక్రధర రావు వారు తెలిపారు.

## వకుళమాత అన్నదానం భవన నిర్మాణానికి విరాళం



**కొత్తపేట ఆత్రేయపురం జూలై 14.విశ్వం వాయిస్ న్యూస్.** కోనసీమ తిరుపతి వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నకు ఆత్రేయపురం మండలం, నార్కెడిమిల్లిపాలెం వాస్తవ్యులు బొక్క వెంకన్నబాబు లోహిత దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు 1,01,116/- రూపాయలు వెంకటేశ్వరస్వామి వారి వకుళమాత అన్నదానం భవన నిర్మాణానికి విరాళంగా సమర్పించినారు అని డిప్యూటీ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి నల్లం చక్రధర్ రావు తెలియజేశారు.

## శ్రీ వేంకటేశ్వరుని అష్టోత్తర పూజాఫలం సకల అభీష్ట ఫలదాయకం




**కొత్తపేట ఆత్రేయపురం జూలై 14. విశ్వం వాయిస్ న్యూస్** .కోనసీమ తిరుమలగా,అభినవ తిరుపతిగా ప్రఖ్యాతిగాంచినట్టి క్షేత్రం వాడపల్లి దివ్య క్షేత్రం. ఏడు శనివారాల స్వామి దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అన్న నానుడితో వెలుగొందుతున్న ఈ పవిత్ర క్షేత్రంలో ఏడు శనివారాల వ్రతం పూర్తి చేసుకున్న భక్తులు స్వామివారి అష్టోత్తర పూజను జరిపించుకోవడం ద్వారా అనంతమైన ఫలాలు పొందుతారని ప్రతీతి. ఆదివారం మొదలుకొని శుక్రవారం వరకు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు నాలుగు బ్యాచులుగా ఈ అష్టోత్తరనామార్చన నిర్వహించబడుతుంది. పూజా టిక్కెట్ రుసుము రూ.150, టిక్కెట్లు ఆన్లైన్ ద్వారా పొందవచ్చు. శనివారం అష్టోత్తర పూజ నిర్వహించరు. భక్తులు తప్పకుండా ఈ పూజను జరిపించుకుని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని పండితులు చెబుతున్నారు అని తెలియజేశారు.

# సిపిఎం మాజీ కార్పొరేటర్ గోళ్ళమూడి మృతి



**కాకినాడ,సిటీ: విశ్వం వాయిస్ న్యూస్** ఉపాధ్యాయ ఉద్యమ నేతగా కాకినాడ నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్ కామ్రేడ్ గోళ్ళమూడి నాగేశ్వరరావు (84) సోమవారం కాకినాడ 49వ డివిజన్ నేతాజీ వీధిలో వారి స్వగృహం వద్ద మరణించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు జిల్లా కమిటీ సభ్యులు దువ్వ శేషబాబ్జీ, జి బేబిరాణి, మోర్త రాజశేఖర్, సిహెచ్ రమణి, సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు కె సత్తిరాజు, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, రూరల్ కన్వీనర్ టి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు టి రాజా, సిహెచ్ అజయ్, సిహెచ్ విజయ్ కుమార్, పి రామకృష్ణ తదితరులు గోళ్ళమూడి నాగేశ్వరరావు భౌతిక కాయం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గోళ్ళమూడి నాగేశ్వరరావు ఉపాధ్యాయుడుగా జీవనం ప్రారంభించి యుటిఎఫ్ నేతగా, జన విజ్ఞాన వేదిక నేతగా, అక్షర గోదావరి ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారని తెలిపారు. రిటైర్డ్ అయిన తరువాత 2005లో కాకినాడ నగర పాలక సంస్థ కార్పొరేటర్గా ప్రజాసేవ చేసారని కొనియాడారు. 2008లో కాకినాడ సుందరయ్య భవన్ నిర్మాణ కమిటీ కన్వీనర్గా విశేషమైన కృషి చేసారన్నారు. అభ్యుదయ వాదిగా జీవించిన నాగేశ్వరరావు ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక జెఏసి ఉద్యమాలకు అండగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో జిల్లా జెఏసి మాజీ ఛైర్మన్లు ఆచంట రామారాయుడు, బూరిగ ఆశీర్వాదం, కుటుంబ మిత్రులు నేతాజీ వీధి పెద్దలు మూర్తి, యుటిఎఫ్ నేతలు జి ప్రభాకర వర్మ, టి రవి చక్రవర్తి, కెవివి నగేష్, సిహెచ్ వెంకట రమణ, జన విజ్ఞాన వేదిక నాయకులు కెఎంఎంఆర్ ప్రసాద్, జిఎస్ వర్మ, పెన్షనర్ల సంఘం నాయకులు యు సత్యనారాయణ, అంబేద్కర్ ఉద్యమ నేత అయితాబత్తుల రామేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గోళ్ళమూడి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో పాటు కె వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి చంద్రరావు, గుత్తుల రామకృష్ణ, వి రవి కుమార్, కృష్ణాజీ, సిహెచ్ ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. భార్య లలిత కుమారి, కుమారుడు అజయ్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ ఐ బ్యాంక్కి నేత్ర దానం చేసారు.

# గ్రామ స్వచ్ఛతను పౌర జీవనశైలిగా మార్చుకోవాలి




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వచ్ఛతను జీవనశైలిగా మార్చుకోవాలని, గ్రామాభివృద్ధిలో పౌరుల భాగస్వామ్యం ఎంతో కీలకమని, గ్రామ పౌరులు అందరూ విధిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే సంపూర్ణ ఆరోగ్య వంతమైన జీవనాన్ని గడపగలుగుతారని డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని కత్తిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2025 సర్వే, గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ ఎన్.సుమ నేతృత్వం వహించారు. ఆమెతో పాటు అధికారుల బృందం గ్రామంలోని వివిధ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, దేవాలయాలు, పంచాయతీ కార్యాలయం తోపాటు గ్రామంలోని 16 గృహాలను సందర్శించింది. ప్రజలకు ఇండ్లలో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, వాటి సంపూర్ణ పరిశుభ్రత, చేతులను శుభ్రంగా కడుక్కోవడం, ఆరోగ్య పరిరక్షణలో వీటికి ఎంతటి ప్రాధాన్యత ఉందో అధికారులు వివరించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, చేతుల పరిశుభ్రత, తాగునీటి వినియోగ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఆయా ఇండ్ల నుంచి నమూనాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా చిన్నారులతో ప్రయోగాత్మక కార్యకలాపాలు నిర్వహించి, తగిన అవగాహన కల్పించారు. అంగన్వాడి, మండల ప్రజా పరిషత్తు ప్రాధమిక పాఠశాలల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గ్రామ సచివాలయం 1 లో ప్రజలకు స్వచ్ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2025 సర్వే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.సుమ మాట్లాడుతూ.... గ్రామాల అభివృద్ధిలో పౌరుల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను జీవనశైలిగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని తెలిపారు. స్వచ్ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2025 సర్వేను నిర్వహిస్తూ ఉన్నామని, ఈ డేటాను స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర కార్యాలయానికి పంపించి గ్రామానికి ర్యాంకింగ్ కేటాయించనున్నట్లు తెలిపారు. గ్రామంలోని శుభ్రత స్థితిని పరిశీలించి, ప్రభుత్వ లక్ష్యాల మేరకు గ్రామాన్ని బహిరంగ మలవిసర్జన రహిత గ్రామం (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ ప్లస్) కేటగిరీకి ప్రతిపాదిస్తామని ఎన్.సుమ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మిరెడ్డి, డిపిఆర్సి ప్రతినిధి గణేష్, కత్తిపూడి సచివాలయం 1 కార్యదర్శి మధుశేఖర్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఆరోగ్య సమస్యల విషయంలో జర్నలిస్టులకు అండగా ఉంటాం....

...........ట్రస్ట్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ...

.....వీడియో జర్నలిస్టు సుమన్ కు 5 వేల ఆర్థిక సహాయం.,....

.....కాకినాడ జిల్లా జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రూ.5 వేలుసహాయం.....



**కాకినాడ సిటీ: విశ్వం వాయిస్ న్యూస్** జర్నలిస్టుల ఆరోగ్య సమస్యల విషయంలో అండగా ఉంటామని కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. సి. హెచ్. రామకృష్ణ అన్నారు. ట్రస్ట్ హాస్పిటల్ లో కొన్ని రోజులుగా అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న వీడియో జర్నలిస్ట్ మల్లాడి సుమన్ ను కాకినాడ జిల్లా జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డైరెక్టర్, డాక్టర్ రామకృష్ణ ను సుమన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో బిజీ బిజీగా ఉండే పాత్రికేయులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలబడే జర్నలిస్టుల ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మేలు చేయగలరని అన్నారు. ఆయన కూడా వీడియో జర్నలిస్టు సుమన్ పట్ల సానుకూలంగా స్పందించి తాను వ్యక్తిగతంగా రూ.5 వేలు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రూ.5 వేలను సుమన్ మాతృమూర్తికి అందజేశారు. అసోసియేషన్ సభ్యులు మంగా వెంకట శివ రామకృష్ణ, గునిపే శోభన్ బాబు, ముమ్మిడి లక్ష్మణ్ యనమదల రాజేష్, పుర్రె త్రినాధ్ సుమన్ ను కలిసి ధైర్యం చెప్పారు.

## జులై 9 సమ్మె జయప్రదం చేసిన కార్మికులకు అభినందనలు - కేంద్ర కార్మిక సంఘాలు....

....కనీసవేతనం 26 వేలకై పోరాటాలకు పిలుపు...




**కాకినాడ, కచేరిపేట : విశ్వం వాయిస్ న్యూస్** నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల ఇచ్చిన జూలై 9 సమ్మె పిలుపును కాకినాడ జిల్లాలో విజయవంతం చేసిన కార్మిక వర్గానికి కేంద్ర కార్మిక సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరిగిన సమ్మె సమీక్షా సమావేశాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అధ్యక్షతన కచేరిపేట సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. 4 లేబర్ కోడ్లు దేశంలో అమలు జరిగితే భద్రత కలిగిన ఉద్యోగులు సైతం అసంఘటితరంగ కార్మికులుగా మారిపోవాల్సి వస్తుందని, సుమారు మూడు కోట్ల మంది గిగ్ వర్కర్లు, స్కీం వర్కర్లు కార్మిక చట్టాల నుండి తొలగించబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులైతే బానిసలు కంటే దారుణంగా శ్రమదోపిడి గురవుతారని, బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలసీల పట్ల కార్మికులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ధరలకనుగుణంగా ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా 26 వేలు కనీస వేతనం అమలకై జరిగే పోరాటాలకు కార్మికులు సిద్దపడాలని పిలుపునిచ్చారు. సమ్మె సందర్భంగా జరిగిన పొరపాట్లను సరిచేసుకుంటూ కేంద్ర కార్మిక సంఘాల ఐక్య పోరాటాలు కార్మికుల ప్రయోజనాల కొరకు కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో పెంచిన పని గంటలను తక్షణ ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, కోశాధికారి మలకా రమణ, ఐఎన్టియుసి ఏపీ అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఏఐసిసిటియు రాష్ట్ర నాయకులు గొడుగు సత్యనారాయణ, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# అక్కర సమయంలో "శక్తి యాప్" అండగా నిలుస్తుంది

మహిళలు పోలీస్ స్టేషన్ వెళ్లకుండానే యాప్ ద్వారా సమస్యపై ఫిర్యాదు చేయవచ్చు

ఆపదలో బంధువులు తోడు ఉన్నా లేకపోయినా,శక్తి యాప్ ద్వారా సదా మీ సేవలో పోలీసులు

శక్తి యాప్ అవగాహన సదస్సులో ట్రైనీ అడిషనల్ డి.ఎస్పీ ప్రదీప్తి




**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్,రిపోర్టర్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్య, ఉద్యోగం, ఉపాధి, ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లే మహిళలు, విద్యార్థినిలు, తమ ఇళ్లకు సురక్షితంగా చేరుకునే ప్రయాణంలో శక్తి యాప్ తోబుట్టువు లా ధైర్యం కలిగించి,కాపాడుతుందని ట్రైనీ అడిషనల్ డి.ఎస్పి ప్రదీప్తి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన రాయవరం శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరం నందు, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో, రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన శక్తి యాప్ అవగాహన సదస్సు కార్యక్రమంలో అడిషనల్ డి.ఎస్పీ ప్రదీప్తి ముఖ్య అతిథిగా పాల్గొని, హై స్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ విద్యార్థిని లకు మహిళల భద్రత, ఆత్మరక్షణ గూర్చిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, ప్రతీ మహిళకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో శక్తి యాప్‌ను సిద్ధం చేసిందని, మహిళలు ఫోన్ లో, ఈ శక్తి యాప్ ను డౌన్‌లోడ్ చేసుకుని, ఎటువంటి ఆపద సంభవించినా, ఏ సమయంలోనైనా యాప్ లోని ఎస్.ఓ.ఎస్ ఆప్షన్ టచ్ చేస్తే చాలు, వెంటనే ఆ ప్రాంతంలో ఉన్న స్థానిక పోలీసులకు సమాచారం అందుతుందని, తక్షణమే వారు అక్కడకు చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు, అలాగే మహిళలపై లైంగిక వేధింపులు, ర్యాగింగ్ లు తదితర విషయాలపైనా, పోలీస్ స్టేషన్ కు వెళ్లే పని లేకుండా, నేరుగా ఈ యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు, మహిళల భద్రత కొరకు పోలీసు వారి సేవలను,సులువుగా పొందేందుకు వారికి అవసరమైన రక్షణ చట్టాలు,పోలీసు స్టేషన్ ఫోను నంబర్లు శక్తి యాప్ లో పొందుపరిచారని సూచించారు, ఏదైనా దూర ప్రాంతానికి అత్యవసర ప్రయాణంలో వెళ్లి, తిరిగి రావడానికి అవకాశం లేని, తరుణంలో ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇస్తే వారే నైట్ షెల్టర్ల ను ఏర్పాటు చేసి భద్రత కల్పిస్తారన్నారు, తమ ఇంటిలో మహిళలకు ఎదురవుతున్న వివిధ సమస్యలను గూర్చి, యాప్ ద్వారానే ఫిర్యాదు చేస్తే, మీ వివరాలు బహిర్గతం చేయకుండా కుటుంబంలో అలజడి సృష్టిస్తున్న వారికి ఫ్యామిలి కౌన్సిలింగ్ ద్వారా బుద్ధి చెబుతారన్నారు, ప్రయాణాలలో డ్రైవర్ల ప్రవర్తనపై అనుమానం కలిగినపుడు, ఈ యాప్ లో సహాయం కోరితే, ఎక్కడికి వెళ్తున్నారు, ఎలాంటి మార్గంలో ఉన్నారు, వంటి సూచనల ద్వారా సేఫ్ ట్రావెల్ సౌకర్యం ఉందన్నారు, వాట్సాప్ గవర్నెన్స్ సేవలు సైతం శక్తి మొబైల్ యాప్ లో నిక్షిప్తం చేసారని ప్రతి ఒక్కరూ తమ మొబైల్ లో ఈ శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని, తెలియని వారికి వివరించాలని సూచించారు, అనంతరం అమలాపురం డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫీసర్ డి.అభిరామ్ మాట్లాడుతూ ఆన్లైన్ ద్వారా వస్తున్న ఆఫర్లు, నమ్మశక్యం కాని ప్రకటనలకు ఆకర్షింపబడి మోసపోవద్దని సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని వివరించారు, మండపేట రూరల్ సీఐ పి దొర రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ను జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఛేదించడానికి వినియోగించాలని, సోషల్ మీడియా ద్వారా చిల్లర సహవాసాల కు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకోకూడదని మంచి లక్ష్యాలు ఉన్నత విలువలు కలిగిన వారిగా ఉండడానికి ప్రయత్నించాలని సూచించారు, ముఖ్యంగా ఆపదలో బంధువులు స్నేహితులు తోడు ఉన్నా లేకపోయినా, శక్తి యాప్ రూపంలో పోలీసులు ఎప్పుడు అందుబాటులో ఉంటారని గుర్తుంచుకోవాలన్నారు, స్థానిక ఎస్సై సురేష్ బాబు మాట్లాడుతూ ఎక్కాలను గుర్తుంచుకున్నట్లు మహిళల భద్రత కొరకు కొన్ని నంబర్లను గుర్తించుకోవాలని సూచిస్తూ, మహిళలు వరకట్న వేధింపులకు గురైతే 181, అత్యవసర సహాయం కోసం 112, మహిళలను వేధింపులకు గురి చేసి, అక్రమంగా తరలిస్తే 1091, చిన్నపిల్లలను లైంగిక వేధింపులకు గురిచేస్తే 1098, సైబర్ నేరాలకు పాల్పడితే 1930, మీ ప్రాంతంలో యువకులు గంజాయి,మత్తు మందుకు అలవాటు పడి ఇబ్బంది పెడితే 1972 , వంటి నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, మహిళల భద్రత కోసం పోలీస్ వ్యవస్థ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.శాంతి సునీత, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, రాయవరం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు, హై స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## రెండు చోట్ల చోరీలు....

ఐదుగురు నిందితులు అరెస్ట్....

7.50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం....



**కాకినాడక్రైమ్ : విశ్వం వాయిస్ న్యూస్** జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుండి 17.50లక్షల రూపాయల విలువ చేసే 135గ్రాముల బంగారు ఆభరణాలు,1567గ్రాముల వెండి ఆభరణాలను, ఒక పల్సర్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ డిఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ తెలిపారు. వీరిలో నలుగురు కాకినాడ జగన్నాధపురం సత్యదేవ నగర్ ప్రాంతానికి చెందిన గంపల సతీష్, యానం బాలయోగి నగర్ ప్రాంతానికి చెందిన మల్లాడి దుర్గాప్రసాద్, కాకినాడ గొడారి గుంటకు చెందిన కాలాడి అర్జునరావు, బిక్కవోలు మండలం బలబద్రపురం గ్రామానికి చెందిన గొర్రిపూడి వెంకటరమణలు కాకినాడ జిల్లాలో ఉన్న వివిధ స్టేషన్లోనూ, మరొకరు కాకినాడ జగన్నాధపురం ఏటిమొగ ప్రాంతానికి చెందిన రేకాడి వెంకటేశ్వర్లు కాకినాడ పోర్ట్ స్టేషన్ పరిధిలో ఈ చోరీలకు పాల్పడినట్లు డిఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్ చెప్పారు. సోమవారం డిఎస్పి పాటిల్ కాకినాడ రూరల్ సీఐ డిఎస్ చైతన్యకృష్ణతో కలిసి చోరీకి సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. గంపల సతీష్, మల్లాడి దుర్గాప్రసాద్, కాలాడి అర్జున రావు, గొర్రిపూడి వెంకటరమణలు ముఠాగా ఏర్పడి చోరీలు చేస్తున్నారన్నారు. 5కేసులలో వీరిని అరెస్ట్ చేశామన్నారు. కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరో కేసులో రేకాడి వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశామన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు దొంగలకు కనిపించే విధంగా బయట గేటుకు పెద్ద తాళం కప్పులు వేయవద్దని సీఐ చైతన్య కృష్ణ ప్రజలకు సూచించారు.

ఈ సమావేశంలో క్రైమ్ సీఐ వి కృష్ణ, పోర్ట్ సీఐ పి సునీల్ కుమార్, ఇంద్రపాలెం ఎస్సై ఎమ్ వీరబాబు, ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది రాంబాబు, మెయిన్, ప్రసాద్, శ్రీను, సతీష్, చిన్న, నారాయణరెడ్డి, సూర్య, పుల్లయ్య, గోవిందు, వర్మ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

.....17న మహాసభ....



**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ ఈనెల 17వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభమవుతుందని దాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం కాకినాడలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుండల సాయి కుమార్ యాదవ్ స్వగృహంలో మహాసభ విజయవంతం కావాలని కోరుతూ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకావెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతుందని దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని సాయికుమార్ చెప్పారు. ఈ సభలో బీసీలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలని వంటి అంశాలపై ప్రసంగాలు ఉంటాయని సాయికుమార్ చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వియ్యపు అప్పలస్వామి మాట్లాడుతూ ఈ సభను విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలన నుంచి బీసీ నాయకులు, బీసీ వర్గాలకు చెందిన ప్రజలు హాజరుకావాలని అప్పలస్వామి కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పంచకట్ల రామకృష్ణ, జగ్గంపేట నియోజకవర్గం అధ్యక్షుడు మరుకుర్తి వీర గంగాధర్, జగ్గంపేట నియోజవర్గ ప్రధాన కార్యదర్శి చీపురుపల్లి రాఘవ, ఇతర బీసీ వర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై కలెక్టర్ సమీక్ష




**అమలాపురం, జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ డా. రావిలాల మహేష్ కుమార్ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై సోలార్ రూఫ్‌టాప్ ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 1004 యూనిట్లకు కనెక్షన్లు ఇచ్చారని, ఆగస్టు 15 కల్లా మరిన్ని కనెక్షన్లు అందుబాటులోకి తేవాలన్నారు. పథకంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని, 300 యూనిట్ల పరిమితి వాడకానికి మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఉత్పత్తికి పరిమితి లేదని పేర్కొన్నారు. అధికారులు, మున్సిపల్, డిఎల్‌డిఒ, ఎంపీడీవో, బ్యాంకు ఎల్డీఎంలు, ఏజెన్సీలు కలిసి ప్రజలకు పథక ఫలితాలను వివరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సబ్సిడీ లభిస్తుందన్నారు. సమావేశంలో ట్రాన్స్కో, బ్యాంకు ఎల్ డి ఎం వర్మ , ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.





# ముత్తూట్ ఫైనాన్స్ లో విధులు నిర్వహిస్తువారే చేతివాటం చూపించారని బాధితుడి ఆవేదన

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా దిగ్విజయంగా కొనసాగుతున్న ముత్తూట్ ఫైనాన్స్ నందు విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులు నా నాలుగు గ్రాముల ఉంగరాన్ని మాయం చేశారంటూ స్వర్ణాంధ్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నందు అమలదాస్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో అమలదాస్ రాజు మాట్లాడుతూ తెలిసిన వ్యక్తి అయిన తుమ్మల వేణుగోపాల్ అనే వ్యక్తి నేను ముత్తూట్ ఫైనాన్స్ నందు పని చేస్తున్నానని నీ దగ్గర బంగారం ఏమైనా ఉంటే ఎక్కువ డబ్బులు ఇప్పిస్తానని ఫోన్ చేసి అడగడం జరిగిందని అన్నారు. దాంతో నేను ఎస్ బి ఐ బ్యాంక్ నందు నాకు ఉన్న బంగారం పెట్టడం జరిగిందని ప్రస్తుతం మా పాప వైద్యం నిమిత్తం డబ్బులు అవసరమై ఉన్నానని తెలియజేశానని అన్నారు. తుమ్మల వేణుగోపాల్ ఎస్ బి ఐ లో ఉన్న బంగారానికి తనే డబ్బులు ఇచ్చి అక్కడ నుంచి ముత్తూట్ ఫైనాన్స్ నందు చెవిలీలు రెండు,మ్యాటీలు రెండు,ఉంగరాలు నాలుగు, ముత్తూట్ ఫైనాన్స్ నందు అందజేసేటప్పుడు నేను ఫోటో తీసుకున్నానని అన్నారు. వారు లోపలికి వెళ్ళేటప్పుడు అందులో నాలుగు గ్రాముల ఉంగరాన్ని వేణుగోపాల్ మరియు అతని మిత్రుడు కలిసి కుమ్మక్కై నేను పెట్టిన వస్తువుల్లో ఒక ఉంగరాన్ని కనబడకుండా చేశారని బాధితుడు ఆరోపించారు. మా పాప ఆరోగ్యం నిమిత్తం డబ్బులు అవసరంమై ఉన్నందున ఆ స్లిప్ లో ఉన్న ఫోటోను సైతం నేను సరిగా చూడకుండా జేబులో పెట్టుకుని ఇంటికి వెళ్ళి హాస్పిటల్



పనులు అన్ని చూసుకున్న తర్వాత తాకట్టు పెట్టిన వస్తువుల ఫోటోని పరిశీలించగా అందులో ఒక నాలుగు గ్రాములు ఉంగరం కనిపించకపోవడంతో వెంటనే తుమ్మల వేణుగోపాల్ కు ఫోన్ చేసి అడగగా కంగారు పడవద్దని ఫోటోలో ఏదో ఒక మూలన ఆ ఉంగరం ఉంటుందని ధైర్యం చెప్పడం జరిగిందని బాధితుడు తెలిపారు. నేను నా వస్తువులను విడిపించడానికి వెళ్లిన తర్వాత ఫోటోలో లేని ఉంగరం కనిపించకపోవడంతో నాకు జరిగిన అన్యాయాన్ని బ్రాంచ్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లినా కానీ నాకు ఎలాంటి న్యాయం జరగలేదని బాధితుడు ఆరోపించారు. చివరకు పోలీస్ వారిని ఆశ్రయించినా సరైన సిసి ఫుటేజ్ ను చూపించకుండా ఆ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ కాలయాపన చేస్తున్నారని బాధితుడు రాజు విలేకరులకు తెలిపారు. నేను ఎనిమిది వస్తువులు తాకట్టు పెట్టినా గానీ చివరకు ముత్తూట్ ఫైనాన్స్ వారు నాకు ఏడు వస్తువులు మాత్రమే అప్పగించి అన్యాయం చేశారంటూ బాధితుడు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలోనే షేక్ ఉస్మాన్ మాట్లాడుతూ గతంలో మా నాన్న అక్కడ పెట్టిన బంగారు వస్తువుల నిమిత్తం వడ్డీ కట్టేందుకు డబ్బులు ఇవ్వగా ఈ ఫైనాన్స్ నందు పని చేస్తున్న ఒక వ్యక్తి అందులో ఒక 500 రూపాయలు నోటును జేబులో పెట్టుకొని మానాన్న ను 500 తక్కువ ఇచ్చారంటూ వాధించడంతో మా నాన్న బ్రాంచ్ మేనేజర్ ను సిసి ఫుటేజ్ ను పూర్తిస్థాయిలో పరిశీలించమని అడగగా అప్పుడు మేనేజర్ సిసి కెమెరాలను పరిశీలించగా ఫైనాన్సులో పనిచేస్తున్న వ్యక్తి 500 రూపాయల నోట్ ను జేబులో పెట్టుకున్నట్టుగా బయటపడడంతో ఆ మేనేజర్ ఆ వ్యక్తికి గట్టిగా బుద్ధి చెప్పడం జరిగిందని షేక్ ఉస్మాన్ ఆరోపించారు. ఏది ఏమైనా ప్రజల్లో ఎంతో నమ్మకంగా ఏళ్ళ తరబడి దిగ్విజయంగా కొనసాగుతున్న ముత్తూట్ ఫైనాన్స్ పై ఇలాంటి ఉదంతాలు సీతానగరం మండలంలో సిబ్బంది చేతి వాటాలను అరికట్టే విధంగా ఉన్నత స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేపట్టి ప్రజలు నష్టపోకుండా ప్రజల్లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ పై నమ్మకం పోకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ముత్తూట్ ఫైనాన్స్ ఉన్నత స్థాయి అధికారులు అలాగే పోలీసు అధికారులు పూర్తిస్థాయిలో స్పందించి అమల దాస్ రాజుకు జరిగిన అన్యాయం పై న్యాయం జరిగే విధంగా తగిన చర్యలు చేపట్టాలని రాజు బంధువులు కోరుతున్నారు.

## జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికను పరామర్శించిన మాజీ ఎంపీ భరత్

- బిసిల పక్షం అని చెప్పుకునే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ఎందుకు మాట్లాడ్డం లేదు
- పైగా తిరిగి తప్పుడు కేసులు పెడతారా
- ప్రజలు గమనిస్తున్నారని కూడా ఆలోచించకపోతే ఎలా?
- భౌతిక దాడులతో నోరునొక్కే ప్రయత్నం చేస్తున్నారు
- తద్వారా హామీల అమలు గురించి ప్రజలు కూడా అడగరనే కదా
- ఎల్లకాలం ఒక్కరే అధికారంలో ఉండరని గ్రహించండి ..
- రేపొద్దున మా ప్రభుత్వం వస్తే ఎలా ఉంటుందో ఆలోచన చేయండి
- దోషులను అరెస్టు చేయకపోతే బిసిలంతా బయటకొచ్చి ఉద్యమిస్తారు





**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** గడిచిన ఏడాది కాలంగా రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా పెడన నియోజక వర్గం పెడన మండలంలోని పూడూరు దగ్గర కొత్తూరు గ్రామం వెళ్లి ఇటీవల తెలుగుదేశం వాళ్ళ దాడికి గురైన కృష్ణా జిల్లా జెడ్పి చైర్ పర్సన్ ఉప్పాల హారికను సోమవారం భరత్ పరామర్శించారు. మచిలీపట్నం వైసిపి ఇంచార్జి పేర్ని కిట్టు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం గుండాలు పెద్ద పెద్ద బండరాళ్లతో సోదరి హారికపై ఆమె భర్త ప్రయాణిస్తున్న కారుపై దాడికి తెగబడడం శోచనీయమన్నారు. ఇదంతా చూస్తుంటే హత్యాయత్నంగా ఉందని భరత్ ఆరోపించారు. రాళ్లు తలకు తగిలితే ప్రాణం పోతే పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు.తన సొంత చెల్లెలు వంటి హారికపై తెలుగుదేశం గుండాలు దాడిచేస్తుంటే, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంలో ఔచిత్యమేమిటని ఆయన ప్రశ్నించారు. రాజధాని అమరావతి చెంతనే ఇంత రాద్ధాంతం జరిగితే, అందునా ఒక బిసి మహిళ, జెడ్పి చైర్ పర్సన్, జిల్లా ప్రధమ పౌరురాలుపై దాడి జరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గానీ, మంత్రి లోకేష్ గానీ ఎందుకు స్పందించలేదని భరత్ నిలదీశారు. తాము బిసిల పక్షమని, తమ పార్టీలు బిసిల పార్టీలని, తాము మహిళలకు రక్షణ ఇస్తామని చెప్పుకునే నాయకులు ఈ ఘటనపై మౌనంగా ఎందుకున్నారని భరత్ ప్రశ్నించారు. గతంలో పూనకం వచ్చినట్లు ఊగిపోయే పవన్ కళ్యాణ్ గారు ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదన్నారు. పైగా జెడ్పి చైర్ పర్సన్ హారిక పైనా, ఆమె భర్త రాము పైనా కేసులు కట్టడం దారుణమన్నారు. ఎపి ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారని, తప్పుడు కేసులు పెట్టకూడదని ఎందుకు ఆలోచించడం లేదని భరత్ ప్రశ్నించారు. దాడికి తెగబడుతున్నట్లు జెడ్పి టిసి సభ్యుడు కందుల నాగరాజు ప్రత్యక్షంగా కన్పిస్తున్నా సరే, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పోలీసులు హెల్మెట్లు పెట్టుకు రావడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దీన్ని బట్టి దాడి చేస్తారని పోలీసులకు ముందే తులుసన్నమాట అని ఆయన వాపోయారు. ముందస్తు ప్రణాళికతోనే జరిగిన ఘటనగా అర్థం అవుతోందన్నారు.

భౌతిక దాడులతో వైసీపీ నాయకులను, కార్యకర్తలను నోరునొక్కే ప్రయత్నం చేస్తున్నారని, తద్వారా కూటమి ప్రభుత్వాన్ని హామీల అమలు గురించి ప్రజలు కూడా అడగరనే ఉద్దేశ్యమా అని భరత్ ఆరోపించారు. ఇదొక ఎజెండాగా తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తోంద న్నారు. ఎల్లకాలం ఒక్కరే అధికారంలో ఉండరని గ్రహించాలని, ఇప్పటికే ప్రభుత్వం పై ఎంత వ్యతిరేకత వచ్చిందో తెలుసుకుంటే మంచిదన్నారు. వచ్చేసారి పోటీచేస్తే డిపాజిట్లు కూడా వస్తాయో రావో అర్థం చేసుకోవాలన్నారు. రేపొద్దున మా ప్రభుత్వం వస్తే, మీరు చూపిన మార్గం అనుసరిస్తే ఎలా ఉంటుందో ఆలోచన చేయండని భరత్ హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, ఉప్పాల హారికపై దుర్భాషలాడుతూ దాడికి తెగబడ్డవారిని పోలీసులు తక్షణం అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ప్రభుత్వం స్పందించకపోతే బిసిలంతా బయటకు వచ్చి ఉద్యమిస్తారని ఆయన హెచ్చరించారు.

# కులగణన వద్దు - కుల సంస్కరణలు చెయ్యాలి

**– కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి మేడా శ్రీనివాస్ డిమాండ్**

**రాజమహేంద్రవరం విశ్వం వాయిస్ న్యూస్:** భార్య -భర్తల ఇరువర్ణాలను పిల్లల విద్యా రికార్థుల నందు నమోదు చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారంతపు సమావేశం లో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసారు .. పాలకుల ఆధిపత్యం, కుట్ర బుద్ధితో కొంతమందితో ఆర్గనైజ్ గా కుల ఘనణ వాదనను తెరపైకి తెస్తున్నారని , గత 200 ఏళ్లు పై భడి కులాల పేరుతో హింసించినది, వేదించనది సరిపోదన్నట్టు నేడు, రేపు, ఆ మరునాడు కూడా ఈ కులాలు అంటరాని వారు, పెత్తందారులకు బానిసలు అని తర తరాలు చెప్పుకునే విధంగా ఆ నరక జీవితాలు నిత్యం గుర్తుండే విధంగా పదే పదే గుర్తు చేసే పనిగా కుల ఘనణను ప్రారంభించే దిశగా పాలకులు పాచికలు సిద్ధం చేస్తున్నారు. ఈ కులఘనణ కుట్రలను ఈ తరం యువత ప్రశ్నించక పోయినా , ఎదిరించక పోయినా, అందుకు సిద్ధ పడక పోయినా బావితరాలు క్షమించారు. చారిత్రిక ఉన్మాదులుగా మిగిలి పోతారు. అంటరాని వారిగా బలవంతంగా ముద్ర వేసిన ఆ నాటి పాలకులు నుండి నేటి పాలకుల వరకు దేశ ద్రోహులే నని , ఆ దేశ ద్రోహ స్వభావం గల వారసులే నేడు చట్ట సభల్లో ప్రాతినిత్యం వహిస్తున్నారు . పాలకులకు చిత్తశుద్ధి వుంటే కుల ఘనణలు కాకుండా కుల సంస్కరణలు చేపట్టి వారి వారి వాస్తవ గొప్ప చరిత్ర లను పుస్తకాల్లో అచ్చు వేయించాలని , అంటరాని తనాన్ని వారసత్వంగా మోస్తున్న వారికి మానవత్వ విలువలుతో ఆదర్శంగా నిలవగలరా ! అని ఆయన సవాల్ చేసారు . నేడు ప్రభుత్వాలు కుల వర్గ కేటగిరి లుగా అమలు చేస్తున్న వర్గాలకు , వాస్తవ కులాలకు పొంతన లేక పోతుందని, గుడ్డిగా ప్రభుత్వాలు అమలు చేసున్నాయి. గుడ్డిగా ప్రజలు అనాదిగా కట్టు బానిసలుగా అనుసరిస్తున్నారు . ప్రస్తుతం దళితులుగా అంటరాని వారిగా వేధింపులకు గురవుతున్న వర్గాలు ఆది కాలంలో చక్రవర్థులు గాను, ఎంతో పవిత్రులు గాను యేలుబడి సాగించిన చరిత్ర వారి సొంతమని , నేడు వెనుకబడిన వర్గాలుగా కొనసాగుతున్న కుల వర్గాలు అన్ని దైవ సన్నిధిలోను, వేదాల లోను ప్రత్యేక స్థానం గల కుల వర్గాలనే చరిత్రను బాహ్య ప్రపంచానికి తెలియనీయటం లేదని,నేడు మేధావులు గాను , విద్యా వేత్తలుగాను కీర్తింప బడుతున్న వారు దళితులకు ఆ నాడు



కాలికి చెప్పులేసుకొనిచ్చే వారు కాదు , ముడ్డికి ముంత, తాటాకు, చేతితో చెప్పులు పుచ్చుకునే తిరగాలని, స్త్రీ లను జాకెట్టు ధరించ నిచ్చే వారు కాదని,దళితులు చదువుకో కూడదు అనే కఠిన మైన వేధింపులు, ఆచారాలు ఉండేవి ఇలాంటి వాటికి ప్రధాన కారకులు బ్రాహ్మణులు అని నిత్యం అబద్దాలను రంగరిస్తు సమాజానికి చెడు సాంకేతాలు ఇవ్వటం నేటి మేధావులుకు తగునా ! అస్సలు ఆ నాడు ముడ్డికి ముంత కట్టుకునే వారు, తాటాకు కట్టుకుని చేతితో చెప్పులు పట్టుకునే వారు, జాకెట్టు ధరించకూడని స్త్రీలు దళితులు అని ఏ రికార్థులలోను , ఏ గ్రంధాల లోను వ్రాయబడి వుందో, ఏ శాసనాలు చెప్పబడుతున్నాయో ఆధారిత చర్చకు సిద్ధ పండగల మేధావులు వుంటే అందుకు నేను సిద్దం . మేధావుల ఆలోచనల్లో మార్పులు రావాలి . పెత్తందారి కుట్ర దారుల వ్యూహంలో చిక్కుకున్న కొంతమంది ద్రోహలకు మనమే ఆహరంగా మారుతున్నాము . వారు మరింతగా బలపడే ఉద్యమాలు చేస్తున్నాము . నేడు నిర్వహిస్తున్న సభలు, సమావేశాల నిర్వాహకుల్లో మార్పులు రావాల్సిన అవసరం వుందని , దళితులు , వెనుక బడిన వర్గాల వారు అది కాలంలో ఎంతో గొప్ప చరిత్ర వున్నవారని, ఆ గొప్ప చరిత్ర స్తానంలో కొంతమంది భూ స్వాములు , పెత్తందారులు , ఆ నాటి రాక్షస పాలకుల నుండి నేటి కలుషిత పాలకుల వరకు ఒక అబద్దాన్ని నిజం అంటు ప్రచారం చేస్తు ఆ వర్గాలు, ఆ తరాలు వారి వారి గొప్ప చరిత్రను మరిచిపోయేలా చేసారని , ఆ ద్రోహ కుట్రను నేటికి అమలు చేస్తూనే వున్నారని ఆయన ఆవేదన చెందారు. ప్రస్తుతం పేదరికం తోను , అంటరాని వారిగాను అనాదిగా దళితులు అని, బిసి లు అని బలవంతపు స్వయం ప్రకటిత కుట్రలో కొట్టు మిట్టాడుతున్న వారంతా ఆది కాలంలో గొప్ప గొప్ప వంశాలని , జాతి సంపదను, శ్రమను దోపిడిని అధికారికంగా దోచుకుంటు పేదరికాన్ని వారి వారసత్వ హక్కుగా అమలు చేస్తున్నారు . నిత్యం బ్రిటిష్ కాలం, ఆ ముందు కాలం చరిత్రనే అచ్చు వేయిస్తు నేటి మేధావులు అందరు ప్రజల బుర్రల్లోకి అవస్థవాలను చొప్పిస్తున్నారని , ఆ ముందు, అంతకు ముందు, ఆది కాలం నాటి చరిత్రను ఎందుకు తెలియనీయటం లేదు . అంబేద్కర్ చరిత్రను కూడా తక్కువ చేస్తు నేడు మేధావులుగా పిలిపించు కుంటున్న వారు వాస్తవాలను వక్రీకరించారని, భూమి ఉన్నంత వరకు అంటరాని తనాన్ని నేటి పాలకులు పోనియ్యరని, అందుకే ప్రస్తుతం బలవంతంగా పిలిపించు కుంటున్న దళితులు, బిసి ల కుల నామాలను పూర్తి స్థాయిలో రద్దు చేసి ఆ స్థానం వాస్తవ చరిత్ర మూలలను వెలికి తీసి వారి వారి చారిత్రిక సాంప్రదాయలను , ప్రస్తుత వృత్తులు, ఆ నాటి వంశ చరిత్ర ఆధారంగా వర్ణ విభాగలుగా ఏర్పారాచాలని , అంతేగాని అనాది కాలం నుండి కులాలు గానే వారిని అణచి వేస్తు వారి తరాలను, భవిష్యత్ తరాలను హేళన చేస్తున్నారు. వారి సంపదను దోచుకుంయున్నారు . కుల సంస్కరణల వైపు ప్రభుత్వాలు దృష్టి సారించి ఇంక నుండి విద్యార్హత రికార్థుల నందు భార్యా, భర్తల ఇరు వర్ణాలను పొందు పరచే విధంగా చర్యలు అమలు చేయాలని , కులాలు కాకుండా కమ్యూనిటీ వర్గ విభాగాలను ప్రోత్సహించాలని , అంటరాని తనం, బానిస జీవితాలు లేని గొప్ప నవ సమాజాన్ని జాతికి అందించటమే మా అంతిమ లక్ష్యం అని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ మేడిచర్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్ సర్వశ్రీ డి వి ఆర్ మూర్తి,సిమ్మా దుర్గారావు,పసుపులేటి వీర్రాజు , దుడ్డే సురేష్,వర్ధనపు శరత్ కుమార్,దుడ్డే త్రినాద్,సుంకర వెంకట భాస్కర రంగారావు , మేడిచర్ల శ్రీనివాసరావు , కారుమూరి యుగంధర్ ,గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా, వాడపల్లి జ్యోతిష్ ,పిల్లా దుర్గా ప్రసాద్,కాసా వినయ్ , అనిమేలు నిర్మలమ్మ, అడపా దేవుడు , ధర్మవరపు వెంకటేశ్వరరావు,చల్లా సాంబశివరావు,చల్లా వంశీ , నాగూరి అన్నపూర్ణ , నాగురి సింహాచలం ,మాసా లక్ష్మి, మాసా సుభద్ర ,గెద్దాడ సుందరమ్మ ,మాసా సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రిబుల్ ఐటీకి ఎంపికైన సరస్వతి విద్యార్థిని ముల్లంగి గౌరీదేవి.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ విద్యార్థిని ముల్లంగి గౌరీదేవి నూజివీడు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు కరస్పాండెంట్ పెనకటి గంగాధర్ తెలిపారు. సోమవారం కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ లో కరస్పాండెంట్ గంగాధర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ట్రిబుల్ ఐటీ విజేత గౌరీదేవికి పూలమాలలు వేసి సాల్వతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ మన విద్యాసంస్థల నుండి ఎందరో విద్యార్థులు నవోదయ, ఇంజనీరింగ్, ట్రిబుల్ ఐటీలో ఉన్నత విద్యనభ్యసించి వివిధ రంగాల్లో మంచి స్థానాల్లో వెలుగొందడం ఆనందంగా ఉంద న్నారు. విద్యార్థిని విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకొని, చదువు ల్లో చక్కగా రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోధించాలన్నారు. అనంతరం గౌరీదేవి మాట్లాడుతూ చక్కటి విద్యను అందించిన కరస్పాండెంట్ గంగాధర్, ఉపాధ్యాయ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లిడి హనుమ, ఉపాధ్యాయ సిబ్బంది కాకర్ల ప్రభావతి, జాజుల వసంతరాయుడు, విద్యార్థిని ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీతానగరం మండలంలోని విద్యుత్ వినియోగదాలకు విజ్ఞప్తి



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** 2025 ఏడో నెల 16వ తారీకు బుధవారం. ఉదయం: 07.00 గంటల నుండి మధ్యాహ్నం 13: 00 వరకు 33/11 కేవీ పురుషోత్తపట్నం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని 11కేవీ సీతానగరం రూరల్ ఫీడర్ ట్రీ కటింగ్ మరియు లైన్ మైంటెనెన్సు కారణం చేత విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయబడును. కావున తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం మండలం వంగలపూడి, సింగవరం, చీపురు పల్లి, అచియపాలెం, పెదకొండేపూడి గ్రామములకు మరియు ఈ ఉపకేంద్రం పరిధిలో గల పురుషోత్తపట్నం, రామచంద్రపురం, చిన్నకొండేపూడి గ్రామ పరిధి లో గల వ్యవసాయ బోర్లకు కూడా విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగునని తెలియ చేయుచున్నాము, విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ అసౌకర్యానికి గమనించి డిపార్ట్ మెంట్ వారికి సహకరించవలసినదిగా
జె పి బి నటరాజన్ , ఎక్జిక్యూటివ్ ఇంజినీరు, ఆపరేషన్, ఏ పి ఈ పి డి సి ఎల్,రాజమహేంద్రవరం రూరల్ వారు కోరుచున్నారు.

## గోవా గవర్నర్ గా అశోక్ గజపతిరాజు ఎంపికపై అభిరామ్ హర్షం



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్ :** టిడిపి సీనియర్ నేత కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజుకు కేంద్రం కీలక బాధ్యతలు అప్పగించింది .ఆయనను గోవా గవర్నర్ గా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నియమించడం పట్ల టిడిపి యువ నాయకులు పెందుర్తి అభిరామ్ ఆయనను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.





## ఏఎస్ఓ జోడాల వెంకటేశ్వరావు సహకారంతో విల్ చైర్ బహుకరణ



**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్:** దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో గోపాలపురం మండలంలోని వేళ్ళ చింతలగూడెం గ్రామానికి చెందిన కుక్కల గంగాజలం పెరాలసిస్ తో గత 3 సంవత్సరాల నుండి బాధపడుతున్నారు.వీరికి ఈ ఎస్ ఓ జోడాల వెంకటేశ్వరావు సహకారం తో విల్ ఛైర్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ టీమ్ సభ్యులు ప్రత్తిపాటి నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.కాళ్ళు చేతులు లేని దివ్యంగులు తమ సంస్థ ను 9391089381 సంప్రదించిన వారికి ఉచితముగ కృత్రిమ అవయవాలు అందిస్తామని తెలియజేసారు.

## ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాతపూడి వెంకటేష్



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్ :** మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎం.ఈ.ఎఫ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాతపూడి వెంకటేష్ ఎన్నికయ్యారు. రాజమండ్రిలోని ఆనం రోటరీ హాల్ లో జరిగిన ఎం ఈ ఎఫ్ డాక్టర్. బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లా,తూర్పు గోదావరి జిల్లాల ఎం ఈ ఎఫ్ శాఖల సమావేశం మూడు జిల్లాల కన్వీనర్ తాతపూడి వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎం ఈ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి భిక్షాలు,డాక్టర్ దుళ్లపల్లి సుబ్బారావు మూడు జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్సులు ఉందుర్తి వీర వెంకట్రావు,కుడెల్లి సురేష్,చాట్ల ఆశీర్వాదం, సవరం వీర్రాజు,కొల్లి సామ్ సన్,వేమగిరి బ్రహ్మారాజు లు, మూడు జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భిక్షాలు మాట్లాడుతూ..గత 30 ఏళ్లుగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వం లో జరిగిన పోరాటం సమాజం లోని అన్ని వర్గాల మద్దతుతో ఫలించి ఎస్సి రిజర్వేషన్ల వర్గీకరణ సాధించుకున్నా మన్నారు. ఈ సందర్భంగా సమాజంలోని అన్ని వర్గాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఎం ఈ ఎఫ్ మూడు జిల్లాల కన్వీనర్ గా ఉన్న తాతపూడి వెంకటేష్ సేవలను గుర్తించి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడి గా నియమి స్తున్నట్లు సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఆర్థిక కార్యదర్శి సిద్ధాంతపు బెన్ జాన్సన్, ఉపాధ్యక్షుడు దుళ్లబులి అప్పారావు, కొండేపూడి రాజాజీ రాయ్, తూర్పు గోదావరి జిల్లా ఆర్థిక కార్యదర్శి చంద్రమల్ల రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుడెల్లి అర్జున్,స్పోక్స్ పర్సన్ కొల్లి నాగేశ్వరరావు, కొండేపూడి రాజాజీ రాయ్, కోనసీమ జిల్లా ఎం ఈ ఎఫ్ ఆర్థిక కార్యదర్శి కందేళ్ల దొరబాబు, ఈతకోట సత్యనారాయణ,ఆర్గనైజింగ్ సెక్రెటరీ చింతపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాతపూడి అబ్బులు,చంద్రమల్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### బుధవారం చింతూరు ఐటీడీఏ వద్ద జరిగే ధర్నాకు

# తనికాకు కార్మికులు తరలిరండి

:ఏప్రిల్ మే నెలల్లో తునికాకు సేకరిస్తే నేటికీ డబ్బులు ఇవ్వని వైనం

:పేమెంట్స్ వెంటనే చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా.. :ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ పిలుపు




**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** ఏప్రిల్ మే నెలలో తునికాకు సేకరించిన కార్మికులకు నేటికీ డబ్బులు ఇవ్వకపోవడం దుర్మార్గం అని తక్షణమే కష్టపడ్డ కార్మికులకు డబ్బులు చెల్లించాలని చింతూరు ఐటీడీఏ ముందు బుధవారం నాడు జరిగే ధర్నాకు తునికాకు కార్మికులందరూ తరలిరావాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ కోరింది. సోమవారం నాడు చింతూరులో జరిగిన ఆదివాసి గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎర్రని ఎండలో పాము,తేలు అనకుండా తునికాకు కార్మికులు తమ పొట్టకూటి కోసం ఆకు సేకరించి ఇస్తే నేటికీ వారికి డబ్బులు చెల్లించకపోవడం అంటే అన్యాయం కాకపోతే ఏమిటని ప్రశ్నించారు. తునికాకు కార్మికులకు డబ్బులు ఇవ్వకుండా వారిపట్ల ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం దేనికని, మంచి ప్రభుత్వం అంటే కార్మికుల కష్టానికి డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడమా అని ఆయన అన్నారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యంలో ఇస్తే ఆదివాసి గిరిజన సంఘం చూస్తూ ఊరుకోదని అందుకే బుధవారం నాడు చింతూరు ఐటీడీఏ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్మికులందరూ ఐక్యంగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాక అర్జున్ దొర, దిలీప్, పూనెం. ప్రదీప్ కుమార్, కారం నాగేష్ మొట్టం.రాజయ్య, బాబు బొర్రయ్య, ఇర్ప.అజయ్, తదితరులు పాల్గొన్నారు.లి

### కూనవరం తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్చార్జిగా

# కొక్కిరేణి ఆదినారాయణ నియామకం



**కూనవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం,కూనవరం మండల తెదేపా క్లస్టర్ ఇన్చార్జి గా కొక్కిరేణి ఆదినారాయణ ను నియమించినట్లు రంపచోడవరం నియోజకవర్గం మిరియాల శిరీష దేవి, రంపచోడవ రం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ తెలిపారు. కొక్కిరేణి ఆదినారాయణ 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు పార్టీ కార్యక్రమమైన సామజిక సేవ కార్యక్రమం అయిన ముందుండి సహాయం చేసే మంచి వ్యక్తిత్వం కలిగిన గొప్ప వ్యక్తి ఆదినారాయణ పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చిన ముందుండి నడిపిన వ్యక్తి సొసైటీ డైరెక్టర్ గా పనిచేసిన అనుభవం గత వైసీపీ ప్రభుత్వ పాలనలో లోపాలు అక్రమాలను అన్యాయాలను ఎదిరించి నిలిచిన వ్యక్తి, కరోనా సమయంలో కూడా తన సొంత ఖర్చులతో చాలా గ్రామాలకు నిత్యావసర వస్తువులు కూరగాయలు అందించిన గొప్ప మానవతా వాది కష్టం అని తన ఇంటికి వచ్చిన ఎవ్వరికైనా నేనున్నానంటూ తన వంతు సహాయం చేసే మంచి మనసున్న మనిషి ఇన్ని సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తున్న ఏ పదవి ఆశించని నికార్సైన తెలుగుదేశం కార్యకర్త తెలుగుదేశం కార్యకర్తగా ఉండడం అనేది పెద్ద పదవి అని అనుక్షణం చెప్పే వ్యక్తి ఇన్ని సంవత్సరాలకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే మిరియాల శిరీష, భాస్కర్ ఈ క్లస్టర్ ఇన్చార్జి లాంటి ముఖ్యమైన మంచి పదవి ఇచ్చి తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ అన్యాయం జరగదు అని నిరూపించడం జరిగింది.ఇలాంటి గొప్ప పదవికి ఆదినారాయణ ను ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పల్లా శ్రీనివాస్,ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ వారికి కాచవరం గ్రామ యువతకు పార్టీ నాయకులకు ఆదినారాయణ ధన్యవాదాలు తెలియచేశారు. నాకు ఇచ్చిన ఈ పదవిని బాధ్యత లా తీసుకుని రంపచోడవరం నియోజకవర్గం లో కూనవరం మండలంను మొట్టమొదటి స్థానంలో నిలబెడతానని ఆదినారాయణ తెలిపారు.

# విద్యార్థినుల చదువుకు ఆర్థిక సహాయం...




**కాకినాడసిటీ :విశ్వం వాయిస్ న్యూస్** అంబికా ఆక్వారీయం రెస్టారెంట్ వారి సేవా కార్యక్రమాలలో భాగంగా మన శ్రీ యువసేన ఆధ్వర్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మానస అనే విద్యార్థినీకి ఒక 20,000 రూపాయలు,బీఎస్సి నర్సింగ్ 3వ సంవత్సరం చదువుతున్న మహిమ అనే విద్యార్థినీకి ఒక 20,000 రూపాయలు ట్రస్టు ఆస్పత్రి డైరెక్టర్ డా.ఎస్.రామకృష్ణ చేతులు మీదుగా అందచేయటం జరిగింది.డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఒక వినూత్న ఆలోచనతో వ్యాపారాన్ని చేయడమే కాకుండా అందులో నుంచి ప్రతి రోజు రెస్టారెంట్ లో ఫుడ్ తినే మొదటి ఇద్దరు వినియోగదారుల బిల్ అమౌంట్ నెల మొత్తాన్ని ఒక 20 నుంచి 30 వేల రూపాయిల ఇలా పేద విద్యార్థుల చదువు నిమిత్తం సహాయం చేస్తున్న కోన సతీష్, ప్రశాంతి దంపతులును అభినందించారు.అనంతరం నా వంతుగా ప్రతి నెల నేను ఒక 5,000 రూపాయలు ఈ చిన్నారుల చదువు నిమిత్తం సహాయం అందచేయటం జరుగుతుందని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ యువసేన అధ్యక్షుడు బొల్లం సతీష్, యండమూరి మణికంట,బోరుసు నాని, శ్రీను,మంగరాజు తదితరులు పాల్గొన్నారు

# కార్యకర్తను కుటుంబ సభ్యునిగా భావించేది టీడీపీయే

వారి సంక్షేమానికి కృషి చేయడం మా కర్తవ్యం

టీడీపీ ఇతర రాజకీయ పార్టీలకు ఆదర్శం

పార్టీ కష్టకాలంలో వెన్నంటి నడిచారని మృతి చెందిన ప్రసాద్ కు లోకేష్ నివాళి

మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల బీమా మొత్తం అందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

కార్యకర్త కుటుంబానికి బీమాతో ధీమా ఉంటుందని కృతజ్ఞతలు తెలిపిన ప్రసాద్ సతీమణి భాను



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** కార్యకర్తను కుటుంబ సభ్యునిగా భావించి వారి సంక్షేమానికి పాటుపడే ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం పార్టీ ఇతర పార్టీలకు ఆదర్శమని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. కార్యకర్తకు బీమా సదుపాయం కల్పించి వారికి ఆర్థిక భరోసా కల్పించే పార్టీ తమ టీడీపీ అని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల మృతిచెందిన 50వ డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త మేడపాటి ప్రసాద్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా నగదు మొత్తం నామిని అయిన ప్రసాద్ సతీమణి భాను బ్యాంకు ఖాతాకు జమ కాగా మంత్రి లోకేష్ పంపిన లేఖను ఈ రోజు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆమెకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం, శ్రేయస్సు కోసం పాటుపడే టీడీపీ వారి కుటుంబానికి కూడా అండగా ఉంటుందని అన్నారు. కార్యకర్తకు వచ్చే రూ.5 లక్షల బీమా మొత్తం ఎవరి ప్రమేయం లేకుండానే మృతుడి కుటుంబ సభ్యుల్లో నామిని బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని ఆయన తెలిపారు. ఆ విధంగానే మృతి చెందిన మేడపాటి ప్రసాద్ సతీమణి భాను బ్యాంకు ఖాతాలో బీమా మొత్తం రూ.5 లక్షలు జమ అయిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. పార్టీ కోసం పని చేసిన ప్రసాద్ లేకపోయినా ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. వారి కుటుంబానికి తమవంతు సహాయ సహకారాలు అందచేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హామీ ఇచ్చారు. ప్రసాద్ కుటుంబానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఒక లేఖ పంపించారని, తెలుగుదేశం పార్టీకి, ప్రజలకు కార్యకర్తగా ప్రసాద్ ఎంతోసేవ చేశారని, కష్టకాలంలో పార్టీ వెన్నంటి నడిచారని ఆయన అకాల మరణం టీడీపీ కుటుంబానికి తీరని లోటని ఆ కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటించారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. ప్రసాద్ సతీమణి భాను పేరున బ్యాంకు ఖాతాలో జమ అయిన బీమా మొత్తం రూ.5 లక్షల గురించి ఆమెకు ఆలేఖ ద్వారా తెలియ చేసినట్లు కూడా ఆయన చెప్పారు. అలాగే ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని లోకేష్ భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వివరించారు. అది తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు, వారి కుటుంబం పట్ల ఉండే అభిమానం, అంకితభావం, బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రసాద్ కుమార్ సతీమణి భాను మాట్లాడుతూ కార్యకర్తలకూ బీమా సదుపాయం ఉంటుందని తెలిసి ఎంతో ఆశ్చర్యం, సంతోషం కలిగిందని, తన భర్త అకాల మరణంతో బాధలో ఉన్న తమ కుటుంబానికి ఈ బీమా మొత్తం కొంతవరకు భరోసా కల్పించిందని, అది కాకుండా స్వయంగా రాష్ట్ర మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తమకు లేఖ ద్వారా సంతాపం తెలియచేసి అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇవ్వడం ఎంతో ఆత్మ స్థైర్యం కలిగిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే తమ కుటుంబానికి అండగా నిలిచి సహాయ సహకారాలు అందిస్తామని ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కు కూడా భాను కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నాయకులు మరుకుర్తి రవి యాదవ్, చింతపల్లి నాని, నేమాలి శ్రీను, ఆనేం చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంనగర్ కాలనీలో ' సుపరిపాలనలో తొలిఅడుగు ' కార్యక్రమం

ఎటపాక తెలుగు యువత నాయకులు పంతాడి అంజి ఆధ్వర్యంలో



**ఎటపాక , విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం జరుగుతుందని ఎటపాక తెలుగు యువత నాయకులు , మత్స్యశాఖ ప్రెసిడెంట్ పంతాడి అంజి పేర్కొన్నారు. పురుషోత్తపట్నం పంచాయతీలోని శ్రీరామ్ నగర్ కాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పంతాడి అంజి మాట్లాడుతూ అవిశ్రాంత కార్మికుడు , విజనరీ లీడర్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏడాదికాలంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న చేసిన సంక్షేమ పథకాలను ఆయన గుర్తు చేశారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలకు మంచి పాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా అర్హత కలిగిన విద్యార్థులకు 15000 చొప్పున తల్లుల ఖాతాలకు నగదు జమ చేశారని తద్వారా ప్రతి తల్లి ముఖంలో చిరునవ్వులు చూశారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గార్లపాటి శ్రీనివాస్ , దొడ్డపనేని లక్ష్మీనారాయణ , చేకూరి సత్యనారాయణ , శ్రీరాములు , కృష్ణంరాజు , పొదిలి నగేష్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో పరుగులు పెడుతున్న సంక్షేమం

- గౌరీదేవిపేటలో ' సుపరిపాలనలో తొలిఅడుగు ' కార్యక్రమం
- ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ఆధ్వర్యంలో



**ఎటపాక , విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి , సంక్షేమం పరుగులు పెడుతుందని ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు పేర్కొన్నారు. ఎటపాక మండలం గౌరీదేవిపేటలోని 300 నంబర్ బూత్ లో ' సుపరిపాలనలో తొలిఅడుగు ' కార్యక్రమాన్ని సోమవారం నాయకులు దొంతు మంగేశ్వరరావు అధ్యక్షతన కార్యకర్తలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కూటమి ప్రభుత్వం రానున్న రోజుల్లో చేయబోయే అభివృద్ధి , సంక్షేమాన్ని నాయకులు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన , చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కరపత్రాలను ఇండ్ల ప్రజలకు అందజేశారు. తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, పారదర్శక పాలన అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు బొల్లా పుల్లయ్య , గౌరీదేవిపేట గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు రాము , సర్పంచ్ ఉలవల శివకనకరాజు , ఉపసర్పంచ్ మడకం నరసింహారావు , జడ్పీహెచ్ఎస్ ఎస్ఎంసి చైర్మన్ గుండె సుధాకర్ , అమరవరపు కిషోర్ , ముక్కెర భద్రరావు , తుర్రం చిట్టయ్య , తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.కె.ఆర్ ఎం.బి.ఏ కాలేజీలో ఏ.ఐ ఆధారిత కోర్సులు ప్రారంభం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం ఆశయానికి తగ్గట్టుగా శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా ఎంబీఏ కాలేజీ తన విద్యార్థినుల భవిష్యత్తును సాంకేతికంగా శక్తివంతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులను ప్రారంభించింది. ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ విద్యతోపాటు, టెక్నాలజీ రంగంలో మహిళలు ప్రగతి సాధించేందుకు ఎంబీఏ చదువుతున్న విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు.ప్రస్తుత రోజుల్లో ఏ రంగంలోనైనా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానం అవసరమని, ఈ కోర్సులు తమకు కెరీర్‌లో కొత్త అవకాశాలను అందిస్తాయని ఏ.ఐ కోర్సులు నేర్చుకుంటున్న విద్యార్థినులు అన్నారు. లెక్చరర్స్ కె. ఝాన్సీ, ఎం. విశాలాక్షి మాట్లాడుతూ, ఏ .ఐ శిక్షణ ద్వారా మేనేజ్మెంట్ విద్యార్థినులు బిజినెస్ కంటెంట్ క్రియేషన్, డిజిటల్ మార్కెటింగ్, బిజినెస్ ఆటోమేషన్, టాలీ మరియు అకౌంటింగ్ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని, వారి కెరీర్ లో మంచి భవిష్యత్తు పొందేందుకు దోహదపడుతుంది అని పేర్కొన్నారు.

# యనమదల ప్రాథమిక సహకార పరపతి సంఘ త్రిసభ్య కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**భారీ ర్యాలి,బాణా సంచాతో ప్రమాణ స్వీకారం**

**సొసైటీ చైర్మన్ గా మాదాల ఆనంద్ రావు**



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్** రామచంద్రపురం మండలం యనమదల గ్రామ సొసైటీ ఎన్నిక ఎక్కిగ్రీవంగా జరిగింది. ఎన్నికలులో మూడు గ్రామాల ప్రజలు అభిప్రాయం మేరకు రాష్ట్ర కార్మిక మంత్రి సుభాష్ ఆదేశాలు అనుసరిస్తూ ఎవరికి బేదాభిప్రాయాలూ లేకుండా ఎంతో పతిష్టంగా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో తాడిపల్లి గ్రామానికి చెందిన మాదాల ఆనంద్ రావు చైర్మన్ గా నియమితులు అయిన సందర్భంగా తన స్వగ్రామం నుండి యనమదల గ్రామం వరుకు ఆనంద్ రావు అనుచరులు, అభిమానులుతో కలిసి యనమదల సొసైటీ బోర్డు కు బాణా సంచా మధ్య,భారీ ర్వాలితో ప్రమాణ స్వీకారం స్థలానికి చేసారుకున్నారు. ముందుగా తాడిపల్లి గ్రామంలో వున్న దేవాలయాలులో దైవ దర్శనం చేసుకుంటూ, స్థానికంగా వున్నా డాక్టర్ అంబెద్కర్ మరియు జగజ్జీవన్ రావ్ విగ్రహాలుకు పూల మాలలు అలంకరించి బయలుదేరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాముఖ్యతలో భాగంగా రామచంద్రపురం మండలం యనదల సొసైటీ పరిధిలో ప్రాథమిక వ్యసాయ సహకార పరపతి సంఘం కార్మిక మంత్రి సుభాష్ సూచనలుతో ఏకిగ్రీవంగా త్రిసభ్య కమిటీ నియమితులైయారు. తాడిపల్లి గ్రామానికి చెందిన మాదాల ఆనంద్ రావు చైర్మన్ గా,గుణ్ణం కృష్ణమూర్తి రొక్కాల రామారావు లను పరసన్ ఇంచార్జ్ కమిటీ సభ్యులుగా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాలుగు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ అధికారి సొసైటీ నియమనిబంధనలు వివరిస్తూ త్రిసభ్య కమిటీ చైర్మన్ గా మాదాల ఆనంద్ రావు,పర్సన్ కమిటీ ఇంచార్జ లుగా గుణ్ణం కృష్ణ మూర్తి, రొక్కాల రామారావుని నియమిస్తున్నట్లు అధికారకంగా ప్రకటించారు. త్రిసభ్య కమిటీ ఏర్పాటు పట్ల మూడు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆనంద్ రావు మాట్లాడుతూ సొసైటీ త్రిసభ్య కమిటీ ఎన్నిక అయినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మూడు గ్రామాల రైతులు మా మీద వున్న నమ్మకంతో నన్ను ఎన్నుకునందుకు కృతజ్ఞతలు తెలిపారు. యనమదల సొసైటీ పరిధిలో రైతులకు ఏ విధమైనా వ్యవసాయ పరంగా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపేలా మంత్రి సుభాష్ ద్రుష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. అలానే రొక్కాల రామారావు మాట్లాడుతూ ఎటువంటి వివాదలకు తావు లేకుండా మూడు గ్రామాల తమ సహాయ సకారాలు అందించినందుకు ధన్యవాదములు తెలిపారు. అలానే అందరుని కాలుకుంటూ మూడు సామాజిక వర్గాలు అయిన బిసి,ఓసి,ఎస్సి న్యాయం చేస్తూ మంత్రి సుభాష్ తీసుకున్న నిర్ణయం నా భూతో నా భవిష్యత్తు అనే విధంగా ఉందన్నారు. అందులో ఎస్సి సామాజిక వర్గం నుండి నన్ను నియమించినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ మూడు గ్రామాల రైతులకు అన్ని విధాలుగా తమ వంతు సహాయ సాకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం యనమదల, అగ్రహారం, ఒదురు,తాడిపల్లి గ్రామాల ప్రజలు త్రిసభ్య కమిటీ సభ్యులుకు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు,రైతులు, అభిమానులు మరియు మాధవరపు రంగనాయకులు, నారాయణస్వామి,బాబీ,గొప్పిశెట్టి నాగేంద్ర,సలాది వీర భద్రరావు,విత్తనాలు వెంకటరమణ,నిమ్మగడ్డ విజయ్,చింతపల్లి సత్తిబాబు,కొండేపూడి శ్రీనివాస జానకి రామయ్య,సత్తిబాబు, బుంగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్ జట్టు కార్మికులకు కూలి రేట్లు పెంచాలి

**ఆర్డీవో కార్యాలయం వద్ద ఐఎఫ్టియు ధర్నా**




**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం డివిజన్లో రైస్ మిల్ లలో పనిచేస్తున్న జట్టు కార్మికులకు మిల్లు యాజమాన్యాలు అతి తక్కువ కూలి రేట్లు ఇస్తున్నారని ఐఎఫ్టియు ఆధ్వర్యంలో రామచంద్రపురం ఆర్డీఓ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. పెరిగిన ధరలతో పోల్చితే రేట్లు పూటకడవటం లేదని వెంటనే కార్మిక అధికారులు కల్పించుకుని కూలిరేకులు పెంచడానికి చర్యలు తీసు కోవాలని ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు అధికారం డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాల క్రితం అరకొరగా మిల్లు యాజమాన్యాలు పెంచిన రేట్లు ఒప్పందం గడువు ముగిసినా, యాజమాన్యాలు కార్మికుల నోట్లో మట్టుకుడుతూ మరో రెండు సంవత్సరాలు వరకు కార్మికులను బానిసలుగా పని చేయాలని చూస్తున్నారన్నారు. ఇది ముమ్మాటికీ కార్మికులను బానిసలుగా మార్చుకోవడమేనని, గ్రహించి జట్టు కార్మికులు తిప్పుకొట్టాలని అన్నారు. గడువు ముగిసి 1 సంవత్సరం 5 నెలలు కావస్తున్నా రేట్లు పెంచకుండా కార్మికుల న్యాయమైన హక్కుల్ని కాలరాయడం నియంతృత్వమే అన్నారు. అందుకే రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. జట్టు కార్మికులు బానిసలు కాదని అక్రమంగా మరో రెండు సంవత్సరాలు రేట్లు పట్టిక మార్చి వేశారన్నారు. ఎన్నాళ్లో ఏ ప్రభుత్వం రైస్ మిల్ జట్టు కార్మికుల సమస్యల్ని పట్టించుకోని న్యాయం చేయలే న్యాయం చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ మైనా జట్టు కార్మికులకు న్యాయం చేస్తుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మీసాల శ్రీను,చిట్టూరి శ్రీనివాసరావు,కోసూరి జగన్నాథం,భూమిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, కడియాల అప్పారావు,ఎం గణేష్,కర్రీ రామకృష్ణ మరియు వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు

## బూత్ స్థాయి అధికారుల జాతీయ శిక్షణా కార్యక్రమం



**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్,రిపోర్టర్ :** బూత్ స్థాయి అధికారుల జాతీయ శిక్షణా కార్యక్రమంలో భాగంగా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఆర్.ఆర్.సి, ఓటరు నమోదు అధికారి పి.కృష్ణమూర్తి ఆద్వర్యంలో మండల కేంద్రమైన రాయవరంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గల మీటింగ్ హాల్ నందు, నెంబర్ 48 మండపేట అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి సోమవారం 113 నుండి 157 వరకూ ఉన్న పోలింగ్ స్టేషన్ లకు చెందిన బూత్ లెవెల్ అధికారులకు, న్యూఢిల్లీ వెళ్ళి శిక్షణ పొంది వచ్చిన, మండపేట మండలం ఏడిద సచివాలయ వెల్ఫేర్,ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మాస్టర్ ట్రైనర్ నాగం నాగ శివ ద్వారా బూత్ లెవెల్ అధికారులకి సంబంధించిన ఎన్నికల విధులు,బాధ్యతలు, ఫారం-6, 6ఎ, 7, 8, 9, 10, 11, 11ఎ, 11బి,12,13,14 ల పై శిక్షణ ఇచ్చిన అనంతరం సాయంత్రం గం.4.00 నుండి 5.00 గం.ల వరకూ, ఎన్నికల కమీషన్ వారి నుండి వచ్చిన గూగుల్ లింక్ ద్వారా పరీక్ష నిర్వహించి, తదుపరి ప్రతిజ్ఞ చేయించి,వారికి ధ్రువీకరణ పత్రాలు అందచేసారు. ఈ కార్యక్రమంలో ఓటరు నమోదు అధికారి రాయవరం తహశీల్దార్ ఐ.పి.శెట్టి, సహాయ ఓటరు నమోదు అధికారి, మండపేట ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పి.ఎ.మెహర్ బాబా, రాయవరం డిప్యూటీ తహశీల్దార్ కె. భాస్కర్, రీ సర్వే డి.టి. ఐ.సంధ్య, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది,113 నుండి 157 వరకూ ఉన్న పోలింగ్ స్టేషన్ లకు సంబంధించిన బూత్ లెవెల్ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

## నాట్య ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు అభినందన



**ఆలమూరు (విశ్వం వాయిస్ న్యూస్):** మండల కేంద్రమైన ఆలమూరులోని శ్రీ సిద్ధార్థ పాఠశాల విద్యార్థినిలు నాట్య ప్రదర్శన, పోటీల్లో ప్రతిభ చూపారు. ఈనెల 10 నుండి 13వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన 36వ ఆలిండియా క్లాసికల్ అండ్ ఫోక్ డాన్స్ కాంపిటీషన్లో సినీ క్లాసికల్ డాన్స్ జూనియర్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని డి కావ్యశ్రీ మొదటి బహుమతి క్లాసికల్ గ్రూప్ జూనియర్ విభాగంలో రెండవ బహుమతిని గెలిచింది. అలాగే నిడదవోలుకు చెందిన శ్రీ బ్రాహ్మరి కూచిపూడి నాట్య నిలయంవారు నిర్వహించిన నాట్య శిరోమణి నృత్యోత్సవం 2025 పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థినులు సిహెచ్ ప్రణీత, కె శరణ్య, ఏడవ తరగతి విద్యార్థినులు టి మణి శ్రీ, ఐ చైత్రిక అత్యుత్తమ ప్రతిభ చూపి ప్రశంసాపత్రాలను పొందారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో వివిధ సంస్థలు నిర్వహించిన పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థినులను సోమవారం పాఠశాల డైరెక్టర్ ముల్లారావు అభినందించారు. భవిష్యత్తులో ఉత్తమమైన ప్రతిభ కనపరిచి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గుణశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## సమస్యలు వింటూ.. కరపత్రాలు పంచుతూ ఇంటింటా ప్రచారం

**మంత్రి సుభాష్ కు ఘనంగా స్వాగతం పలికిన గ్రామ ప్రజలు**



**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :**-రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ద్వారానే మెరుగైన పాలన సాధ్యమని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలోనే పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధి పదంలో రాష్ట్ర ప్రభుత్వం పయనిస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం వెల్ల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజల వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజేస్తూ లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ దీర్ఘకాలిక ప్రణాళికలతో అనుభవజ్ఞుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళు తున్నారని,ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలు వింటూ ప్రజల అభిప్రాయాలను మై టిడిపి యాప్ లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,పలువురు కూటమి పార్టీ నాయకులు, మండల అధ్యక్ష కార్యదర్శులు,బూత్,క్లస్టర్ ఇన్చార్జిలు,గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు,గ్రామ కమిటీ సభ్యులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**పలువురికి భవానీ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున పలువురికి ఆర్థిక సహాయం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** కష్టాలు... ఇబ్బందుల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్తకు, పేద విద్యార్థులకు తాము... తమ కూటమి ప్రభుత్వం అండగా ఉంటామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. నగరంలోని పలువురు పేద విద్యార్థులకు, అలాగే వివిధ సమస్యలతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలకు తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయా కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. పార్టీ తరపున సహకారం అందేలా చూస్తామన్నారు. కాగా తమ ట్రస్టు తరపున నిత్యం ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటున్నామన్నారు. పేద విద్యార్థులకు ఫీజు నిమిత్తం, అలాగే అనారోగ్యంతో బాధపడే పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. కాగా ఆరోగ్యకర సమాజం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సంకల్పమన్నారు. అందుకే ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించని పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందచేస్తున్నామని చెప్పారు. సిటీ నియోజకవర్గంలో ఇంత వరకు 147 మందికి రూ. కోటి 92 లక్షల వరకు సీఎం సహాయ నిధి ద్వారా అందచేశామని చెప్పారు. తమ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సంకల్పమన్నారు. అందుకే ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించని పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందచేస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాజమండ్రిలో సీఎం సహాయ నిధి నుంచి ఒక్కచెక్కు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇంకా నగరంలో సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకున్న వారు 77 మంది ఉన్నారని ఆ అందరికి రెండు నెలల్లోనే నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిని 15 రోజులకు ఒకసారి సందర్శించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చింతపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

## కాజులూరు మండలంలో వేగవంతంగా సుపరి పాలన ముందడుగు కార్యక్రమం



**విశ్వం వాయిస్-కాజులూరు** రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు మేరకు కాజులూరు మండల గ్రామాల్లో సుపరిపాలన ముందడుగు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ఈ మేరకు టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం యూనిట్, బూత్ ఇంచార్జ్ లు, మండల, గ్రామస్థాయి టీడీపీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించిన నేపథ్యంలో సోమవారం గ్రామాల్లో కార్యకర్తల పనితీరును వేగవంతం చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ ఏడాది పాలనపై వివరిస్తూ ప్రజా సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఆర్యవటం 112, 113 బూత్ లలో 70శాతంకి పైగా సుపరిపాలన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గుబ్బల నాగేంద్ర కుమార్, యూనిట్ ఇంచార్జ్ చందాల త్రిమూర్తులు, టీడీపీ నాయకులు చందాల వివి సత్యనారాయణ, బూత్ ఇంచార్జ్ లు బొక్కా రాజు, చందాల వీరన్న, గ్రామకమిటీ ఉపాధ్యక్షుడు మేడిశెట్టి వీరబాబు, యరకం నాగు, పింద్రాల బాలాజీ, చందాల రాంబాబు, సూదికొండ రాజు, బొక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మండల స్థాయిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ విస్తృత ప్రచారం

**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-** రామచంద్రపురం నియోజకవర్గం మండలం అధ్యక్షులు పోలీనాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో హసన్ బాద గ్రామం నందు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రామచంద్రపురం వైసీపీ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వాస్తవాలను తెలియజేసి,మోసపూరిత హామీల పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలో తెలియజేయాలన్నారు. అలానే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమం నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామ స్థాయిలో కూడా విజయవంతం చేయాలని కోరారు. అలానే ఈ రోజు కార్యక్రమన్ని విజయవంతం చేసినందుకు పేరు పేరున నాయకులుకు,కార్యకర్తలు కు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గం పరిశీలకులు కుడుపూడి శ్రీనివాస్ రావు,మండలం అధ్యక్షులు అంబటి భవాని,మాజీ ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్,జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి,మాజీ ఎంపీపీ కట్టా సూర్య నారాయణ,మరియు సర్పంచులు,ఎంపీటీసీలు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరాంఘర్‌లో ఆర్టీసీ బస్ స్టేషన్

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో రాష్ట్ర, అంతర్రాష్ట్ర బస్సుల కోసం మరో భారీ బస్ టెర్మినల్ అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అంతర్రాష్ట్ర బస్సుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులు నగరంలో ట్రాఫిక్‌జామ్ సమస్యల కారణంగా ఎంజీబీఎస్‌కు (మహాత్మా గాంధీ బస్ స్టేషన్) ఆలస్యంగా చేరుకుంటున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ఆధునిక బస్ టెర్మినల్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. జాతీయ రహదారి 44కు పక్కనే ఆరాంఘర్‌లో 7.22 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీ గుర్తించింది. ఈ స్థలంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ (ఐసీఎస్‌డబ్ల్యూ) భవనాలున్నాయి. వాటికి పరిహారంగా రూ. 6 కోట్లు చెల్లించేందుకు ఆర్టీసీ ముందుకు వచ్చింది. ఈ భూమిని ఆర్టీసీ బస్ టెర్మినల్‌కు కేటాయించాలని కోరుతూ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 2025 జనవరి 25న రెవెన్యూశాఖకు లేఖ రాశారు. అయితే ఆరు నెలలు దాటినా ఈ అంశం ఇంకా కొలిక్కిరాలేదు. ఈ భూకేటాయింపు ప్రతిపాదన రంగారెడ్డి కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే నగరంలో ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్ ఏర్పాటుకు అడుగు పడుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రెండు ప్రధాన భారీ బస్ టెర్మినల్స్ ఉన్నాయి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ హైదరాబాద్‌లోని అతిపెద్ద, ముఖ్యమైన బస్ స్టేషన్లలో ఒకటి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, అలాగే పొరుగు రాష్ట్రాలకు వెళ్లే బస్సులకు ఇది ప్రధాన కేంద్రం. ప్రతిరోజు లక్షలాది మంది ప్రయాణికులు దీని ద్వారా రాకపోకలు సాగిస్తారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలోని జూబ్లీ బస్ స్టేషన్ ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సేవలందిస్తుంది. కొత్త బస్ టెర్మినల్ అందుబాటులోకి వస్తే దక్షిణ తెలంగాణ జిల్లాల నుండి వచ్చే బస్సులకు, అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుండి వచ్చే బస్సులకు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. ఇది ప్రయాణికులకు కూడా సమయం ఆదా అవుతుంది.



# భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాముఖ్యతను పౌరులు అర్థం చేసుకోవాలి

భావ ప్రకటనా స్వేచ్ఛపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. పౌరులు తమ వాక్ స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ విలువలను అర్థం చేసుకొని స్వీయ నియంత్రణ, సంయమనం పాటించాలని సూచించింది. సోషల్ మీడియాలో పెరుగుతున్న విభజన ధోరణులను నియంత్రించాలని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. 'తాము సెన్సార్‌షిప్ గురించి మాట్లాడటం లేదు. ప్రజలు తమంతట తామే బాధ్యత వహించాలి. తమ వ్యాఖ్యలతో సంయమనం పాటించాలి. సుప్రీంకోర్టు, రాష్ట్రం (ప్రభుత్వం) ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకోవాలని ఎవరూ కోరుకోరు. అందువల్ల ప్రజలే స్వయంగా బాధ్యత తీసుకోవడం చాలా ముఖ్యం. సోషల్ మీడియా, సమాజంలో ఉద్రిక్తతలను వ్యాప్తి చేసే ఇతర వేదికలపై ఏమీ చెప్పొద్దు' అని కోర్టు పేర్కొంది. పౌరుల్లో సోదరభావ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. వేర్పాటువాద ఆలోచనలు వేగంగా వ్యాప్తి చెందుతున్న నేటికాలంలో పౌరులు ఆలోచనాత్మకంగా మాట్లాడాలని సూచించింది. విచారణ సందర్భంగా.. సర్వోన్నత న్యాయస్థానం 'మేం భావ ప్రకటనా స్వేచ్ఛకు వ్యతిరేకం కాదు. కానీ, రాజ్యాంగంలో దానిపై ఇప్పటికే సహేతుకమైన పరిమితులు ఉన్నాయి. ప్రజలు ఈ పరిమితులను పాటించాలి' అని చెప్పింది. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన, రెచ్చగొట్టే పోస్టుల పై ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌కు సంబంధించిన కేసును విచారిస్తున్న సమయంలో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛ, సమాజంలో సామరస్యాన్ని కొనసాగించే ప్రవర్తనా నియమావళిని రూపొందించవచ్చా?



అని కోర్టు పరిశీలిస్తోంది. సోషల్ మీడియాలో హిందూ దేవతలపై అభ్యంతరకరమైన పోస్టులను పోస్ట్ చేసినందుకు తనపై దాఖలైన అనేక ఎఫ్ఐఆర్‌ల నుంచి ఉపశమనం కోరుతూ వజాహత్ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు బీవీ నాగరత్న, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారిస్తున్నది. ఇంతకు ముందు జూన్ 23న వజాహత్ ఖాన్‌కు అరెస్టు నుంచి కోర్టు మధ్యంతర ఉపశమనం కల్పించింది. జులై 14 వరకు పొడిగించారు. తన పాత ట్వీట్ల కారణంగా అసోం, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో తనపై కేసులు నమోదయ్యాయని కోర్టుకు తెలిపారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ శర్మిష్ఠ పనౌలిపై తాను గతంలో ఫిర్యాదు చేశానని.. ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. వజాహత్ ఖాన్‌కు ఇచ్చిన అరెస్టు నుంచి మధ్యంతర ఉపశమనాన్ని తదుపరి విచారణ వరకు కోర్టు పొడిగించింది. అలాగే, స్వీయ నియంత్రణ, బాధ్యతతో పౌరులు భావ ప్రకటనా స్వేచ్ఛను ఎలా ఉపయోగించుకోవాలో అనే అంశంపై సహాయం చేయాలని సర్వోన్నత న్యాయస్థానం న్యాయవాదులను కోరింది.

# విభేదాలు.. వివాదాలుగా మారకూడదు

**బీజింగ్:** విభేదాలు ఎప్పుడూ వివాదాలుగా మారకూడదని, అలాగే పోటీ.. సంఘర్షణగా మారకూడదని భారత విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ అన్నారు. చైనా పర్యటనలో ఉన్న ఆయన.. ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టియాంజిన్ వేదికగా మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకోవాలని, మంచి ఫలితాలు రావాలని కోరుకున్నట్లు చెప్పారు. ఇరుదేశాల విదేశాంగశాఖ మంత్రుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ.. దూరదృష్టితో ఆలోచించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "అక్టోబర్ 2024లో ఇరుదేశాల నేతల సమావేశం జరిగిన తర్వాత నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు సానుకూల దిశలో ముందుకు సాగుతున్నాయి. బాధ్యతాయుతంగా మన రెండు దేశాలు దానిని కొనసాగించాలి. ఇటీవల కాలంలో పలు అంతర్జాతీయ వేదికల్లో కలిసేందుకు, వ్యూహాత్మక చర్చలు జరిపేందుకు అవకాశం లభించింది. ఇలా క్రమం తప్పకుండా సమావేశాలు



ఏర్పాటు చేసుకొని పరస్పరం చర్చించుకుంటే రెండు దేశాలకూ మేలు జరుగుతుందని భారత్ ఆశిస్తోంది. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తవుతుంది. ఐదేళ్ల విరామం తర్వాత ప్రఖ్యాత మానసరోవర్ యాత్ర పునఃప్రారంభమైనందుకు సంతోషంగా ఉంది. ఈ విషయంలో చైనాకు కృతజ్ఞతలు చెబుతున్నా. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో గత 9 నెలల్లో కీలక పురోగతి సాధించాం. సరిహద్దు వెంబడి ఘర్షణ వాతావరణం లేకుండా చర్యలు తీసుకున్నాం. ద్వైపాక్షిక సంబంధాలు సజావుగా సాగుతున్నాయనడానికి ఇదే నిదర్శనం. ఉద్రిక్తతలను తగ్గించడంతో సహా సరిహద్దుకు సంబంధించిన ఇతర అంశాలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అర్థికంగా రెండు బలమైన దేశాలు కలిసి ముందుకు వెళ్తే.. త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుంది. భారత్, చైనా మధ్య స్థిరమైన సంబంధాలు ప్రపంచానికే మేలు చేస్తాయి." అని జై శంకర్ తెలిపారు. మంగళవారం జరగనున్న ఎస్‌సీవో సమావేశంలో ముఖ్యంగా తీవ్రవాదం, వేర్పాటువాదం, ఉగ్రవాదం అనే అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందని జైశంకర్ పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేయాలన్న కృతనిశ్చయంతో భారత్ ఉందని పునరుద్ఘాటించారు. విదేశాంగశాఖ మంత్రిగా ఇరుదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత వాంగ్ యీ పైనా ఉందని జైశంకర్ తెలిపారు. నిర్మాణాత్మకమైన, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎస్‌సీవోలో చర్చలు సాగుతాయని ఆశిస్తున్నట్టు చెప్పారు.

## నేటి నుంచి భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు.. వాషింగ్టన్‌కు ఇండియా టీమ్




భారత్-అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం సోమవారం నుంచి మరో విడత చర్చలు జరగనున్నాయి. అమెరికాలోని వాషింగ్టన్ నగరంలో ఇవాళ చర్చలు మొదలు కానున్నాయి. ఇప్పటికే భారత వాణిజ్య శాఖ అధికారులతో కూడిన ఓ బృందం వాషింగ్టన్‌కు చేరుకుంది. ఈ టీమ్‌లో చీఫ్ నెగోషియేటర్‌గా వ్యవహరించే వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ మాత్రం బుధవారం తన బృందంతో కలువనున్నారు. సోమవారం నుంచి నాలుగు రోజులపాటు ఈ వాణిజ్య చర్చలు జరగనున్నాయి. గురువారం ముగియనున్నాయి. వ్యవసాయం, ఆటోమొబైల్ లాంటి రంగాల్లో నెలకొన్న చిక్కు ముడులను తొలగించుకోవడానికి ఇరు దేశాలకు చెందిన బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా కూడా అదనపు టారిఫ్‌ల అమలును వాయిదా వేసింది. ఆగస్టు 1 వరకు పలు దేశాలకు గడువు పొడిగించింది. భారత్ ఈ చర్చల్లో పూర్తిస్థాయి ద్వైపాకిక్ష వాణిజ్య ఒప్పందం కోసం ప్రయత్నిస్తోంది. ఆగస్టు 1 నాటికి తొలి విడత డీల్‌ను కుదుర్చుకోవాలని, ఆ తర్వాత కూడా చర్చలను కొనసాగించి పూర్తిస్థాయి ఒప్పందానికి రావాలని ప్రయత్నిస్తోంది. భారత్ వ్యవసాయం, పాల ఉత్పత్తుల విషయంలో అమెరికాకు టారీఫ్‌లలో రాయితీలు ఇచ్చేందుకు సుముఖంగా లేదు. మరోవైపు 26 శాతం టారిఫ్‌లను అమెరికా తొలగించాలని బలంగా కోరుతోంది. అలాగే స్టీల్‌పై 50 శాతం, ఆటో సెక్టార్‌పై 25 శాతం పన్ను తొలగించాలని కోరుతోంది.

# చిక్కుల్లో షేక్ హసీనా కూతురు!



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కూతురు డాక్టర్ సైమా వాజెద్ చిక్కుల్లో పడ్డారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌత్-ఈస్ట్ ఏషియా ప్రాంతానికి ఆమె రీజియనల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న సంగతి తెతలిసిందే. అయితే సొంత దేశంలో అవినీతి ఆరోపణలు వెల్లవెత్తడంతో.. డబ్ల్యూహెచ్‌వో ఆమెను నిరవధిక సెలవులపై పంపింది. ఇప్పటికే భారత్‌లో ఆశ్రయం పొందిన షేక్ హసీనాపై బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం పలు అభియోగాలను నమోదు చేసింది. అయితే తాజాగా ఆమె తనయ సైమా వాజెద్‌పైనా అవినీతి కేసులు నమోదు చేసింది. దీంతో ఆమెను సెలవులపై పంపించిన డబ్ల్యూహెచ్‌వో.. సైమా స్థానంలో డాక్టర్ కాథరినా బూమీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతారని వెల్లడించింది. అయితే ఆమె సెలవుల వ్యవహారంపై ప్రశ్న ఎదురుకాగా.. అదనంగా స్పందించేందుకు డబ్ల్యూహెచ్‌వో నిరాకరించింది. డబ్ల్యూహెచ్‌వో నిర్ణయంపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం స్పందించింది. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిసిన ఓ అధికారి.. ఆమెను శాశ్వతంగా తప్పించాలని ఐక్యరాజ్య సమితి విభాగానికి విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉంటే.. డబ్ల్యూహెచ్‌వో రీజియనల్ ఆఫీస్ న్యూఢిల్లీలోనే ఉంది. కాథరినా జులై 15వ బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం. సైమా వాజెద్‌పై అధికార దుర్వినియోగం, ఫోర్జరీ, ఫ్రాడ్ కేసులను బంగ్లాదేశ్ యాంటీ కరప్షన్ కమిషన్ నమోదు చేసినట్లు తెలుస్తోంది. 1972 డిసెంబర్ 9న డా. ఎం.ఎ. వాజేద్ మియా (న్యూక్లియర్ సైంటిస్ట్), షేక్ హసీనా దంపతులకు సైమా వాజెద్ జన్మించారు. ఫ్లోరిడా(అమెరికా) బ్యారీ యూనివర్సిటీలో ఆమె సైకాలజీలో డిగ్రీ, పీజీ చేశారు. ఆర్గనైజేషనల్ లీడర్‌షిప్‌లో డాక్టరల్ చేశారు. స్కూల్ సైకాలజీలో స్పెషలిస్ట్ అయిన ఆమె.. ఆటిజం, మానసిక ఆరోగ్యంపై ఆమె చేసిన ప్రచారాలు అంతర్జాతీయ స్థాయిలో మార్పులకు దారితీశాయి. డబ్ల్యూహెచ్‌వో ఆమె నేతృత్వంలో మూడు తీర్మానాలకు ఆమోదం తెలిపింది. ఆమె భర్త ఖండకర్ మస్రూర్ హుస్సేన్ మితు. ఈయనది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. ఈ జంటకు నలుగురు పిల్లలు. అయితే వీళ్లు విడిపోయారంటూ ఆ మధ్య ప్రచారం జరిగినా.. అధికారికంగా ఇద్దరిలో ఎవరూ ఖండించకపోవడం గమనార్హం.

## నేరాల రాజధానిగా బిహార్


**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ పార్టీలు విమర్శలకు పదును పెడుతున్నాయి. రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న వరుస హత్య ఘటనలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. 'దేశ నేరాల రాజధాని'గా బిహార్ మారిందని



విమర్శించారు. నిరుద్యోగ యువత హత్యలు చేస్తూ గూండాలుగా మారుతుంటే.. సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం తన కుర్చీని కాపాడుకునేందుకే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. మరోవైపు భాజపా మంత్రులు కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈసారి ఓటు అనే ఆయుధాన్ని ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాకుండా.. బిహార్‌ను కాపాడేందుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. బిహార్‌లో ఆదివారం దారుణం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. పట్టపగలు ఓ లాయర్‌ని దుండగులు తుపాకీతో కాల్చి చంపారు. అంతకుముందు ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా, భాజపా నేత సురేంద్ర కేవాట్‌లు హత్యకు గురయ్యారు. వారం రోజుల వ్యవధిలోనే ముగ్గురు ప్రముఖ వ్యక్తులు హత్యకు గురవ్వడం రాష్ట్రంలోని శాంతిభద్రతలపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. సరిగ్గా ఎన్నికలకు ముందు ఇలాంటి వరుస ఘటనలు చోటు చేసుకోవడం చర్చనీయాంశమవుతోంది. మరోవైపు ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా.. అధికారాన్ని నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ తీవ్రంగా యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా రానున్న ఐదేళ్లలో కోటి మందికి ఉద్యోగాలు కల్పిస్తామని కీలక ప్రకటన చేశారు.

## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు

**న్యూఢిల్లీ:** మూడు రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గవర్నర్లను నియమించారు. హర్యానా గవర్నర్‌గా ప్రొఫెసర్ అషిమ్ కుమార్ ఘోష్, గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతి రాజు, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవిందర్ గుప్తా నియమిస్తూ సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు



**అశోక్ గజపతి రాజు రాజకీయ నేపథ్యం**

పూసపాటి అశోక్ గజపతి రాజు టీడీపీ సీనియర్ నేతగా, కేంద్ర మాజీ మంత్రిగా రాజకీయాల్లో రాణించారు. తాజాగా ఆయన్ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గోవా గవర్నర్‌గా నియమించారు. అశోక్ గజపతిరాజు ఏడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2014లో ఎంపీగా గెలిచి నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్సైజ్, రెవెన్యూ, వాణిజ్య పన్నులు, ఫైనాన్స్ వంటి కీలక శాఖలను నిర్వహించారు.

**రాజవంశీయ నేపథ్యం**

అశోక్ గజపతి రాజు తండ్రి పూసపాటి విజయరామ గజపతి రాజు. విజయనగరం సంస్థానపు చివరి మహారాజు. అశోక్ గతపతి రాజు రాజకీయాలతో పాటు సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా సేవలందించారు. ఇవాళ గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజును నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ అధికారికంగా ప్రకటించింది.

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా పిటిషన్లు వేస్తేనే.. నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు

**నాగ్‌పూర్:** ప్రజా పరిపాలన క్రమశిక్షణగా సాగాలంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేయడం అవసరమని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అలా ప్రభుత్వాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు వేసేవారే ఈ సమాజానికి కావాలని అభిప్రాయపడ్డారు.



ఒక్కోసారి ప్రభుత్వం చేయలేని పనిని కూడా కోర్టు ఉత్తర్వులు చేయిస్తాయన్నారు. నాగ్‌పుర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్లు వేసే కొంతమంది వ్యక్తులు సమాజంలో ఉండాలి. అప్పుడే రాజకీయ నాయకులు క్రమశిక్షణగా వ్యవహరిస్తారు. న్యాయస్థానం ఇచ్చే ఉత్తర్వులు మంత్రుల నిర్ణయాల కంటే బలమైనవి. కొన్నిసార్లు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ప్రజాప్రతినిధులు సరైన నిర్ణయాలు తీసుకోలేరు. అలాంటప్పుడు కోర్టులు ఆదేశాలిస్తే వాటిని ప్రభుత్వాలు తప్పనిసరిగా, తక్షణమే పాటించాల్సి వస్తుంది" అని గడ్కరీ అన్నారు. గతంలో కొందరు సమాజశ్రేయస్సు కోసం ప్రభుత్వాలతో న్యాయపోరాటం చేశారని కేంద్రమంత్రి ఈసందర్భంగా గుర్తుచేశారు. వారి పోరాటంతో ప్రభుత్వాలు కూడా తలొగ్గి నిర్ణయాలు మార్చుకున్న సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. "కోర్టుల్లో కేసులు వేయడం అనేది కేవలం హక్కు మాత్రమే కాదు.. ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేసేందుకు సమాజానికి ఉన్న శక్తిమంతమైన సాధనం. బాధ్యాతయుత పాలన, ప్రజాప్రయోజనాలను పరిరక్షించడం కోసం న్యాయవ్యవస్థను సమర్థంగా ఉపయోగించుకోవాలి" అని గడ్కరీ సూచించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.జ

## రష్యాలో 10 లక్షలమంది భారత కార్మికులకు ఉపాధి!

ఇంటర్నెట్‌డెస్క్: దేశంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికశక్తి కొరతను అధిగమించేందుకు భారత్‌వైపు రష్యా దృష్టి సారించింది. దాంతో ఈ ఏడాది చివరి నాటికి 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన భారత కార్మికులకు రష్యా ఉపాధి కల్పించనున్నట్లు



తెలుస్తోంది. అలాగే ఆ దేశంలో యాకటెరిన్‌బర్గ్‌లో ఒక కొత్త కాన్సులేట్ జనరల్ ప్రారంభం కానుంది. ఇది వలస కార్మికుల అంశాలను పరిశీలించనుంది. ఈ విషయాన్ని ఉరల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చీఫ్ అండ్రీ బెసెడిన్ ఓ మీడియా సంస్థకు వెల్లడించారు. రష్యాలోని ఉరల్ పర్వతాలకు సమీపంలోని యాకటెరిన్ బర్గ్ ప్రాంతం భారీ పరిశ్రమలకు నిలయంగా ఉంది. అక్కడ మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ కూడా ఉంది. ఈ పారిశ్రామిక సంస్థలు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని బెసెడిన్ అన్నారు. మన దేశంతో పాటు శ్రీలంక, ఉత్తరకొరియా నుంచి కార్మికులను రప్పించేందుకు రష్యా ప్రయత్నిస్తోంది. అయితే ఆ ప్రక్రియలో కొన్ని సమస్యలు ఉన్నాయని భావిస్తోంది. 2024 నుంచి రష్యా సంస్థల్లో పనిచేసేందుకు భారత్ నుంచి వలస కార్మికులు రావడం ప్రారంభమైంది. రష్యా కార్మికశాఖ అంచనా ప్రకారం.. 2030 నాటికి ఆ దేశంలో కార్మిక శక్తి కొరత 3.1 మిలియన్లుగా ఉండనుంది. ఈ క్రమంలోనే విదేశీ కార్మికులను ఆహ్వానిస్తోంది.

# బిజినెస్

## ఒక కోటి ఐదు లక్షల రుపాయలకు చేరిన బిట్ కాయిన్ విలువ!

జపర్సనల్ ఫైనాన్సింగ్‌లో బిట్‌కాయిన్ ఒక కొత్త పెట్టుబడి ఎంపికగా మారింది. బిట్‌కాయిన్ ధర లక్షా 20వేల డాలర్ల గరిష్ఠానికి చేరింది. ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక పెట్టుబడిగా బిట్‌కాయిన్‌ను పరిగణిస్తున్నారు. క్రిప్టో మార్కెట్‌లో చిన్నచిన్న ఒడిదొడుకులు ఉన్నప్పటికీ, భవిష్యత్తులో బిట్‌కాయిన్ ధర మరింత పెరగవచ్చునని నిపుణులు అంచనా వేస్తున్నారు. పర్సనల్ ఫైనాన్సింగ్ కేటగిరీలో బిట్‌కాయిన్ సరికొత్త పెట్టుబడి ఎంపికగా మారిపోయింది. దీంతో క్రిప్టో కాయిన్ రేటు తన సుదీర్ఘ ప్రయాణంలో 1లక్ష 20వేల డాలర్ల జీవితకాల గరిష్ఠానికి చేరుకుంది. అయితే ఇన్వెస్టర్లలో వచ్చిన అవగాహన, క్రిప్టోల వైపు వారి అడుగులు పెద్ద మార్పుగా పరిగణిస్తున్నట్లు ప్రముఖ క్రిప్టో ఎక్స్ఛేంజీ జియోటస్ సంస్థ పేర్కొంది. ఒకప్పుడు ఇంట్రాడే ట్రేడింగ్ కోసం క్రిప్టోల్లోకి వచ్చిన ఇన్వెస్టర్లు ప్రస్తుతం దానిని ఒక వ్యూహాత్మక దీర్ఘకాలిక అసెట్ క్లాస్ కింద పరిగణిస్తున్నట్లు వాలెట్ చేరికల్లో పెరుగుదల సూచిస్తోందని క్రిప్టో ఎక్స్ఛేంజీ వెల్లడించింది. ప్రస్తుతం వచ్చిన మార్పులు బిట్‌కాయిన్ వేగంగా సంపద సృష్టికి పునాది స్తంభంగా మారుతుందనే లోతైన మార్కెట్ నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొంది. ఇటీవల బిట్‌కాయిన్ తన టెక్నికల్ రెసిస్టెన్స్ లెవెల్ లక్ష 10 వేల డాలర్ల మార్కును అధిగమించటం ర్యాలీకి కారణంగా మారింది. దీనికి తోడు ఎథెరియం, సోలానా, కార్డానో, సుయి వంటి ఇతర కాయిన్స్ కూడా క్రిప్టో ఇన్వెస్టర్ల నుంచి మంచి ఆదరణను పొందుతున్నాయి. డేటా ప్రకారం ఈ ఏడాది బలమైన ట్రెండ్ కొనసాగే అవకాశం ఉందని ఊహించబడింది. ఈ క్రమంలో



చిన్నచిన్న ఒడిదొడుకులు ఉన్నప్పటికీ క్రిప్టోల ప్రాభల్యం పెట్టుబడుల ప్రపంచంలో సుస్థిరంగా ముందుకు సాగుతుందని జియోటస్ భావిస్తోంది. ఈ క్రమంలో చాలా మంది ఇన్వెస్టర్లలో ఉండే అనుమానం బిట్‌కాయిన్ ర్యాలీ ఇంకెంత వరకు చేరుకుంటుంది అన్నదే. దీనికి జియోటస్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ అంచనాలను చూస్తే ఇకపై బిట్‌కాయిన్ ధర లక్షా 35వేల డాలర్ల రేటు వద్ద నిరోధాన్ని ఎదుర్కొంటుందని తెలుస్తోంది. ఇదే క్రమంలో క్రిప్టో ఈటీఎఫ్ పెట్టుబడులు పెరిగితే ఒక్కో బిట్‌కాయిన్ రేటు ఏకంగా లక్షా 50వేల డాలర్ల వరకు చేరుకునే అవకాశం ఉందని విక్రమ్ చెబుతున్నారు. మార్కెట్లలో ఓలటాలిటీ, ప్రాఫిట్ బుక్కింగ్, ఇతర ఒడిదొడుకులు ఉన్నప్పటికీ చాలా మంది తమ పోర్ట్ ఫోలియోలో క్రిప్టోలకు కొంత సముచిన మొత్తాన్ని కేటాయించి ముందుకు సాగటానికి ఇది సరైన సమయంగా జియోటస్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ అభిప్రాయపడుతున్నారు.

## ఎక్స్‌ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ధర తగ్గింపు



ఎలన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' భారత్‌లోని వినియోగదా రులకు ప్రీమియం సేవలపై తగ్గింపును అందిస్తున్నట్లు తెలిపింది. దేశంలో ఎక్కువ మంది యూ జర్లకు చేరువయ్యేందుకు ప్రీమి యం సబ్‌స్క్రిప్షన్‌ను భారీగా 48 శాతం తగ్గిస్తున్నట్టు వెల్లడించిం ది. దీనిపై ఇప్పటివరకు నెలకు రూ.900 వసూలు చేయగా.. దానిని రూ.470కి తగ్గించింది. ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను తీసుకున్న వినియోగదారులు బ్లూటిక్ పొందడం సహ సుదీర్ఘ పోస్టులు చేసుకోవడానికి వీలు కల్పిస్తోన్నట్టు పేర్కొంది. అదే విధంగా వెబ్ మోడ్‌లో ఎక్స్‌ను వినియోగించే వారికి నెల ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ధరను రూ.650 నుంచి రూ.427కి తగ్గించింది. నెలవారీ బేసిక్ సబ్‌స్క్రిప్షన్ చార్జీలను రూ.244 నుంచి రూ.170కి తగ్గించింది. బేసిక్ వినియోగదారుల వార్షిక సబ్‌స్క్రిప్షన్‌లను కూడా రూ.2,590 నుంచి రూ.1,700 తగ్గించినట్టు ఎక్స్ వెల్లడించింది. తన ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఎక్స్ 2023 అక్టోబర్‌లో తొలిసారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది.

## టాటా విద్యుత్ వాహనాలపై భారీ డిస్కౌంట్లు



ఈ ఏడాది జూన్‌లో కంపెనీ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు గత ఏడాదితో పోలిస్తే 15 శాతం మేరకు తగ్గిన నేపథ్యంలో టాటా మోటార్స్ అమ్మకాలను పెంచుకునేందుకు ఎలక్ట్రానిక్ వాహనాలపై భారీ డిస్కౌంట్లు ప్రకటించింది. హారియర్ ఈవీపై దాదాపు లక్ష రూపాయల డిసౌంట్లను ప్రకటించింది.అయితే ఈ పరిమిత ఆఫర్ కేవలం ఎంపిక చేసిన వేరియంట్లపైన కొన్ని నగరాల్లోనే అందుబాటులో ఉంటుంది.టాటా వాహన యజమానుల కు లాయల్టీ ప్రయోజనాలు లభిస్తాయి.టాటా టియాగో లాంగ్‌రేంజ్ వేరియంట్‌పై రూ. 40 వేల వరకు డిస్కౌంట్ పొందవచ్చు. వినియోగదారులు తమ పాత కారును అమ్మే సమయంలో రూ.20 వేల క్యాష్ డిస్కౌంట్, రూ.20 వేలు ఎక్స్‌చేంజ్ బోనస్‌గా పొందవచ్చు. కంపెనీ టాటా పంచ్ ఈవీపైనా ఇదేతరహా డీల్‌ను అందిస్తోంది.అలాగే దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఈవీల్లో ఒకటైన టాటా నెక్సాన్‌పైనా రూ.30 వేల ఎక్స్‌చేంజ్ బోనస్‌ను అందిస్తోంది. అదనంగా లాయల్టీ ప్రయోజనాలు, 6 నెలల పాటు టాటాపవర్ చార్జింగ్ స్టేషన్లలో వెయ్యి యూనిట్ల ఉచిత చార్జింగ్‌ను అందిస్తోంది. టాటా కర్వ్ ఈవీపై కొనుగోలుదారులు రూ.50 వేల వరకు ఎక్స్‌చేంజి బోనస్‌తో పాటు లాయల్టీ రివార్డు పొందవచ్చు. అలాగే మొదటి వెయ్యి కొనుగోలుదారులకు టాటా పవర్ చార్జింగ్ స్టేషన్లలో ఆరు నెలల పాటు ఉచిత చార్జింగ్ సదుపాయాన్ని కల్పిస్తోంది.

## ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డ్

నేటి ప్రపంచంలో క్రెడిట్ కార్డులు సర్వసాధారణం అయినప్పటికీ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సెంచూరియన్ కార్డ్ లేదా బ్లాక్ కార్డ్ వంటి ప్రత్యేక కార్డులు ఉన్నాయి. ఇది అతి ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ కార్డుకు ఆహ్వానం ద్వారా మాత్రమే అర్హత పొందవచ్చు. నేటి ప్రపంచంలో క్రెడిట్ కార్డులు రోజువారీ జీవితంలో ఒక భాగంగా మారాయి. ముఖ్యంగా చాలా మంది వ్యక్తులు ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులను కలిగి ఉంటున్నారు. సినిమా టిక్కెట్లపై డిస్కౌంట్లు, రివార్డ్ పాయింట్లు, ఉచిత విమానాశ్రయ లాంజ్ యాక్సెస్ వంటి ప్రయోజనాలను పొందేందుకు వివిధ కార్డులను వాడుతున్నారు. ఈ ప్రోత్సాహకాలు వినియోగదా రులకు పరోక్షంగా డబ్బు ఆదా చేయడంలో సహాయపడ తాయి. అయితే, క్రెడిట్ కార్డులను జాగ్రత్తగా ఉపయోగించకుండా ఉండటం వల్ల ఆర్థిక నష్టానికి దారి తీయొచ్చు. అయితే క్రెడిట్ కార్డ్ చాలా రకాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డ్ గురించి తెలుసుకుంటే.. దాన్ని అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సెంచూరియన్ కార్డ్ అని పిలుస్తారు. దీనిని అమెక్స్ బ్లాక్ కార్డ్ అని కూడా అంటారు. నివేదికల ప్రకారం.. ఈ కార్డు ఖరీదైనది మాత్రమే కాదు, చాలా ప్రత్యేకమైనది కూడా. ఇది అందరికీ అందుబాటులో ఉండదు. సాధారణ కార్డుల మాదిరిగా దరఖాస్తు చేసుకోలేం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు లక్ష మంది మాత్రమే ఈ కార్డును కలిగి ఉన్నారు. భారతదేశంలో దాదాపు 200 మంది మాత్రమే దీనిని కలిగి ఉన్నారని నివేదికలు చెబుతున్నాయి. దీనిని 2013లో భారత మార్కెట్లో ప్రవేశపెట్టారు. అమెక్స్ బ్లాక్ కార్డ్ ఆహ్వానం ద్వారా మాత్రమే ఇస్తారు. అది కూడా చాలా ఎక్కువ ఆదాయం, ఖర్చు చేసే అలవాట్లు ఉన్న వ్యక్తులకు ఇస్తారు. నివేదికల ప్రకారం.. ఈ కార్డు పొందేందుకు అర్హత సాధించడానికి 10 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసే సామర్థ్యం ఉండాలి. ఈ కార్డు కేవలం అతి ధనవంతుల కోసం మాత్రమే అని స్పష్టంగా తెలుస్తోంది. అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సెంచూరియన్ కార్డ్ సాధారణ కార్డులు అందించని విలాసవంతమైన అనుభవాలను అందిస్తుంది.



## తండ్రికి తగ్గ తనయుడు.. టీమిండియాపై వీరోచిత పోరాటం!

ఇంగ్లండ్ యువ సంచలనం, అండర్-19 ఆటగాడు రాకీ ఫ్లింటాఫ్ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకుంటున్నాడు. ఇంగ్లండ్ దిగ్గజం ఆండ్రూ ఫ్లింటాఫ్ తనయుడైన రాకీ.. బెకెన్‌హామ్ వేదికగా భారత అండర్-19తో జరుగుతున్న తొలి టెస్టులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 32 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయం?లో రాకీ ఫ్లింటాఫ్ తన వయసుకు మించిన పరిణతిని ప్రదర్శించాడు. కెప్టెన్ హమ్జా షేక్ తో కలిసి అతను 154 పరుగుల కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఓ దశలో సునాయసంగా తన సెంచరీ మార్క్‌ను అందుకునేలా కన్పించిన రాకీ.. 93 పరుగుల వద్ద దీపేష్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. అతడి ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. మూడో రోజు లంచ్ బ్రేక్ సమయానికి ఇంగ్లండ్ యువ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 338 పరుగులు చేసింది. క్రీజులో అల్బర్ట్(18),ఏకాన్ష్ సింగ్(59) ఉన్నారు. ఇంగ్లండ్ ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కంటే 202 పరుగుల వెనకంజలో ఉంది. అంతకుముందు భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 540 పరుగుల భారీ స్కోర్ సాధించింది. భారత బ్యాటర్లలో కెప్టెన్ ఆయుశ్ మాత్రే (102) సూపర్ సెంచరీతో చెలరేగగా.. విహాన్ మల్హోత్రా (67), అభిగ్యాన్ కుందు (90), రాహుల్ కుమార్ (85), ఆర్ఎస్ అంబరీష్ (70) అర్ధ సెంచరీలతో రాణించారు.



## చరిత్ర సృష్టించిన ఆసీస్ పేసర్.. 110 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి..

ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. సమకాలీన బౌలర్లలో ఎవరికీ సాధ్యం కాని అరుదైన ఘనత సాధించాడు. 1915 తర్వాత టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు. వెస్టిండీస్‌తో మూడో టెస్టు సందర్భంగా బోలాండ్ ఈ ఫీట్ నమోదు చేశాడు. కాగా వెస్టిండీస్ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా ఆతిథ్య జట్టుతో మూడు టెస్టులు, ఐదు టీ20లు ఆడుతోంది. ఇందులో భాగంగా తొలుత టెస్టు సిరీస్ మొదలుకాగా.. మొదటి రెండు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది ఆసీస్.

**225 పరుగులకు ఆసీస్ ఆలౌట్**

ఈ క్రమంలో విండీస్- ఆసీస్ మధ్య నామమాత్రపు మూడో టెస్టు జమైకా వేదికగా శనివారం మొదలైంది. కింగ్‌స్టన్‌లోని సబీనా పార్క్ మైదానంలో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బ్యాటింగ్ చేసింది. కామెరాన్ గ్రీన్ (46), స్టీవ్ స్మిత్ (48) రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 225 పరుగులు చేయగలి గింది. విండీస్ బౌలర్లలో షమార్ జోసెఫ్ నాలుగు వికెట్లు కూల్చగా.. జేడన్ సీల్స్, జస్టిన్ గ్రీవ్స్ తలా మూడు వికెట్లు పడగొట్టారు.

**143 పరుగులకు కుప్పకూలిన విండీస్**



ఇక ఆసీస్ ఆలౌట్ అయిన తర్వాత తమ తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన వెస్టిండీస్.. 143 పరుగులకే కుప్పకూలింది. జాన్ కాంప్‌బెల్ చేసిన 36 పరుగులే విండీస్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోర్. దీనిని బట్టి ఆసీస్ బౌలర్ల విజృంభణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. స్కాట్ బోలాండ్ అత్యుత్తమంగా 13.1 ఓవర్లలో కేవలం 34 పరుగులు ఇచ్చి ఏకంగా మూడు వికెట్లు కూల్చాడు. మిగతా వారిలో కెప్టెన్ ప్యాట్ కమిన్స్, జోష్ హాజిల్‌వుడ్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్ ఒక్కో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. కాగా వెస్టిండీస్‌తో టెస్టులో ఉత్తమంగా రాణించిన స్కాట్ బోలాండ్.. ఓ అరుదైన రికార్డును సాధించాడు. 1915 తర్వాత టెస్టు క్రికెట్‌లో కనీసం 2000 డెలివరీలు సంధించిన బౌలర్లలో అత్యుత్తమ సగటు కలిగిన ఆటగాడిగా నిలిచాడు. తన నాలుగేళ్ల కెరీర్‌లో 17.33 సగటుతో బోలాండ్ 59 వికెట్లు కూల్చాడు. ఇక 1901- 1914 వరకు ఇంగ్లండ్‌కు ఆడిన సిడ్నీ బార్న్స్ 16.43 సగటుతో వికెట్లు కూల్చాడు.

1915 నుంచి ఇప్పటికి.. 2000 డెలివరీల తర్వాత అత్యుత్తమ బౌలింగ్ యావరేజ్ కలిగి ఉన్న బౌలర్లు (యాక్టివ్ క్రికెటర్లలో)

స్కాట్ బోలాండ్ (ఆస్ట్రేలియా): 2021-2025- 17.33 సగటుతో 59 వికెట్లు
బెర్ట్ ఐరన్‌మోంగర్ (ఆస్ట్రేలియా): 1928- 1933- 17.97 సగటుతో 74 వికెట్లు
ఫ్రాంక్ టైసన్ (ఇంగ్లండ్): 1954- 1959- 18.56 సగటుతో 76 వికెట్లు
అక్షర్ పటేల్ (ఇండియా): 2021-2024- 19.34 సగటుతో 55 వికెట్లు
జస్‌ప్రీత్ బుమ్రా (ఇండియా): 2018-2025- 19.48 సగటుతో 217 వికెట్లు. ఖ


## క్రీడా వాయిస్

## దక్షిణాఫ్రికా స్టార్ ఓపెనర్‌కు ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు



సౌతాఫ్రికా స్టార్ ప్లేయర్ ఐడెన్ మార్‌క్రమ్.. జూన్ నెలకు గాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్‌ది మంత్ అవార్డు గెలుచుకున్నాడు. గత నెలలో డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత ప్రదర్శనకు గాను మార్‌క్రమ్‌కు ఈ ప్రతిషాత్మక అవార్డు దక్కింది. ఫైనల్ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన మార్‌క్రమ్..సౌతాఫ్రికాకు 28 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్‌ను అందించాడు. ఈ మ్యాచ్‌లో బంతితో కూడా అతడు రాణించాడు. ఈ అవార్డు కోసం మార్‌క్రమ్‌తో పాటు తన సహచరుడు టెంబా బావుమా, శ్రీలంక ఓపెనర్ పాతుమ్ నిస్సాంక పోటీ పడ్డారు. కానీ కీలకమైన ఫైనల్లో సెంచరీతో చేయడంతో మార్‌క్రమ్ వారిద్దరిని వెనక్కి నెట్టి ఈ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఈ ప్రతిష్టత్మక ఐసీసీ అవార్డు అందుకోవడం తనకు దక్కిన అరుదైన గౌరవమని మార్‌క్రమ్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. మరోవైపు మహిళల విభాగంలో ఈ అవార్డును వెస్టిండీస్ కెప్టెన్ హీలీ మాథ్యూస్ సొంతం చేసుకుంది. గత నెలలో దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లలో మాథ్యూస్ అసాధరణ ప్రదర్శన కనబరిచింది. రెండు సిరీస్‌లలోనూ ఆల్ రౌండ్ షోతో మాథ్యూస్ అదరగొట్టింది. దీంతో ఆమె దక్షిణాఫ్రికాకు చెందిన టాజ్మిన్ బ్రిట్స్, వెస్టిండీస్‌స్పిన్నర్ అఫీ ఫ్లెచర్‌లను అధిగమించి ఈ అవార్డును గెలుచుకుంది.

# ఉదయ్‌పూర్ ఫైల్స్ చిత్రంపై స్టే.. పిటీషన్ విచారణకు సుప్రీంకోర్టు ఆమోదం



న్యూఢిల్లీ: ఉదయ్‌పూర్ ఫైల్స్ చిత్రం రిలీజ్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ స్టేను సవాల్ చేస్తూ ఇవాళ చిత్ర నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అత్యవసరంగా తమ పిటీషన్‌పై విచారణ చేపట్టాలని కోరారు. అయితే ఆ సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు సుప్రీంకోర్టు చెప్పింది. బుధవారం లేదా మరుసటి రోజు.. ఉదయ్‌పూర్ ఫైల్స్ చిత్రం స్టేపై విచారణ జరపనున్నట్లు జస్టిస్ సూర్య కాంత్, జోయ్‌మల్యా బగ్చీతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. ఉదయ్‌పూర్ ఫైల్స్:కన్నయ్య లాల్ టేలర్ మర్డర్ టైటిల్‌తో ఈనెల 11వ తేదీన సినిమాను రిలీజ్ చేయాలని భావించారు. వాస్తవానికి ఆ సినిమాకు సీబీఎఫ్‌సీ సర్టిఫికేట్ వచ్చింది. కానీ ఆ ఫిల్మ్‌ను ప్రదర్శించరాదు అని ఢిల్లీ హైకోర్టు రిలీజ్‌పై స్టే ఇచ్చింది. సినిమాను పర్మనెంట్‌గా బ్యాన్ చేయాలని కోరుతూ కొందరు అభ్యరిస్తున్నారని, దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలని, అప్పటి వరకు ఉదయ్‌పూర్ ఫైల్స్ చిత్రాన్ని రిలీజ్ చేయకుండా స్టే ఇస్తున్నామని ఢిల్లీ హైకోర్టు జూలై 10వ తేదీన కోర్టులో పేర్కొన్నది. సమాజంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ ఫిల్మ్‌ను బ్యాన్ చేయాలని హైకోర్టు అభిప్రాయపడింది. జామియత్ ఉలామా ఇ హింద్ అద్యక్షుడు, దారుల్ ఉలూమ్ దియోబాండ్ ప్రిన్సిపాల్ మౌలానా అర్షద్ మదాని ఫిల్మ్‌పై బ్యాన్ విధించాలని తన పిటీషన్‌లో కోరాడు. జూన్ 26వ తేదీన రిలీజైన ట్రైలర్‌లో అభ్యంతరకరమైన డైలాగ్‌లు ఉన్నాయని పిటీషన్‌లో పేర్కొన్నాడు. పిటీషనర్ల కోసం జూలై 9న చిత్రాన్ని ప్రదర్శించాలని హైకోర్టు తన తీర్పులో నిర్మాతలను ఆదేశించింది. ఉదయ్‌పూర్‌కు చెందిన టేలర్ కన్నయ్య లాల్‌ను 2022 జూన్‌లో మర్డర్ చేశారు. మొహమ్మద్ రియాజ్, మొహమ్మద్ గౌస్ ఆ హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ నేత నుపుర్ శర్మ చేసిన వ్యాఖ్యలకు చెందిన అంశాన్ని కన్నయ్య లాల్ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన నేపథ్యంలో అతన్ని హతమార్చారు. ఎన్ఐఏ పోలీసులు ఈ కేసు విచారిస్తున్నారు. యూఏపీఏ కింద నిందితులపై కేసు పెట్టారు. జైపూర్‌లోని ఎన్ఐఏ కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నది.




# కిరణ్ అబ్బవరం బర్త్ డే స్పెషల్ .. అంచనాలు పెంచిన గ్లింప్స్

టాలీవుడ్‌లో హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా వైవిధ్యమైన సినిమాలు చేస్తున్న హీరో కిరణ్ అబ్బవరం. రాజావారు రాణిగారు సినిమాతో తెలుగుతెరకు పరిచయం అయిన ఈ కుర్ర హీరో మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇక ఆ తరువాత ఏడాదికి నాలుగైదు సినిమాలు రిలీజ్ చేయడం మొదలుపెట్టాడు. అయితే కిరణ్ సినిమాల్లో కొత్తదనం లేదని ప్రేక్షకులు పలు విమర్శలు చేశారు. దాంతో తాను చేసిన తప్పేంటో తెలుసుకున్న కిరణ్ ఒక ఏడాది గ్యాప్ తీసుకొని.. లుక్, కథ అన్ని మార్చి క సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ సినిమా భారీ విజయాన్ని అందుకోవడంతో కిరణ్ వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులని అలరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పటికే – ర్యాంప్ సినిమా సెట్స్ మీద ఉండగా.. ఇటీవల మరో సినిమాను ప్రకటించాడు. . రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు బేబీ డైరెక్టర్ సాయి రాజేష్ కథను అందిస్తున్నాడు. ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ సినిమాకు చెన్నై లవ్ స్టోరీ అనే టైటిల్ ను ఖరారు చేశారు. ఇందులో గౌరీ ప్రియ హీరోయిన్ గా నటిస్తుంది. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన ఒక చిన్న గ్లింప్స్ విడుదల కాగా, ఆ గ్లింప్స్ తోనే మణిశర్మ సినిమాపై అంచనాలు పెంచాడు. ఇక ఈ రోజు కిరణ్ అబ్బవరం బర్త్ డే సందర్భంగా కె ర్యాంప్ సినిమాకి సంబంధించి గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇందులో కిరణ్ బాడీ లాంగ్వేజ్, స్టైల్ చూస్తుంటే మూవీ మంచి హిట్ సాధించడం ఖాయం అంటున్నారు. గ్లింప్స్ ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంటుంది.

# సినీ ఇండస్ట్రీలో మరో విషాదం..! అలనాటి నటీమణి సరోజాదేవి కన్నుమూశారు..






వెండితెరను ఏలిన అలనాటి నటీమణి సరోజాదేవి కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో సరోజాదేవి తుదిశ్వాస విడిచారు. ఎన్టీఆర్, ఎంజీఆర్, ఏఎన్నార్‌తో నటించారామె.. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో 200 సినిమాలకుపైగా సరోజాదేవి నటించి మెప్పించారు. 1938 జనవరి 7న సరోజాదేవి జన్మించారు. సరోజా దేవి 1955లో 'మహాకవి కాళిదాస' చిత్రం ద్వారా నటనా రంగ ప్రవేశం చేసింది. ఆ సమయంలో ఆమెకు 17 సంవత్సరాలు. పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు సరోజాదేవిని వరించాయి. బడిపంతులు, భూకైలాస్, సీతారామ కల్యాణం, కష్టసుఖాలు వంటి సూపర్‌హిట్ సినిమాల్లో ఆమె నటించారు. జగదేకవీరుని కథ, ఇంటికి దీపం ఇల్లాలే, పవిత్ర ప్రేమ, శ్రీకృష్ణార్జున యుద్ధము, దానవీర శూర కర్ణ, ఆత్మబలం వంటి సినిమాలతో ఆమె ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయారు. సరోజాదేవి మరణం పై టాలీవుడ్ సెలబ్రెటీలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. సరోజాదేవి 1967లో హర్షను వివాహం చేసుకుంది. ఆమె భర్త 1986లో మరణించారు. ఇప్పుడు సరోజాదేవి అంత్యక్రియలు ఆమె భర్త హర్ష సమాధి పక్కనే జరగనున్నాయి.సరోజాదేవికు 87 సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సరోజా దేవి కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత వ్యాధులతో బాధపడుతోంది. ఆమె ఆరున్నర దశాబ్దాలుగా చిత్ర పరిశ్రమలో ఉన్నారు.



# ఆ సినిమా కోసం కేవలం పది రోజుల్లో పది కిలోల బరువు తగ్గిన శింబు

తమిళ సినీ పరిశ్రమలో తన టాలెంట్‌తో ఎంతగానో ఆకట్టుకుంటున్న నటుడు శిలంబరసన్ అలియాస్ శింబు. కొన్నేళ్ల క్రితం వరకూ వ్యక్తిగత వివాదాలతో, కెరీర్ లో అంతగా ఎదగలేకపోయాడు. ఇప్పుడు మాత్రం తన దృష్టి అంతా సినిమాలపై ఉంచుతూ చాలా డెడికేషన్‌తో వైవిధ్యమైన సినిమాలు చేస్తున్నాడు. తాజాగా శింబు, పేరున్న దర్శకుడు వెట్రిమారన్ దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్ట్ చేయబోతున్నాడు. గతంలో ధనుష్‌తో కలిసి వడ చెన్నై వంటి కల్ట్ క్లాసిక్‌ను తెరకెక్కించిన వెట్రిమారన్, అదే బ్యాక్‌డ్రాప్‌తో శింబు కోసం కొత్త కథను సిద్ధం చేశాడు. ఈ సినిమా కోసం వెట్రిమారన్, వడ చెన్నై రైట్స్‌ను కూడా ధనుష్ నుంచి అధికారికంగా తీసుకున్నట్లు సమాచారం. ఇందులో ఆసక్తికర అంశం ఏంటంటే, ఈ సినిమాలోని పాత్ర కోసం శింబు కేవలం 10 రోజుల్లో 10 కిలోల బరువు తగ్గాడు! ఇప్పటికే 'థగ్ లైఫ్'లో నాజూకు లుక్‌లో కనిపించిన శింబు, ఇప్పుడు వెట్రిమారన్ సినిమాలో మరింత బక్కగా కనిపించనున్నాడట. పాత్ర డిమాండ్ చేయడంతో శింబు కష్టపడి బరువు తగ్గాడు. శింబు బరువు సినిమాలోని పాత్రల కోసం తరచుగా మారుతూనే ఉంటుంది. కొన్ని పాత్రల కోసం బరువు పెరిగితే, మరికొన్నింటి కోసం బరువు తగ్గుతాడు. ఉదాహరణకు, 'మానాడు' సినిమా కోసం దాదాపు 30 కేజీల బరువు తగ్గాడు. మరొక సినిమా కోసం 13 కేజీలు తగ్గినట్టు సమాచారం.. అయితే, కొన్ని పాత్రల కోసం బరువు పెరిగే అవసరం కూడా ఉంటుంది, ఉదాహరణకు, 'అన్బానవన్ అసరాదవన్ అడంగదవన్' సినిమాలో ఒక వృద్ధుడి పాత్ర కోసం బరువు పెరిగారు. ఇప్పుడు వెట్రిమారన్ సినిమా కోసం ఏకంగా 10 కేజీల బరువు తగ్గాడు. చిత్రంలో శింబు పాత్ర అత్యంత నేచురల్‌గా ఉంటుందట. ఇంతకుముందు 'వడ చెన్నై 2' ధనుష్‌తో చేయాలని భావించిన వెట్రిమారన్, అది కుదరకపోవడంతో కొత్త కథను తీసుకుని, శింబుతో సినిమాను తెరకెక్కించబోతున్నాడు. ఇందులో మరో విశేషం ఏంటంటే, 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కూడా ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషించనున్నాడు. ఈ సినిమాకు సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే రానుండగా, సెట్స్‌పైకి ఈ నెలాఖరులోపే వెళ్లే అవకాశం ఉంది. వచ్చే ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.



# కుందనపు బొమ్మలా రెజీనా..

అందాల ముద్దుగుమ్మ రెజీనా కసాండ్రా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు ఈ అమ్మడు అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే, పిల్లా నువ్వు లేని జీవితం సీనిమాతో తెలుగులో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఈ బ్యూటీ తాజాగా, నులక మంచంతో బ్రౌన్ కలర్ లంగావోనీలో ఉన్న ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఇవి అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. బ్యూటీ రెజీనా కసాండ్రా గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ బ్యూటీ సొంతం. 2012లో శివ మనసులో శృతి సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ అమ్మడు, మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుని, సైమా ఉత్తమ తొలి చిత్ర నటిగా అవార్డు అందుకుంది. ఇక ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు ప్రతి ఒక్కరు ఫిదా అయిపోయారు. అంతలా తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. ఇక ఈ సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మకు చాలా సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. దీంతో రెజీనా, రోటీన్ లవ్ స్టోరీ, పిల్లానువ్వు లేని జీవితం, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్, పవర్, వంటి చాలా సినిమాల్లో నటించింది. ముఖ్యంగా పిల్లా నువ్వు లేని జీవితం మూవీతో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇక తెలుగులో సందీప్ కిషన్‌తో పలు సినిమాలు చేసింది. అయితే ఈ క్రమంలోనే ఈ బ్యూటీ ఈ హీరోతో ప్రేమలో ఉన్నట్లు అనేక వార్తలు వచ్చాయి. కానీ వీటన్నింటిని సందీప్ కిషన్ కొట్టిపారేస్తూ.. తాము మంచి స్నేహితులం అంటూ క్లారిటీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయినప్పటికీ రూమర్స్ మాత్రం ఆగడం లేదు. రెజీనా కసాండ్రా ప్రస్తుతం తెలుగులో ఎక్కువ సినిమాలు చేయకపోయినప్పటికీ, కోలీవుడ్‌లో మాత్రం వరసగా ఆఫర్స్ అందుకుంటూ బిజీగా గడుపుతున్నట్లు సమాచారం. అంతే కాకుండా ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బుల్లితెర డ్యాన్స్ షో ఢీలో జడ్జీగా వ్యవహరిస్తుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తాజాగా, బ్రౌన్ కలర్ లంగావోనీలో, నులక మంచం వద్ద అందంగా పలు ఫొటోలకు ఫోజులిచ్చింది. ఇవి నెటిజన్స్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com